సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 266

శనివారం 10-6-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



ఆసీస్‌దే పైచేయి!

రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 123/4 ప్రస్తుత ఆధిక్యం 296 పరుగులు -13లో



ఐసీఏఆర్‌తో అమెజాన్ ఒప్పందం

రైతులకు తోడ్పాటు అందించడంపై దృష్టి 'కేవీకే'ల్లో సాగు విధానాలు -13లో



రహస్యపత్రాల ఉచ్చులో ట్రంప్ !

రహస్య పత్రాల కేసులో గూఢచర్య చట్టం కింద అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై నేరాభియోగాలు నమోదయ్యాయి.

వివరాలు 6లో ▸



సలహాదారులుగా కొనసాగలేం

సిలబస్‌లో కోతలను నిరసిస్తూ తమను ప్రధాన సలహాదారుల నుంచి తొలగించాలని ఇద్దరు ఎన్‌సీఈఆర్‌టీకి లేఖ రాశారు.

వివరాలు 6లో ▸



తానే ఆత్మహత్య చేసుకుంది

సరస్వతిని తాను చంపలేదని..ఆమె విషం తాగి మరణించిందని ముంబై మహిళ హత్య నిందితుడు మనోజ్ చెప్పాడు.

వివరాలు 6లో ▸



మీ రాక కోసం ఎదురు చూస్తున్నాం

భారత ప్రధాని మోదీ రాక కోసం తాము ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామని అమెరికా రక్షణ శాఖ తెలిపింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

'అన్నదాత'కు అండగా

నిలిచిందెవరు?

చంద్రబాబు హయాంలో దళారులదే రాజ్యం

- ఏనాడూ వరికి బోనస్ ప్రకటించిన దాఖలాలే లేవు
- నేడు ప్రతి గింజను కొనుగోలు చేస్తోన్న ప్రభుత్వం
- గన్నీబ్యాగ్‌లు, హమాలి, రవాణా చార్జీల భారం సర్కారుదే
- పంటల వారీగా పెట్టుబడి ఖర్చు ఆధారంగా ఎమ్మెస్పీకి సిఫార్సు
- కేరళ, తమిళనాడు, జార్ఖండ్ రాష్ట్రాల్లో బోనస్ ఇస్తున్నా పెరగని వరి సాగు
- అంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చే పంటల వైపే వాళ్ల మొగ్గు
- వాస్తవాలకు మసిపూసి 'ఈనాడు' విష ప్రచారం

- వివరాలు 3లో

మీరు బాగుంటేనే ప్రజలు బాగు

ఉద్యోగులకు మంచి చేయాలన్నదే మా ఉద్దేశం: సీఎం జగన్

- జీపీఎస్, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఉద్యోగ సంఘాల హర్షం
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఆయా సంఘాల ప్రతినిధులు
- భవిష్యత్‌లోనూ మేలు జరగాలనే దిశగా అడుగులేశామన్న సీఎం
- మీ మనసులో కష్టం ఉండకూడదని తపనపడ్డాం
- పెన్షన్ సహా కొన్ని పరిష్కారాల కోసం రెండేళ్లుగా సుదీర్ఘ కసరత్తు
- జీపీఎస్‌తో భవిష్యత్‌కు భరోసా
- మంత్రివర్గం నిర్ణయాలన్నీ 60 రోజుల్లోగా అమలయ్యేలా ఆదేశాలు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి జరగాల్సిన మంచి ఏదైనా సరే చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములని, వారంతా చిరునవ్వుతో ఉండేలా చూస్తామని అన్నారు. ఉద్యోగులు బాగుంటేనే ప్రజలు బాగుంటారని విశ్వసించిన ప్రభుత్వం మనదని, ఉద్యోగుల మనసులో కష్టం ఉండకుండా చూడాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. ఉద్యోగుల విషయంలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను 60 రోజుల్లోగా అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కొత్తగా..

మిగతా 2వ పేజీలో ▶

ఇచ్చిన మాట నిలుపుకున్న సీఎం: ఉద్యోగ సంఘాలు 2లో

ఇకనుంచి ఈ-గస్తీ

పోలీస్ స్టేషన్లకు ఫింగర్ ప్రింట్ డివైస్‌లు

- రాత్రివేళ గస్తీ కాసే సిబ్బందికి అందజేత
- నేరస్తుల వేలిముద్రల డేటా డిజిటలీకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రాత్రి వేళ నిర్వహించే గస్తీని పోలీస్ శాఖ ఆధునికీకరిస్తోంది. ఇప్పటికే ఈ-బీట్ (ఎలక్ట్రానిక్ బీట్) విధానాన్ని ప్రవేశపెట్టిన పోలీస్ శాఖ బీట్ బుక్‌లలో ఫొటోలు, ఇతర వివరాలను పొందుపరుస్తూ డైనమిక్ నాలెడ్జ్ బీట్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఇకపై రాత్రి వేళ గస్తీ విధులకు ఆధునిక సాంకేతికతను మరింతగా జోడిస్తూ మొబైల్ (పామిలోన్) ఫింగర్ ప్రింట్ డివైస్‌లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీని వల్ల అనుమానితుల నేర చరిత్రను తక్షణం పరిశీలించి తగిన చర్యలు తీసుకునే సౌలభ్యం ఉంటుంది. దొంగతనాలు, దాడులు, ఘర్షణలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకుగాను ఈ కొత్త విధానాన్ని రూపొందించింది.

నేర చరితుల గుర్తింపు మరింత సులభం

ఇప్పటివరకు రాత్రి వేళల్లో గస్తీ విధులు నిర్వహించేటప్పుడు అనుమానాస్పదంగా కనిపించిన వారిని పోలీసులు నిశితంగా ప్రశ్నిస్తున్నారు. అప్పటికీ సందేహం తీరకపోతే వారి గుర్తింపు కార్డులు, ఇతర వివరాలను పరిశీలిస్తున్నారు. దీనివల్ల వారు చెప్పే సమాధానాలు ఎంతవరకు సరైనవో అప్పటికప్పుడు నిర్ధారించే విధానంగానీ.. వారికి నేర చరిత్ర ఉందా లేదా అన్నది కూడా తెలుసుకునే అవకాశం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగానే మొబైల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌లను పోలీస్‌లకు అందించాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఎవరైనా సందేహాస్పదంగా కనిపిస్తే వారిని ప్రశ్నించడంతోపాటు ఆ ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా వారి వేలి ముద్రలు అప్పటికప్పుడు తీసుకుని పరిశీలిస్తారు. ఆ వ్యక్తికి నేర చరిత్ర ఉంటే వెంటనే ఆ వివరాలను ఆ డివైస్ వెల్లడిస్తుంది. దాంతో ఆ వ్యక్తిని పోలీస్‌లు వెంటనే అదుపులోకి తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. దాంతో నేరం జరగకుండా సమర్థంగా నిలువరించడం సాధ్యపడుతుంది.

అన్ని స్టేషన్లకు మొబైల్ డివైస్‌లు

రాష్ట్రంలో ఉన్న 1,021 పోలీస్ స్టేషన్లకు మొబైల్ (పామిలోన్) ఫింగర్ ప్రింట్ డివైస్‌లు సమకూర్చాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. అరచేతిలో ఇమిడిపోయే ఈ పరికరాలను ఇప్పటికే 512 పోలీస్ స్టేషన్లకు సమకూర్చారు. మిగిలిన పోలీస్ స్టేషన్లకు కూడా త్వరలోనే సమకూర్చనున్నారు. వాటిని రాత్రివేళల్లో గస్తీ విధులు నిర్వహించే పోలీస్ వాహనంలో ఉంచుతారు. అనంతరం ఒక్కో పోలీస్ స్టేషన్‌కు మరిన్ని డివైస్‌లను కూడా సమకూర్చాలని పోలీస్ శాఖ భావిస్తోంది.

10 లక్షల మంది నేర చరితుల వేలి ముద్రల డిజిటలీకరణ

ఏపీతోపాటు తెలంగాణలో నేర చరిత్ర కలిగిన దాదాపు 10 లక్షల మంది వేలి ముద్రలను పోలీస్ శాఖ ఇప్పటికే సేకరించింది. దొంగతనాలు, అత్యాచారాలు, హత్యలు, ఇతర నేరాలకు పాల్పడిన చరిత్ర ఉన్న వారి వేలి ముద్రలను సంబంధిత పోలీస్ స్టేషన్ల ద్వారా సేకరించారు. ఈ వేలిముద్రలను డిజిటలీకరించి సమగ్ర డేటాను రూపొందించి, అన్ని పోలీస్ స్టేషన్లకు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చారు. దాంతోపాటు మొబైల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌లను ఆ డేటాతో అనుసంధానించారు. దాంతో నేర చరిత్ర కలిగిన వారిని తక్షణం గుర్తించేందుకు అవసరమైన పూర్తి డేటా పోలీసుల వద్ద అందుబాటులోకి తెచ్చారు. సందేహాస్పదమైన వ్యక్తులను ప్రశ్నించడంతోపాటు వారి వేలిముద్రలను కూడా వెంటనే పరిశీలించి ఓ నిర్ణయానికి వచ్చేందుకు మార్గం సుగమమైంది. తమిళనాడు, కర్ణాటక, ఒడిశాలోని నేర చరిత్ర కలిగిన వారి వేలిముద్రల డేటాను కూడా సేకరించి డిజిటలైజేషన్ చేసి ఈ డివైస్‌లకు అనుసంధానించాలని పోలీస్ శాఖ భావిస్తోంది.

బడిలో బుక్స్ రెడీ!

- ఏజెన్సీలో మారుమూల స్కూళ్లకూ చేరిన 'కానుక'.. మండల స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు చేరవేత
- 39,95,992 మందికి 'జగనన్న విద్యా కానుక'
- 9వ తరగతికి పూర్తిస్థాయిలో ఎన్సీఈఆర్టీ పుస్తకాలు

3లో

వేగంగా కదులుతున్న రుతుపవనాలు



- 2 రోజుల్లో ఏపీలోకి..!
- అప్పటివరకు కొనసాగనున్న ఉష్ణోగ్రతల తీవ్రత

10లో

ప్రియురాలిని చంపి ఉప్పు పాతరేశాడు!

- గుడికి వచ్చిన యువతితో అక్రమ సంబంధం పెట్టుకున్న వివాహితుడు
- పెళ్లి చేసుకోమనడంతో బెల్లం కొట్టే రాయితో కొట్టి హతమార్చిన పూజారి

2లో

ధాన్యం సొమ్ముల చెల్లింపుల్లో ముందంజ

- పశ్చిమగోదావరి జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు
- 6.37 లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- 70,210 మందికి రూ.1,186.98 కోట్ల చెల్లింపు

సాక్షి, భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లాలో దాళ్వా ధాన్యం కొనుగోలు చివరి దశకు చేరుకుంది. ఒడిదుడుకులను అధిగమిస్తూ దాళ్వా మాసూళ్ల ప్రారంభం నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. వేగంగా ధాన్యం సేకరించడంతో పాటు రైతుల బ్యాంకు ఖాతాలకు ధాన్యం సొమ్ములను త్వరితగతిన జమచేసేలా చర్యలు తీసుకుంది. జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేయగా 6.40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించి ఈ మేరకు 270 రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసింది. మాసూళ్ల సమయంలో అకాల వర్షాలతో కళ్లాల్లోని ధాన్యం తడిసింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం రైతులు ధాన్యం అమ్మకాలకు సహకరించేందుకు గ్రామస్థాయిలోనే వీఆర్వో, వీఏఏ, పంచాయతీ సెక్రటరీ, కో-ఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్లను నియమించింది. జిల్లాలో ఇప్పటివరకు 73,320 మంది రైతుల నుంచి రూ.1,299 కోట్ల విలువైన 6.37 లక్షల టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. దీనిలో 70,210 మంది రైతులకు రూ.1,186.98 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు.

హృదయపూర్వకం..

- బాధితుల పట్ల సీఎం జగన్ ఔదార్యం
- బుధవారం మధ్యాహ్నం రాజోలు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి
- గురువారం సాయంత్రానికి చెక్‌లు అందజేత
- 24 మందికి రూ.26 లక్షల పంపిణీ

'అడగాలే కాని... ఏదైనా ఇచ్చే అన్నయ్య నౌతా'... అని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారు. పేదలు, సామాన్యులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగ బాధితుల పట్ల ఆయన ఔదార్యం చూపించారు. తాము కష్టాలలో ఉన్నామని, ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు కోరిన 24 గంటలలో వారికి సాయం అందించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ తనయుడి వివాహానికి హాజరయ్యేందుకు సీఎం జగన్ బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు బాధితులు సీఎం జగన్‌ను కలసి వినతులు అందజేశారు. సీఎం జగన్‌ను బుధవారం సాయంత్రం ఆర్థిక సహాయం కోరగా, గురువారం సాయంత్రానికి బాధితులకు చెక్‌లను కలెక్టర్ హిమాన్షు శుక్లా లబ్ధిదారులకు అందజేయడం గమనార్హం. 24 మందికి రూ.లక్ష చొప్పున సాయం అందించడంతోపాటు అవసరమైనవారికి ఆరోగ్యశ్రీలో వైద్యం అందించాలని సీఎం జగన్ ఆదేశించారు. సుజాత అనే మహిళకు రూ.రెండు లక్షలు ఇచ్చారు. మొత్తం 25 మందికి రూ.26 లక్షలు అందించారు.

– సాక్షి అమలాపురం




❖ మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన దివ్యాంగుడు కేతా శ్రీనివాసరావు తనకు ఇస్తున్న పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని, తమ ప్రాంతంలో రహదారి నిర్మాణం చేపట్టాలని సీఎం జగన్‌ను కోరారు. వ్యవసాయం చేసుకునే శ్రీనివాసరావుకు సీఎం ఆదేశాల మేరకు రూ.లక్ష తక్షణ సాయంగా అందింది. ఈ సొమ్మును ఉపయోగించుకుని నెలవారీ ఆదాయం పెంచుకోవాలని సూచించారు.




❖ మలికిపురం మండలం పడమటిపాలేనికి చెందిన మేడిద సుజాత కొంతకాలంగా రొమ్ము క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. మెరుగైన చికిత్స కోసం రూ.రెండు లక్షలు కావాలని సీఎం జగన్‌ను అభ్యర్థించారు. సీఎం ఆదేశాల మేరకు రూ.రెండు లక్షల సాయం అందింది.




❖ తలసేమియా, బోన్‌మ్యారో వ్యాధితో బాధపడుతున్న మలికిపురం మండలం గూడపల్లి పల్లిపాలేనికి చెందిన ఎం.జి. ప్రకాష్‌రాజ్ సీఎం జగన్ వద్ద గోడు వెళ్లబోసుకున్నాడు. దీనికి స్పందించిన సీఎం అతనికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించడంతోపాటు మెరుగైన వైద్య సేవలకు ఆదేశించారు.




❖ దివ్యాంగుడైన తాను చిరు వ్యాపారం చేసుకుంటున్నానని, తన వ్యాపార అవసరాల కోసం మూడు చక్రాల మోటారు సైకిల్ కావాలని మలికిపురం మండలం గూడపల్లి గుబ్బలపాలేనికి చెందిన గుబ్బల హేమంత్ కుమార్ కోరాడు. సీఎం జగన్ అతనికి రూ.లక్ష మంజూరు చేశారు.




❖ సఖినేటిపల్లి మండలం గొంది గ్రామానికి చెందిన పోతాబత్తుల వెంకట నారాయణ వేటపై జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న తనను ఆదుకోవాలని కోరగా రూ.లక్ష మంజూరు చేశారు.




❖ మలికిపురానికి చెందిన రాపాక జాన్ విల్సన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నానని విన్నవించాడు. సీఎం జగన్ రూ.లక్ష ఆర్థిక సాయం చేయడంతోపాటు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.




❖ సఖినేటిపల్లికి చెందిన ఆకుల బేబీ వెంకట లక్ష్మి దివ్యాంగురాలు. తనకు ఉపాధి మార్గం చూపాలని కోరారు. సీఎం జగన్ స్పందించి రూ.లక్ష మంజూరు చేశారు. ఈ సొమ్ముతో ఆదాయాన్ని పెంచుకునే ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలని ఆకాంక్షించారు.




❖ మామిడికుదురు మండలం ముత్యాలపాలేనికి చెందిన దివ్యాంగుడు కొండేపూడి బాల నిరుద్యోగి. తనకు ఇస్తున్న పింఛన్‌ను రూ.ఆరు వేలకు పెంచాలని కోరగా, సీఎం జగన్ అతనికి రూ.లక్ష అందించారు. ఈ సొమ్మును ఉపయోగించుకుని నెలవారీ ఆదాయం పెంచుకోవాలన్నారు.




❖ సఖినేటిపల్లి మండలం మోరిపొడుకు చెందిన దివ్యాంగుడు పితాని ఏసుబాబు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందుతున్నాడు. వ్యాపారం విస్తరించేందుకు సహకరించాల్సిందిగా సీఎం జగన్‌ను కోరాగా రూ.లక్ష సహాయం అందించారు.




❖ సఖినేటిపల్లి మండలం అంతర్వేదికి చెందిన దివ్యాంగుడు పొన్నాల పరమేశ్వరరావు నిరుద్యోగి. తనకు పింఛన్ తప్ప మరో ఆదాయ మార్గం లేదని చెప్పగా అతనికి సీఎం జగన్ రూ.లక్ష సాయం అందించారు.

అడిగినవారందరికీ ఆర్థిక సాయం

- సఖినేటిపల్లి మండలం గొందికి చెందిన బొమ్మిడి నర్సింహస్వామి ఫొటో స్టూడియోలో రోజువారీ కూలీగా ఉపాధి పొందుతున్నాడు. రాజోలు మండలం సోంపల్లికి చెందిన కట్టా త్రినాథ్ పాన్‌షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. సఖినేటిపల్లి మండలం శృంగవరప్పాడుకు చెందిన రావి శ్రీనివాసరావు రోజువారీ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. వీరు తమకు రోజువారీ వస్తున్న ఆదాయం సరిపోవడం లేదని పింఛన్ పెంచాల్సిందిగా కోరారు.
- మలికిపురం మండలం బట్టేలంకకు చెందిన చేట్ల రామాంజనేయులు, మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం సరెళ్ల జ్యోతి, మామిడికుదురు మండలం గుర్రం శ్రీనివాసులు, సఖినేటిపల్లి మండలం శృంగవరప్పాడుకు చెందిన తోట పాండురంగ ఆంజనేయులు, మలికిపురానికి చెందిన తిరుమల చిట్టిబాబు. చింతలమోరికి చెందిన మోకా శ్రీనివాస్ నిరుద్యోగులు. రాజోలు మండలం కూనవరానికి చెందిన చోడిశెట్టి రామకృష్ణ చిరు వ్యాపారం చేస్తున్నారు. వీరంతా తమకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.
- రాజోలు మండలం సోంపల్లికి చెందిన మసకపల్లి అఖిల రోజువారీ కూలీ. గాకర్స్ వ్యాధితో బాధపడుతోంది. తనకు నెలకు ఒకసారి ఖరీదైన ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉందని వేడుకున్నారు. సఖినేటిపల్లికి చెందిన కందికట్ల శ్యామ్‌ప్రసాద్ వలంటీర్. కిడ్నీలు పాడయ్యాయని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. రాజోలుకు చెందిన రాయివలస నాగ మల్లేశ్వరిది రజక వృత్తి. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌కు ఆర్థిక చేయూతనివ్వాలని కోరారు. మలికిపురం మండలం తూర్పుపాలెం ఒగ్గు పూజశ్రీ సోరియాసిస్‌తో బాధపడుతోంది. వీరి వినతులను పరిశీలించిన సీఎం జగన్ ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించడంతోపాటు మెరుగైన వైద్యసేవలను ఆరోగ్య శ్రీ ద్వారా అందించాలని అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా...

12న క్రోసూరులో సీఎం జగన్ పర్యటన

వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యా కానుక పథకాన్ని ప్రారంభించనున్న సీఎం

సాక్షి, అమరావతి : ఈ నెల 12వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా క్రోసూరులో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యా కానుక పథకాన్ని ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి క్రోసూరు చేరుకుంటారు. అక్కడ ఏపీ మోడల్ స్కూల్ వద్ద పెదకూరపాడు నియోజకవర్గ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం బహిరంగ సభలో జగనన్న విద్యా కానుక పథకాన్ని ప్రారంభించి, ప్రసంగం అనంతరం విద్యార్థులకు కిట్లు అందజేస్తారు.

'మార్గదర్శి'పై సీఐడీ న్యాయపరమైన చర్యలు

- తమ ప్రతిష్టకు భంగం కలిగించేలా దుష్ప్రచారం చేయడంపై ఆగ్రహం
- త్వరలో రామోజీరావు, శైలజలకు నోటీసులు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎంసీఎఫ్‌ఎల్)పై న్యాయపరమైన చర్యలకు సీఐడీ సన్నద్ధమవుతోంది. ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. దర్యాప్తులో భాగంగా సీఐడీ చర్యలను వక్రీకరిస్తూ, దాని ప్రతిష్టకు భంగకరంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ వ్యవహరిస్తుండటం వివాదాస్పదమవుతోంది. ఉద్దేశపూర్వకంగానే దర్యాప్తు సంస్థతో పాటు అధికారుల గౌరవానికి భంగం కలిగిస్తూ మార్గదర్శి అవాస్తవాలను ప్రచారం చేస్తోందని.. తమ అనుకూల మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తోందని సీఐడీ గుర్తించింది. తద్వారా కేసు దర్యాప్తును ప్రభావితం చేయాలన్నది మార్గదర్శి చిట్‌ఫండ్స్ లక్ష్యమన్నది కూడా స్పష్టమైంది. అందుకే సీఐడీపై దుష్ప్రచారం చేస్తూ దర్యాప్తును ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆ సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఎండీ చెరుకూరి శైలజ కిరణ్‌లపై న్యాయపరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు త్వరలోనే వారికి సీఐడీ నోటీసులు జారీ చేయనున్నట్టు సమాచారం.

చెప్పాడు.. చేశాడు..

ఉద్యోగులకిచ్చిన హామీలన్నీ నిలబెట్టుకున్న జగన్: పేర్ని నాని



సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ నిలబెట్టుకున్నారని మాజీమంత్రి పేర్ని నాని కొనియాడారు. ప్రజలు అనుకుంటున్నట్లుగా జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అన్నది మరోసారి నిరూపితమైందన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియా పాయింట్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీపీఎస్ అంశంపై పాదయాత్ర పురస్కరించుకుని మచిలీపట్నంలో తనను కలిసిన సీపీఎస్ ఉద్యోగులతో జగన్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సీపీఎస్ ఉద్యోగులకు దన్నుగా నిలుస్తూ.. జీపీఎస్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. గతంలో పీఆర్సీ కోసం ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళనలు చేసే పరిస్థితి ఉండేదని.. ఇప్పుడు ఉద్యోగులు అడగకుండానే 12వ పీఆర్సీని ఏర్పాటు చేస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారని నాని తెలిపారు. పదివేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం ద్వారా వారికిచ్చిన మాటను సీఎం నిలబెట్టుకున్నారన్నారు. నిజానికి.. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఒక్కరినైనా రెగ్యులరైజ్ చేశారా? అని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి నిలబెట్టుకోవడం ద్వారా ఎన్నికల మేనిఫెస్టోలో 99% హామీలను అమలుచేశారని ప్రశంసించారు. ఏపీవీవీపీను ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా అందులో పనిచేస్తున్న 15 వేల మందికి లబ్ధి చేకూర్చారన్నారు. మాజీ సీఎం కొడుక్కి ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువగానే ప్రభుత్వం భద్రతను ఇచ్చిందన్నారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు

బొప్పరాజు

సాక్షి, అమరావతి : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిన ప్రభుత్వానికి ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సీఎస్‌కు ఇచ్చిన మెమోరాండంలో ఉన్న 48 డిమాండ్లలో 37 డిమాండ్లు పరిష్కరించారని హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన 11 డిమాండ్ల పరిష్కారానికి కూడా కృషి చేస్తామని చెప్పారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో సీఎస్ జవహర్‌రెడ్డి చిత్తశుద్ధితో వ్యవహరించడమే కాకుండా, ప్రభుత్వ పెద్దల దృష్టికి ఉద్యోగుల డిమాండ్లను తీసుకెళ్లారని ఏపీ జేఏసీ అమరావతి నేతలు అభినందించారు.

మీరు బాగుంటేనే ప్రజలు బాగు

▶ మొదటి పేజీ తరువాయి

జీపీఎస్ (గ్యారంటీ పెన్షన్ స్కీం) తీసుకురావడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ ఉద్యోగుల విలీనం, 12వ పీఆర్సీ ఏర్పాటు సహా పలు అంశాలపై ఈ నెల 7వ తేదీన జరిగిన కేబినెట్‌లో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఉద్యోగుల విషయంలో తీసుకున్న నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులను ఉద్దేశించి సీఎం ఏమన్నారంటే..



ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీఎంను అభినందిస్తున్న సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి తదితరులు

పరిష్కారాల కోసం తపనపడ్డాం

- ఉద్యోగుల మనసు కష్టపెట్టకూడదనే ఉద్దేశంతోనే పెన్షన్ సహా కొన్ని సమస్యల పరిష్కారాల కోసం రెండేళ్లుగా తపన పడ్డాం. గతంలో ఎవరూ కూడా ఒక పరిష్కారం కోసం ఇంతగా తపన పడిన పరిస్థితులు ఎప్పుడూ లేవు. ఉద్యోగులకు పరిష్కారం దొరకాలి.. అంతేకాకుండా భావితరాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలనే ఆలోచన చేశాం. వీటన్నింటి దృష్ట్యా జీపీఎస్ తీసుకువచ్చాం.
- రిటైర్డ్ ఉద్యోగుల జీవన ప్రమాణాలను కూడా నిలబెట్టేదిగా జీపీఎస్‌ను రూపొందించాం. బేసిక్ జీతంలో 50 శాతం అంటే రూ.లక్ష జీతం ఉంటే రూ.50 వేలు రిటైర్ అయిన తర్వాత పింఛన్ వస్తుంది. 62 ఏళ్లకు రిటైర్ అయితే 82 ఏళ్లలో కూడా అదే స్థాయిలో జీవన ప్రమాణాలు ఉండాలని ఆలోచన చేశాం. అందుకే ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని డీఆర్‌లు ఇచ్చేలా జీపీఎస్‌లో పొందుపరిచాం.
- ఉద్యోగులకు న్యాయం జరగాలి.. మరోవైపు నడపలేని పరిస్థితులు రాకుండా కూడా చూడాలని ఆలోచించాం. సీపీఎస్‌లో లేనివి జీపీఎస్‌లో ఉన్నాయి. దీనికోసం రెండేళ్లపాటు ఆర్థిక శాఖ సుదీర్ఘ కసరత్తు చేసింది. ఫలితంగా జీపీఎస్‌కు రూపకల్పన చేశాం.

మంచి జరిగేలా అడుగులేశాం

- న్యాయంగా, ధర్మంగా ఉద్యోగులకు మంచి జరగాలని ప్రతి అడుగులో కనిపించే విధంగా చేశాం. ఇది సంతృప్తినిచ్చే అంశం. అసలు చాలా మంది ఎఫర్ట్ కూడా పెట్టరు. ఇంత ఆలోచన చేయాల్సిన పని ఏముందని అనుకుంటారు. అలా చేస్తే పరిష్కారం రాదు. అందుకే తొలిసారిగా పరిష్కారం దిశగా అడుగులు వేశాం.
- కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కూడా మంచి ఆలోచన చేశాం. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. వారికి మంచి చేయాలన్న ఆలోచనతో అడుగులు ముందుకేశాం. నా దగ్గరకు వచ్చినప్పుడు రాష్ట్ర విభజన కంటే ముందు పదేళ్లను విండోగా అధికారులు నిర్ణయించారు. అలాగైతే మరీ ఆలస్యమవుతుందని ఐదేళ్లకు తగ్గించాం. తద్వారా గరిష్టంగా ఉద్యోగులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకున్నాం.

చిరునవ్వుతో ఉండేలా చేస్తాం

- వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను కూడా ప్రభుత్వంలో విలీనం చేశాం. 010 ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చినట్లుగా వీరికి జీతాలు సమయానికి రావు. పోస్ట్ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో కూడా వ్యత్యాసం ఉంది. ఈ నేపథ్యంలో వారికీ మంచి పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకున్నాం.
- ఇంకా భవిష్యత్తులో ప్రభుత్వం వైపు నుంచి ఏ రకమైన మంచి జరగాల్సి ఉన్నా, మీ మొహంలో (ఉద్యోగులు) చిరునవ్వు ఉండేలా చేస్తాం. ఉద్యోగులు బాగుంటేనే ప్రజలకూ మంచి జరుగుతుంది. ప్రభుత్వం ఎప్పుడూ మీకు తోడుగా ఉంటుంది.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఎస్‌కు బదులు మెరుగైన జీపీఎస్

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

- 12వ పీఆర్సీ ముందుగానే ఏర్పాటుకు నిర్ణయించారు
- వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను విలీనం చేశారు
- ఈ ప్రభుత్వం చెప్పినవన్నీ అమలు చేస్తోంది
- గతంలో టీడీపీ మేనిఫెస్టోలో చాలా హామీలిచ్చి ఏదీ చేయలేదు
- దీనిపై టీడీపీ నేత అశోక్‌బాబుతో బహిరంగ చర్చకు సిద్ధం
- సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి

సాక్షి, అమరావతి: ఉద్యోగుల సమస్యలను ఉదారంగా పరిష్కరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలిపినట్లు రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ ఏర్పాటుకు నిర్ణయం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సీపీఎస్ బదులు మెరుగైన పెన్షన్ వచ్చేలా జీపీఎస్ తేవడం, వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం పట్ల ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపినట్లు చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేయడానికి వేగంగా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. 27 శాతం ఐఆర్ ఇచ్చారని, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారని, ఇవన్నీ ధైర్యం గల ముఖ్యమంత్రిగా జగన్ చేశారని తెలిపారు. ఆ తర్వాత కరోనా మహమ్మారితో ప్రభుత్వ ఆదాయం తగ్గిపోవడంతో వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోయారని, పీఆర్సీ కూడా ఆశించిన స్థాయిలో ఇవ్వలేకపోయారని, ప్రభుత్వ ఉద్యోగులుగా వీటిని అర్థం చేసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు.

జీపీఎస్ దేశానికే రోల్‌మోడల్

జీపీఎస్‌లో ఉద్యోగులకు తొలుత బేసిక్‌లో 30 శాతం వరకే పెన్షన్ వచ్చేలా ప్రతిపాదనలు చేస్తే ముఖ్యమంత్రి స్వయంగా బేసిక్‌లో 50 శాతం పెన్షన్ వచ్చేలా మార్పులు చేశారని, అలాగే సీపీఎస్‌లో లేని డీఆర్‌ను జీపీఎస్‌లోకి తెచ్చారని, గతంలోకన్నా మెరుగ్గా ఉందని సీపీఎస్ ఉద్యోగులు చెబుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్ దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలుస్తుందని ముఖ్యమంత్రి తెలిపారని, ఏ రాష్ట్రంలోనూ జీపీఎస్ ప్రయోజనాలు లేవని చెప్పారు. సీఎం జగన్ నిర్ణయం సాహసోపేతమైనదని కొనియాడారు.

వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల 15 వేల కుటుంబాలకు మేలు చేశారని అన్నారు. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలన్నీ 60 రోజుల్లో అమలు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారన్నారు. జీపీఎస్ విధివిధానాలు వచ్చిన తరువాత ఉద్యోగుల్లో ఉన్న అపోహలు తొలగిపోతాయని చెప్పారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు గత ప్రభుత్వం ఆరు నెలలకోసారి వేతనాలు ఇచ్చేదని, ఈ ప్రభుత్వంలో రెగ్యులర్ ఉద్యోగులతో పాటే వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి దళారీ వ్యవస్థను నిర్మూలించారని గుర్తు చేశారు. 12వ పీఆర్సీని ముందుగానే ఏర్పాటు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపినట్లు వెంకటరామిరెడ్డి తెలిపారు.

అశోక్‌బాబుకు సవాల్

ఉద్యోగ సంఘాల మాజీ నాయకుడు, టీడీపీ నేత అశోక్‌బాబు మేనిఫెస్టో గురించి మాట్లాడుతున్నారని, ఆయన బహిరంగ చర్చకు వస్తే టీడీపీ మేనిఫెస్టోలో చెప్పినవి ఎన్ని అమలు చేసింది, ఇప్పటి ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పినవి ఎన్ని అమలు చేసిందీ చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో చాలావరకు అమలు చేసిందని, ఇంకా ఏమైనా ఉంటే అమలు చేయడానికి ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను టీడీపీ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదని, ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ ధైర్యంగా 10 వేల మందికిపైగా కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

తెలంగాణ

ప్రియురాలిని చంపి ఉప్పు పాతరేశాడు!

హైదరాబాద్: గుడికి వచ్చిన యువతితో పూజారికి ఏర్పడిన పరిచయం అక్రమ సంబంధానికి దారి తీసింది. వివాహం చేసుకోవాలని ఆమె నుంచి ఒత్తిడి పెరగడంతో బెల్లం రాయితో చంపాడు. మృతదేహాన్ని పాత సెప్టిక్ ట్యాంక్‌లో పడేసి ఉప్పు, ఎర్రమట్టి నింపాడు. వాసన రాకుండా దానికి ఉన్న రెండు మ్యాన్‌హోల్స్‌కు కాంక్రీట్ చేశాడు. ఘటనకు సంబంధించి వివరాలు.. చెన్నైకి చెందిన కురుగంటి అరుణ, శ్రీకర్ దంపతుల కుమార్తె అప్సర (30) అక్కడే సినీ రంగంలో పని చేశారు. తండ్రి కాశీ వెళ్లిపోవడంతో కూతుర్ని తీసుకుని తల్లి అరుణ హైదరాబాద్ వలస వచ్చింది. వీరిద్దరూ సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీ బంగారు మైసమ్మ ఆలయ సమీపంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. అప్సర తరచూ బంగారు మైసమ్మ ఆలయానికి వెళ్లేది. ఈ క్రమంలో ఆలయ పూజారి అయ్యగారి వెంకట సూర్యసాయికృష్ణతో గతేడాది ఏప్రిల్‌లో పరిచయమై.. అది వివాహేతర సంబంధానికి దారి తీసింది.

వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో..

అప్సర తనను రెండో వివాహం చేసుకోవాలని సాయికృష్ణపై ఒత్తిడి తెచ్చింది. దీంతో ఆమెను హత్య చేయాలనే నిర్ణయానికొచ్చిన సాయికృష్ణ ఈ నెల 3వ తేదీ రాత్రి 8.15 గంటల ప్రాంతంలో తన కారులో అప్సర ఇంటికి వెళ్లి ఆమెను బయటకు తీసుకొచ్చాడు. శంషాబాద్ సమీపంలో భోజనం చేశారు. తర్వాత అప్సర కారు ముందు సీట్లో నిద్రకు ఉపక్రమించింది. సాయికృష్ణ అక్కడినుంచి సుల్తాన్‌పూర్ గోశాల వైపు కారు తీసుకెళ్లాడు. అప్సర నిద్రలో ఉండగా.. కారు బాడీ కవర్‌ను ఆమె మెడకు చుట్టి, ఊపిరి ఆడకుండా చేసి చంపాలని ప్రయత్నించాడు. కానీ.. అప్సర ప్రతిఘటించడంతో వెనుక సీటుకింద ముందే ఉంచిన బెల్లం కొట్టే రాయితో దాదాపు పదిసార్లు కొట్టడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. మృతదేహాన్ని అదే కవర్‌లో చుట్టిన సాయికృష్ణ కారు డిక్కీలో పెట్టి మరుసటి రోజు తెల్లవారుజామున సరూర్‌నగర్‌లోని తన అపార్ట్‌మెంట్‌కు చేరుకుని కారును పార్కింగ్‌లో ఉంచాడు. ఉదయం అరుణ ఇంటికి వెళ్లిన సాయికృష్ణ అప్సర తన స్నేహితులతో కలిసి భద్రాచలం వెళ్లిందని నమ్మించాడు. తర్వాత అప్సర ఆచూకీ తెలియడం లేదని ఆమె తల్లితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మృతదేహం నుంచి వాసన రావడంతో..

అప్సర మృతదేహం 5వ తేదీ సాయంత్రం వరకు సాయికృష్ణ కారులోనే ఉంది. దుర్వాసన వస్తున్నట్టు గమనించిన అతను రాత్రి వేళ కారు తీసుకుని సరూర్ నగర్‌లో నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ వినియోగంలేని సెప్టిక్ ట్యాంక్‌లో మృతదేహాన్ని గన్నీ బ్యాగ్‌లో కుక్కి పడేసి, దాదాపు రెండు బస్తాల ఉప్పు దానిపై పోశాడు. మరుసటి రోజు తెల్లవారుజామున రెండు టిప్పర్ల ఎర్రమట్టి తెప్పించి సెప్టిక్ ట్యాంక్‌లో పోయించాడు. ఆమె హ్యాండ్ బ్యాగ్, లగేజీ బ్యాగ్ కాల్చేశాడు. ఈ నెల 7న మరోసారి అక్కడకు వెళ్లిన సాయికృష్ణ సెప్టిక్ ట్యాంక్‌కు ఉన్న రెండు మ్యాన్‌హోల్స్ నుంచి దుర్వాసన వస్తున్నట్టు గమనించి.. ఎల్బీ నగర్‌లోని లేబర్ అడ్డాకు వెళ్లి కొత్త మ్యాన్‌హోల్ మూతలు తెచ్చాడు. వీటిని మ్యాన్‌హోల్స్‌పై ఉంచి కాంక్రీట్ పోశాడు. ఆ సమీపంలో ఓ బోరు కూడా వేయించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ స్థలాన్ని బాగు చేయించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులను అతనిని అరెస్ట్ చేశారు.

వేల కళ్లలో వెలుగులు

- కాంట్రాక్టు ఉద్యోగుల 20 ఏళ్ల కల సాకారం
- ఏపీ వైద్య విధాన పరిషత్ ప్రభుత్వంలో విలీనం
- 010 పద్దు కింద జీతాలపై హర్షాతిరేకాలు
- రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు

సాక్షి, అమరావతి, సాక్షి నెట్‌వర్క్: కాంట్రాక్టు ఉద్యోగుల రెండు దశాబ్దాల కలను నెరవేరుస్తూ క్రమబద్ధీకరణ నిర్ణయంతో వేల కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్ చిత్రపటాలకు రాష్ట్రవ్యాప్తంగా క్షీరాభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ)ను ప్రభుత్వంలో విలీనం చేసి 010 పద్దు కింద ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జీతాలు చెల్లించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తమవుతోంది.

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు, కార్వేటినగరం, పలమనేరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో ఉద్యోగులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలో సీఎంను కలసి కృతజ్ఞతలు తెలిపారు.
- విజయనగరం జిల్లా కేంద్రంలో సీఎం జగన్ చిత్రపటానికి కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బంది క్షీరాభిషేకం చేశారు. కాకినాడ జిల్లా కోటనందూరులో సీఎం జగన్, మంత్రి దాడిశెట్టి రాజా ఫొటోలకు క్షీరాభిషేకం చేశారు.
- సీఎం జగన్ మాట తప్పని, మడమ తిప్పని నేతగా మరోసారి రుజువు చేసుకున్నారని విజయనగరం జిల్లా వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎ.కనకరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీవైవీపీ కార్యాలయం వద్ద ఉద్యోగులతో కలిసి ఆయన సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.
- తమ జీతాలను ఏకంగా 23 శాతం పెంచిన ముఖ్యమంత్రి జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని ఆరోగ్యశ్రీ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. అసోసియేషన్ సభ్యులు శుక్రవారం గుంటూరులో ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనిని కలసి ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్యశ్రీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.అశోక్‌కుమార్, అధ్యక్షుడు ఎ.విజయ్‌భాస్కర్ తదితరులున్నారు.
- ఏపీ ఎన్జీవోలు కర్నూలు కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. నంద్యాలలో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి నివాసంలో గవర్నమెంట్ ఫెడరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, కాంట్రాక్ట్ ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు.
- కడపలో కాంట్రాక్టు లెక్చరర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మ శివప్రసాద్‌రెడ్డి, ఏపీఎన్జీవోస్ నేతలు పాల్గొన్నారు.
- క్రమబద్ధీకరణ ద్వారా సీఎం జగన్ 10 వేల కుటుంబాల్లో వెలుగులు నింపారని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) అధ్యక్షుడు అరవా పాల్, జనరల్ సెక్రటరీ ఆర్.గోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఏపీవీవీపీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా 14 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించారన్నారు.
- కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి ముఖ్యమంత్రి జగన్ మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి వారి జీవితాల్లో వెలుగు నింపారని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. విజయవాడ వైఎస్సార్ పార్క్‌లో కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఇచ్చిన మాట నిలుపుకున్న సీఎం

- ఉద్యోగ సంఘాల నేతలు ప్రశంసలు
- అడగకుండానే 12వ పీఆర్సీ ఏర్పాటు
- జీపీఎస్‌తో భవిష్యత్‌పై బెంగ తీరింది
- ఇంతగా సహకరించినందుకు కృతజ్ఞతలు
- ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తామని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: అడగకుండానే 12వ పీఆర్సీని ఏర్పాటు చేసినందుకు.. సీపీఎస్ ఉద్యోగులకు ఊరటనిస్తూ జీపీఎస్ విధానాన్ని తెచ్చినందుకు.. పది వేలకుపైగా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించినందుకు.. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వంలో విలీనం చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఉద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వారు సీఎంతో సమావేశమైన అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలతో పాటు ఉద్యోగుల సంక్షేమం కోసం కూడా సీఎం పాటుపడుతున్నారని ప్రశంసించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

ఉద్యోగుల కోసం పరితపిస్తున్న సీఎం జగన్

ప్రజలతో పాటు ఉద్యోగుల సంక్షేమానికీ పెద్దపీట వేస్తున్నారు. అడగకుండానే 12వ పీఆర్సీ ఏర్పాటు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు 25 ఏళ్లుగా పనిచేసినా.. చనిపోతే మట్టి ఖర్చులు ఇవ్వలేని పరిస్థితి గతంలో ఉంది. ఇప్పుడు ఒక్క నిర్ణయంతో వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించారు. ఏపీవీపీని ప్రభుత్వంలో విలీనం చేసి... ఆ శాఖలో పనిచేసే ఉద్యోగులకు 010 ద్వారా వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను 36 విడతల్లో ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. అన్ని జిల్లాల్లో ఒకే హెచ్‌ఆర్‌ఏ ఇచ్చారు. సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ ద్వారా 50 శాతం ఫిట్‌మెంట్‌తో పెరిగే ధరలకు అనుగుణంగా డీఏలు ఇచ్చి పెన్షన్ ఇస్తామని చెప్పడం ద్వారా భవిష్యత్‌కు భరోసా ఇచ్చారు. మా కోసం ఇంతగా పరితపిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. జగన్ ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తాం. సీఎం వైఎస్ జగన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు భారీ ఎత్తున పాలాభిషేకాలు చేస్తున్నారు.

– బండి శ్రీనివాసరావు, అధ్యక్షుడు, ఏపీఎన్జీవో సంఘం

మానవతామూర్తి సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్ 2008లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. 2014 ఎన్నికల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు మోసం చేశారు. సీఎం జగన్ ఇచ్చిన మాట మేరకు 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి.. వారి జీవితాల్లో వెలుగులు నింపిన మానవతామూర్తి. గతంలో పీఆర్సీ కోసం రోడ్డెక్కితే టీడీపీ సర్కార్ గుర్రాలతో ఉద్యోగులను తొక్కించింది. ఇప్పుడు ఎవరూ అడగకుండానే సీఎం వైఎస్ జగన్ పీఆర్సీని ప్రకటించి.. ఉద్యోగుల పట్ల తనకు ఉన్న ప్రేమను చాటుకున్నారు.

– శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఏపీఎన్జీవో సంఘం

మా జీవితాల్లో వెలుగులు

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ సాహసోపేత నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– రత్నాకర్ బాబు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నేత

జీపీఎస్‌తో మేలు జరుగుతుందని భావిస్తున్నాం

జీపీఎస్‌లో పది శాతం ఉద్యోగి షేర్, ప్రభుత్వ షేర్ కొనసాగుతుందని సీఎం జగన్ చెప్పారు. ఉద్యోగి రిటైర్ అయ్యాక గ్యారెంటీ పింఛన్ వస్తుందని ప్రభుత్వం చెబుతోంది. జీపీఎస్‌తో ఉద్యోగులకు 60 శాతం ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నాం.

– మురళీ మోహన్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేత

15 ఏళ్ల సమస్యకు సీఎం పరిష్కారం

ఆస్పత్రుల్లో 15 ఏళ్లుగా ఉన్న సమస్యలను సీఎం జగన్ పరిష్కరించారు. రెగ్యులర్ ఉద్యోగులమైనా మాకు జీతాలు రావటం లేదు. కానీ సీఎం జగన్ దృష్టికి రాగానే ఒకే ఒక్క సంతకంతో సమస్య తీర్చారు. వైద్య విధాన పరిషత్ ద్వారా అత్యంత మెరుగైన సేవలు అందిస్తాం.

– సురేష్ కుమార్, ఏపీవీపీ సంఘం నేత

నా 23 ఏళ్ల సర్వీసులో ఇది అద్భుతం

నా 23 ఏళ్ల సర్వీసులో ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలకు సంబంధించి పరికరాలు ఏర్పాటు చేయడం అద్భుతం. కాంట్రాక్టు ఉద్యోగులమైన మమ్మల్ని రెగ్యులరైజ్ చేసినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– వీపీవీఆర్ కిశోర్, ఏపీ కాంట్రాక్టు ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



కర్నూలులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు



విజయనగరంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు



విజయవాడలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

పేదలను ధనికులుగా మార్చడమే నా జీవితాశయం

- టీడీపీ అధినేత చంద్రబాబు

సాక్షి, అమరావతి: తనకున్న విజన్‌తో పేదల్ని ధనవంతులుగా చేసి తీరతానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. అది తన జీవితాశయమన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఐ–టీడీపీ సదస్సులో ఆయన మాట్లాడారు. పేదల్ని ధనికుల్ని చేయాలన్న సంకల్పంతో ఫార్ములా–4ని (పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం) తీసుకున్నామని తెలిపారు. ఫార్ములా–4 అనేది పేదల మంత్రమని, ప్రతి పేదవాడిని ధనికుడిని చేసే బాధ్యత టీడీపీదేనన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారిని కలవడానికి ముందుగా తాను షెడ్యూల్ ఇస్తే.. తనకు అనుమతివ్వకుండా అదే షెడ్యూల్‌కి సీఎం వెళ్లారని ఆరోపించారు. శంకుస్థాపనలు చేసిన వాటికి మళ్లీ శంకుస్థాపనలు చేయడం తప్ప ఈ సీఎం ఒక్క పనీ పూర్తి చేయలేదన్నారు. రానున్న ఎన్నికలు దోపిడీదారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా అభివర్ణించారు. ఎన్నికలకు 9 నెలలే సమయం ఉందని అందరూ సిద్ధం కావాలన్నారు.

భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ తిరస్కరణ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను సీబీఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఈ దశలో బెయిల్ ఇవ్వలేమని తెలిపింది. అనారోగ్యంతో బాధపడుతున్నానని, నెలన్నరకు పైగా జైలులో ఉంటున్నానని, కస్టడీ విచారణ కూడా ముగిసిందని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ ఇవ్వాలని భాస్కర్‌రెడ్డి ఆ పిటిషన్‌లో కోరారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తీర్పునిచ్చారు. కాగా, వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో దట్టమైన అటవీ ప్రాంతమైన గూడెం కొత్తవీధి (జీకే వీధి) కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఏర్పాటైన స్టాక్ పాయింట్ ఇది. ఇక్కడ 172 ప్రాథమిక పాఠశాలలతోపాటు 14 ఉన్నత పాఠశాలలు, నాలుగు యూపీ స్కూళ్లలో 11,115 మంది విద్యార్థులున్నారు. వీరికి అవసరమైన 1.23 లక్షల పుస్తకాల్లో 95 శాతం ఇప్పటికే స్టాక్ పాయింట్‌కు చేరాయి.



జీకే వీధి మండల కేంద్రానికి 20 కి.మీ. దూరంలో ఉన్న చింతపల్లి స్టాక్ పాయింట్‌కు చేరుకున్న జగనన్న విద్యాకానుక కిట్లలో బెల్టులు నాణ్యత సరిగా లేదని సరఫరాదారుడికి తిప్పి పంపారు. దీంతో తిరిగి నాణ్యమైన వస్తువులు పంపించారు. ఇక్కడ గడ్డిబంద, పాలమామిడి తదితర ప్రాంతాల్లోని మారుమూల స్కూళ్లకు రవాణా సౌకర్యం లేదు. అయినా కాలినడకన వెళ్లే ప్రాంతాలకు సైతం విద్యాకానుక కిట్లను చేరవేయడం విశేషం.



కాకినాడ జిల్లా కోటనందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్ ఇది. మండలంలోని 32 పాఠశాలల్లో 4,696 మంది విద్యార్థులున్నారు. స్టాక్ పాయింట్ నుంచి ఇప్పటికే పుస్తకాలను పాఠశాలలకు పంపించారు. బూట్ల కొలతల్లో తేడా రావడంతో తయారీదారుకు పంపించి కొత్తవి తెప్పించారు.



బడిలో బుక్స్ రెడీ!

అక్షర యజ్ఞానికి అంతా సిద్ధం!

- మొదటి సెమిస్టర్‌కు 3,54,61,730 టెక్స్ట్ బుక్స్, వర్క్ బుక్స్ సిద్ధం
- సరిహద్దు రాష్ట్రాల విద్యార్థుల కోసం ఉర్దూ, కన్నడ, తమిళ, ఒడియాలోనూ ముద్రణ

జీకే వీధి, కోటనందూరు నుంచి
నానాజీ అంకంరెడ్డి, సాక్షి ప్రతినిధి:

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తొలిరోజే పుస్తకాలను అందచేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల కోసం సుమారుగా ఆరు కోట్ల పుస్తకాలను సిద్ధం చేసి స్టాక్ పాయింట్లకు చేర్చడం గమనార్హం. విద్యార్థుల సంఖ్య, కొత్త చేరికలకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు బ్యాగులు, యూనిఫారం, బూట్లు, సాక్సులతో కూడిన 'జేవీకే' కిట్లను పాఠశాలలకు రవాణా ఖర్చులు చెల్లించి మరీ చేరవేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు జగనన్న విద్యా కానుక కిట్లలోని వస్తువుల నాణ్యతను విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. స్టాక్ పాయింట్ల వద్ద నాణ్యతను క్షుణ్నంగా పరిశీలించాకే తీసుకుంటున్నారు. ఎక్కడైనా లోపాలున్నట్లు గుర్తిస్తే తిప్పి పంపించి నాణ్యతతో కూడినవి తెప్పిస్తున్నారు. జిల్లా, మండల స్థాయి స్టాక్ పాయింట్లకు చేరిన కిట్ల నాణ్యతను ర్యాండమ్‌గా పరిశీలించాలని విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులను ఆదేశించారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

రెండో సెమిస్టర్‌కు సైతం..

రాష్ట్రవ్యాప్తంగా 2023–24 విద్యా సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు అవసరమైన 3,54,61,730 పాఠ్య పుస్తకాలు, వర్కు బుక్స్‌తోపాటు 2,32,46,064 నోటు పుస్తకాలను మండల స్టాక్ పాయింట్లకు చేర్చారు. జూన్ 11 నాటికి వంద శాతం పాఠశాలలకు చేరవేసేలా చర్యలు చేపట్టారు. పుస్తకాల ప్రింటింగ్‌కు నాణ్యమైన పేపర్‌ను తమిళనాడు న్యూస్ పేపర్ ప్రింటర్స్ నుంచి కొనుగోలు చేశారు. ఇక ఈ ఏడాది నవంబర్‌నుంచి ప్రారంభమయ్యే రెండో సెమిస్టర్ కోసం సైతం ఇప్పటి నుంచే పుస్తకాల ముద్రణ చేపట్టారు. రెండో సెమిస్టర్‌కి సంబంధించి 1,06,82,403 పుస్తకాలను జూలై చివరి నాటికి విద్యార్థులకు అందించేలా అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటివరకు ద్విభాషా పాఠ్య పుస్తకాలు (బైలింగ్యువల్) ముద్రిస్తుండగా రాష్ట్ర సరిహద్దుల్లో చదువుకునే విద్యార్థుల కోసం ఈ ఏడాది ఉర్దూ, కన్నడ, తమిళం, ఒడియా భాషల్లోను పాఠ్యపుస్తకాలను ముద్రించారు. మొత్తం 425 టైటిల్స్‌తో అత్యధిక సంఖ్యలో పుస్తకాలను తేవడం గమనార్హం.

తొమ్మిదో తరగతిలో ఎన్సీఈఆర్టీ..

జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యలో ఎన్సీఈఆర్టీ కరిక్యులమ్‌ను సైతం ప్రవేశపెట్టింది. 2023–24 విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతిలో పూర్తి స్థాయిలో ఎన్సీఈఆర్టీ సిలబస్‌తో అన్ని సబ్జెక్టుల పుస్తకాలను అందుబాటులోకి తెస్తోంది. దీంతో పాటు ఆరు, ఏడు తరగతుల్లో ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టులను, ఎనిమిదో తరగతిలో ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టులను ఎన్సీఈఆర్టీ సిలబస్‌కు అనువుగా మార్చారు. ఈసారి 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకూ వర్క్ బుక్స్ అందించనున్నారు.



ఐదు శాతం అదనంగా..

జూన్ 12వ తేదీన 39,95,992 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేపట్టనున్నారు. ఐదు శాతం అదనంగా అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కిట్లలో 34,93,765 బ్యాగులు (88 శాతం) ఇప్పటికే స్టాక్ పాయింట్లకు చేరుకోగా మిగిలినవి రవాణాలో ఉన్నాయి. బూట్లు, సాక్సులు కలిపి 36,26,732 యూనిట్లు (92 శాతం), యూనిఫామ్స్ వంద శాతం, నోటు పుస్తకాలు 83 శాతం, బెల్టులు 92 శాతం, డిక్షనరీలు నూరు శాతం స్టాక్ పాయింట్లకు చేరడంతో పాటు అక్కడి నుంచి అన్ని స్కూళ్లకు చేరాయి.



పదవుల్లో బీసీలకు పెద్దపీట

- సంక్షేమ పథకాల ద్వారా బీసీల్లో పేదరిక నిర్మూలనకు సీఎం జగన్ కృషి
- నాలుగేళ్లుగా వారికి చేస్తున్న మంచిని ప్రజలకు వివరించండి
- బీసీ కులగణనకు కట్టుబడి ఉన్నాం
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషిచేయండి
- బీసీ విభాగం సమావేశంలో వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: కేబినెట్ నుంచి నామినేటెడ్ పోస్టుల వరకూ అన్ని పదవుల్లోనూ బీసీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్, పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వి. విజయసాయిరెడ్డి చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా అత్యధికంగా లబ్ధి చేకూరుస్తూ బీసీల్లో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారని గుర్తుచేశారు. బీసీ కుల గణనకు కట్టుబడ్డామని ఆయన స్పష్టంచేశారు. నాలుగేళ్లుగా సీఎం జగన్ చేస్తున్న మంచిని వివరించి.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ బీసీ, వాణిజ్య విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, జిల్లా అధ్యక్షులతో విడివిడిగా విజయసాయిరెడ్డి సమావేశాలు నిర్వహించారు. పార్టీ బీసీ విభాగ అధ్యక్షులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి నేతృత్వంలో బీసీ విభాగ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బీసీ మహాసభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. బీసీ విభాగ అనుబంధ కమిటీలను త్వరితగతిన ఏర్పాటుచేయాలని కోరారు. అదేవిధంగా జిల్లా, మండల స్థాయి కమిటీలను భర్తీచేయాలని సూచించారు. పార్టీ బీసీ విభాగానికి ఉపాధ్యక్షులను నియమించే విషయాన్ని పరిశీలిస్తున్నామని విజయసాయిరెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్ అడుగడుగునా సామాజిక న్యాయం అమలుచేస్తున్నారని.. అన్ని పదవుల్లో బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. రాజ్యసభ సభ్యులుగా, ఎమ్మెల్సీలుగా, జెడ్పీ చైర్మన్లుగా, మున్సిపల్ చైర్మన్లుగా, మేయర్లుగా, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 139 వెనుకబడిన కులాలకు 56 సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్లను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని చెప్పారు.



సంక్షేమ పథకాల్లో బీసీలకు పెద్దపీట

బీసీ సంఘాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న బీసీ కుల గణనకు వైఎస్ జగన్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు. అందుకోసం ప్రభుత్వం కమిటీ ఏర్పాటుచేసిందని.. బీసీ జనాభా లెక్కింపుపై ఈ కమిటీ అధ్యయనం చేయనుందన్నారు. ఇక ఇప్పటికే దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణకు బీసీ కులం కాలమ్ చేర్చి కులగణన చేపట్టాలంటూ కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి తీర్మానం చేసి.. కేంద్రానికి పంపారని ఎంపీ విజయసాయిరెడ్డి గుర్తుచేశారు. సంక్షేమ పథకాల్లోనూ బీసీలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ అంశాలను బీసీలకు వివరించి.. వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం వాణిజ్య విభాగ అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, పల్లెపోతు మురళీకృష్ణ నేతృత్వంలో ఆ విభాగ సమావేశం జరిగింది.

కుంగుతున్నది రామోజీ బుద్ధే

సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ ప్రకారమే గైడ్ బండ్ నిర్మాణం

- రిటైనింగ్ వాల్ స్టోన్ కాలమ్స్ ఓ చోట వంగడంతో కొంత మేర జారిన గైడ్ బండ్
- ఇలా ఎందుకు జారిందో ఈ నెల 16లోగా తేల్చనున్న సీడబ్ల్యూసీ కమిటీ
- ఆ కమిటీ నివేదిక ఆధారంగా గైడ్ బండ్‌ను సరిదిద్దే పనులు
- వాటిని అధిగమిస్తూ చకచకా ప్రాజెక్టును పూర్తి చేయాలన్న సీఎం జగన్
- ఈ చిన్న సమస్యను పెను విపత్తన్నట్లు 'ఈనాడు' విషపు రాతలు
- గతంలో చంద్రబాబు, నవయుగ తప్పిదాలతో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్
- దానిని చక్కదిద్దడానికి అదనంగా రూ.2020.05 కోట్లు వ్యయం
- డీపీటీ విధానంలో దోచుకున్నారు కాబట్టి ఇది రామోజీకి కనిపించదు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ చకచకా పూర్తి చేస్తుండటంతో రాజకీయంగా చంద్రబాబుకు నూకలు చెల్లడం ఖాయమనే భయం.. వియ్యంకుడిని కాంట్రాక్టర్‌గా తప్పించడంతో తమ దోపిడీకి అడ్డుకట్ట పడిందనే అక్కసుతో రామోజీరావు పదే పదే విషం చిమ్ముతున్నారు. గైడ్ బండ్‌లో ఉత్పన్నమైన చిన్న సమస్యను పెద్ద విపత్తుగా చూపిస్తూ.. విశ్రాంత సూపరింటెండెంట్ ఇంజినీర్, విశ్రాంత చీఫ్ ఇంజినీర్, కీలక ఇంజినీరింగ్ అధికారి అంటూ.. వారి పేర్లు ప్రస్తావించకుండా.. ఆ ముసుగులో తన అభిప్రాయాలనే వారి అభిప్రాయాలుగా 'ఈనాడు'లో రోతరాతలు అచ్చేశారు. టీడీపీ సర్కార్ హయాంలో చంద్రబాబు, నవయుగ చేసిన తప్పిదం వల్ల గోదావరి వరదల ఉధృతికి పోలవరం ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతం పూర్తిగా ధ్వంసమైంది. డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. వీటిని చక్కదిద్దడానికి రూ.2020.05 కోట్లు అదనంగా వ్యయం చేయాలని సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) తేల్చింది. ఈ విపత్తుకు చంద్రబాబు చేసిన మానవ తప్పిదమే కారణమని ఐఐటీ(హైదరాబాద్), డీడీఆర్పీ, ఎన్‌హెచ్‌పీసీ నిపుణులు తేల్చిచెప్పారు. ఇవన్నీ తన బాబు సీఎం కుర్చీలో లేరని కుంగిపోతున్న రామోజీరావుకు కన్పించవు. ఎందుకంటే.. చంద్రబాబు, వియ్యంకుడి సంస్థ నవయుగతో కలిసి పోలవరంలో రామోజీరావు డీపీటీ (దోచుకో పంచుకో తినుకో) పద్ధతిలో దోచుకున్నారు కాబట్టి. ఆ పెను విపత్తును కప్పిపెడుతూ.. గైడ్ బండ్‌లో ఉత్పన్నమైన చిన్న సమస్యను పెద్ద విపత్తుగా చిత్రీకరిస్తూ శుక్రవారం 'మెగా వైఫల్యం' శీర్షికన ప్రచురించిన కథనంలో వీసమెత్తు వాస్తవం లేదు.

ఆరోపణ: రిటైనింగ్ వాల్ కమ్ గైడ్ బండ్ పూర్తిగా కుంగిపోయి ధ్వంసమయ్యే పరిస్థితి ఏర్పడింది.

వాస్తవం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్‌కు తగ్గట్టుగానే గైడ్ బండ్ నిర్మాణం జరిగింది. రిటైనింగ్ వాల్ కమ్ గైడ్ బండ్ నిర్మాణానికి ముందు.. దాని నిర్మాణ ప్రాంతంలో వైబ్రో కాంపాక్షన్ కాలమ్స్‌తో భూమిని అభివృద్ధి చేశారు. జీఎస్ఐ (జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) శాస్త్రవేత్తలు ఆ ప్రాంతాన్ని పరిశీలించి అనుమతి ఇచ్చాకే రిటైనింగ్ వాల్ కమ్ గైడ్ బండ్ నిర్మాణం చేపట్టారు. డిజైన్ ప్రకారం నిర్మించకపోయి ఉంటే.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన జీఎస్ఐ, వ్యాప్కోస్, సీఎస్ఎంఆర్ఎస్, పీపీఏలు మౌనంగా ఉండవు. వీటిని పరిశీలిస్తే.. డిజైన్‌లోనూ లోపం లేదు. నిర్మాణంలోనూ లోపం లేదన్నది స్పష్టమవుతోంది. ఇక గైడ్ బండ్ పూర్తిగా కుంగిపోయిందనడం అవాస్తవం. రిటైనింగ్ వాల్‌లో ఒక చోట స్టోన్ కాలమ్స్ కాస్త ఒంగిపోవడం వల్ల గైడ్ బండ్‌లో 134 మీటర్ల మేర కొంత జారింది. దీనిని సరిచేయడంలో నిపుణులు నిమగ్నమయ్యారు.

ఆరోపణ: కుంగిపోయిన గైడ్ బండ్ స్థానంలో మళ్లీ మొదటి నుంచి నిర్మించాల్సి వస్తుందేమోనని ఇంజినీర్లు చెబుతుంటే.. సాక్షాత్తు సీఎం జగన్ దీన్ని చిన్న అంశంగా తేల్చి పారేయడం విస్మయం కలిగించింది.

వాస్తవం: దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీడబ్ల్యూసీ, పీపీఏ, సీఎస్ఆర్ఎంఎస్, సీడబ్ల్యూపీఆర్ఎస్, వ్యాప్కోస్, జీఎస్ఐ వంటి సంస్థల అధికారుల పర్యవేక్షణలో పోలవరం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను చాకచక్యంగా పరిష్కరించుకుని.. చకచకా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ సదుద్దేశం. గైడ్ బండ్ పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. సమీక్షించి.. జారడానికి గల కారణాలను మదింపు చేసి నివేదిక ఇవ్వడానికి సీడబ్ల్యూసీ ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ 16లోగా నివేదిక ఇస్తుంది. దాని ఆధారంగా గైడ్ బండ్‌ను చక్కదిద్దుతారు. ఈ చిన్న సమస్యను సాకుగా చూపి ప్రాజెక్టు నిర్మాణంలో అహర్నిశలు శ్రమిస్తోన్న అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడం, నిర్మాణ సంస్థ సమర్థతను ప్రశ్నించడం అవివేకమే అవుతుంది.

ఆరోపణ: గైడ్ బండ్‌లో రాక్ ఫిల్ డ్యామ్ నిర్మాణ శైలిని 2:1 నిష్పత్తిలో కాకుండా.. 3:1 నిష్పత్తిలో నిర్మించి ఉంటే కుంగిపోయేది కాదు. (విశ్రాంత ఇంజినీర్ పేరుతో రామోజీ మనసులోని మాట ఇది)

వాస్తవం: డిజైన్ల రూపకల్పన, ఖరారులో సీడబ్ల్యూసీ అత్యున్నత సంస్థ. ఆ సంస్థ ఆమోదించిన డిజైన్ ప్రకారం సైడ్ స్లోప్ 2:1 నిష్పత్తితోనే గైడ్ వాల్ నిర్మించారు. స్పిల్ వేకు ఎగువన సుడిగుండాలను నియంత్రించి.. స్పిల్ వేపై ఒత్తిడి తగ్గించడానికి నిర్మించిందే గైడ్ బండ్. సముద్ర తీర ప్రాంతాలు కోతకు గురవకుండా గేబియన్లు వేస్తారు. గైడ్ బండ్‌కు అలాంటివి వేయరు. ఇది రామోజీరావు వంటి విశ్రాంత చీఫ్ ఇంజినీర్‌కు తెలియదేమో? సుడిగుండాలను నియంత్రించడం, స్పిల్ వేపై ఒత్తిడిని తగ్గించడానికి.. వరద సులభంగా దిగువకు వెళ్లడానికి వీలుగా.. స్పిల్ వేకు ఎగువన ఎడమ గట్టు కొండకు సమాంతరంగా 500 మీటర్ల పొడవుతో గైడ్ బండ్ నిర్మించాలన్న సూచన మేరకు రిటైనింగ్ వాల్ కమ్ గైడ్ బండ్‌ను నిర్మించారు.

'అన్నదాత'కు అండగా నిలిచిందెవరు?

వాస్తవాలకు మసిపూసి 'ఈనాడు' విష ప్రచారం



గొల్లపూడి ఆర్బీకేలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి రైతుకు విత్తు నుంచి విక్రయం వరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోంది. వారు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు దక్కేలా కృషి చేస్తోంది. ఏ సీజన్‌కు ఆ సీజన్ ముందుగానే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను గ్రామ స్థాయిలోనే రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ద్వారా అందిస్తోంది. దీంతో రైతులపై రవాణా చార్జీల భారం తప్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కామన్ వెరైటీ, గ్రేడ్–ఏ రకాల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. నేరుగా రైతుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తూ బాసటగా నిలుస్తోంది. ఇలా ప్రతి దశలోనూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంటే వాస్తవాలకు ముసుగేసి 'ఈనాడు' తనదైన శైలిలో విషం చిమ్ముతోంది. ప్రభుత్వ సహకారాన్ని ప్రస్తావించకుండా, ఇతర రాష్ట్రాల్లో బోనస్ అంటూ రైతులను తప్పుదోవ పట్టించేలా 'వరి రైతుకు మిగిలేదేంటి?' శీర్షికన ఓ కథనాన్ని వండివార్చింది. ఇందులో నిజానిజాల్లోకి వెళితే..

ఆరోపణ: 2022–23లో 9 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గింది.

వాస్తవం: రాష్ట్రంలో వరి సాధారణ విస్తీర్ణం ఖరీఫ్‌లో 38.8 లక్షల ఎకరాలు, రబీలో 19.92 లక్షల ఎకరాలు.. అంటే మొత్తం విస్తీర్ణం 58.72 లక్షల ఎకరాలు. కాగా 55.52 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. అంటే వ్యత్యాసం 3.20 లక్షల ఎకరాలు. రబీలో బోర్ల కింద ప్రత్యామ్నాయ పంటలను ప్రభుత్వం ప్రోత్సహించడంతో 1.15 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు, 50 వేల ఎకరాల్లో చిరుధాన్యాలు, మొక్కజొన్న, నూనెగింజల సాగు విస్తీర్ణం పెరిగింది. మరో 35 వేల ఎకరాల్లో మత్స్య సాగు విస్తరించింది. మిగిలిన భూమిని ఇళ్ల స్థలాల కోసం సేకరించారు. వాస్తవం ఇలా ఉంటే ఏకంగా 9 లక్షల ఎకరాలు తగ్గిపోయిందంటూ 'ఈనాడు' వక్ర భాష్యం చెప్పింది.

ఆరోపణ: క్వింటా రూ.3,126 ప్రతిపాదిస్తే ఎందుకు తగ్గించారు?

వాస్తవం: పెట్టుబడి ఖర్చుల ఆధారంగా దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు పంటల వారీగా కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని ప్రతిపాదిస్తాయి. ఇలా మన రాష్ట్రంలో ఖరీఫ్‌లో ఎకరాకు రూ.32 వేలు, రబీలో రూ.41 వేలు ఖర్చవుతుందన్న అంచనాతో క్వింటా రూ.3,126గా ఎంఎస్పీ నిర్ణయించాలని కేంద్రానికి నివేదిక పంపింది. ఇదే రీతిలో పంటల వారీగా ఒక్కో రాష్ట్రం నుంచి ఒక్కో రీతిలో వచ్చే ప్రతిపాదనలన్నీ క్రోడీకరించుకొని పంట కాలానికయ్యే సాగు ఖర్చును సరాసరి లెక్కించి పంటల వారీగా అన్ని రాష్ట్రాలకు ఒకే రకమైన మద్దతు ధరను కేంద్రం ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. అదే రీతిలో 2023–24 సీజన్‌కు సాధారణ రకానికి క్వింటాకు రూ.2,183, గ్రేడ్–ఏ రకానికి రూ.2,203గా కేంద్రం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ విధి ప్రతిపాదనలు పంపించడం వరకే. నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిదేనన్న విషయం రామోజీకి తెలియనట్లుంది కాబోలు.

ఆరోపణ: బోనస్ ఇవ్వాలన్న ఆలోచనే మరిచారు

వాస్తవం: కేరళ, తమిళనాడు, జార్ఖండ్ వరికి బోనస్ ఇస్తున్నాయంటూ 'ఈనాడు' కొత్త వాదన తీసుకొచ్చింది. మరి బోనస్ ఇస్తున్నా ఆయా రాష్ట్రాల్లో వరి సాగు ఎందుకు పెరగడం లేదు? ఏపీలో 24 లక్షల హెక్టార్లలో వరి సాగవుతుంటే కేరళలో 1.98 లక్షల హెక్టార్లు, జార్ఖండ్‌లో 13.57 లక్షల హెక్టార్లు, తమిళనాడులో 19 లక్షల హెక్టార్లలో మాత్రమే వరిసాగవుతోంది. ఇక దిగుబడిని పరిశీలిస్తే ఏపీలో ఎకరాకు 23.24 క్వింటాళ్ల దిగుబడి (2022–23) వస్తుంటే, తమిళనాడులో 17, జార్ఖండ్‌లో 9, కేరళలో 13 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. ఆయా రాష్ట్రాల్లో ఎంతగా ప్రోత్సహిస్తున్నా, వరిసాగు కంటే ఎక్కువ ఆదాయం వచ్చే పంటల వైపు అక్కడి రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ కారణంగానే కేరళ.. ఏటా మన గోదావరి జిల్లాల్లో సాగయ్యే బోండాల కోసం క్యూ కడుతుంటే, తమిళనాడు.. రాయలసీమ జిల్లాల్లో సాగయ్యే ఫైన్ వెరైటీ, జార్ఖండ్.. ఉత్తరాంధ్రలో సాగయ్యే ఫైన్ వెరైటీ ధాన్యం కొనుగోలుకు ఎగబడుతున్నాయి. సాధారణంగా డిమాండ్ కంటే తక్కువ ఉత్పత్తి ఉన్న పంటల సాగును ప్రోత్సహించాలన్న సంకల్పంతోనే బోనస్ ప్రకటిస్తుంటారు. మన రాష్ట్రంలో డిమాండ్‌కు మించి ఉత్పత్తి జరుగుతోంది. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క సీజన్‌లో కూడా ఒక్క రూపాయి బోనస్ ప్రకటించిన పాపాన పోలేదు. అయినా ఇదేంటని రామోజీ అప్పట్లో ఏనాడైనా ప్రశ్నించారా?

బోనస్‌కు మించి జీఎల్‌టీ

రైతు ప్రయోజనార్థం రైతు భరోసా కేంద్రాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రంగా గుర్తించింది. అంతటితో ఆగకుండా రైతు పొలం నుంచే నేరుగా కొనుగోలు చేసేందుకు అదనపు ఖర్చులు భరించింది. మునుపెన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలులో గోనె సంచులు, హమాలి.. రవాణా చార్జీలు మద్దతు ధరతో పాటు కలిపి చెల్లిస్తోంది. ఒక్కో గోనె సంచి ఖరీదు రూ.70. ఈ లెక్కన ఒక టన్ను ధాన్యం నిల్వ చేసేందుకు గోనె సంచుల కోసం రూ.1,750 ప్రభుత్వమే భరించాల్సి వస్తోంది. హమాలి ఖర్చు టన్నుకు రూ.220, రవాణాకు రూ.468 (25 కి.మీ పరిధిలో) చొప్పున.. మొత్తంగా టన్నుకు రూ.2,523 చొప్పున ప్రభుత్వం జీఎల్‌టీ (గన్నీ బాగులు, లేబర్, ట్రాన్స్‌పోర్ట్) రూపంలో ఖర్చు చేస్తోంది. ఈ మొత్తం ధాన్యం కొనుగోలు సొమ్ముతో కలిపి రైతు ఖాతాల్లో జమ చేస్తోంది. ఇది ఆయా రాష్ట్రాల్లో ఇచ్చే బోనస్‌తో పోల్చుకుంటే చాలా ఎక్కువ. పైగా పక్క రాష్ట్రాల్లో పరిమితికి లోబడే కొనుగోలు చేస్తారు. మన రాష్ట్రంలో మాత్రం ఆర్బీకే వద్దకు వచ్చిన ప్రతి రైతు నుంచి ఈ–క్రాప్ ఆధారంగా ధాన్యం కొనుగోలు చేస్తుండటం బహిరంగ రహస్యం. ఇవన్నీ పరిగణనలోకి తీసుకోని ఈనాడు ప్రభుత్వంపై పనిగట్టుకుని బురద చల్లడమే లక్ష్యంగా అర్ధసత్య కథనాలు ఎవరి కోసం రాస్తోంది?

ఆరోపణ: మిల్లర్లకు ఎదురు సొమ్ము ఇవ్వాల్సి వస్తోంది

వాస్తవం: గత ప్రభుత్వ హయాంలో మిల్లర్లు, దళారీల కనుసన్నల్లోనే ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరకే ధాన్యం సేకరణ జరిగేది. ఏనాడూ ఏ ఒక్క రైతుకు కూడా ఎమ్మెస్పీ దక్కిన దాఖలాలు లేవు. కానీ నేడు దళారీలు, మిల్లర్ల ప్రమేయం కూడా లేకుండా ప్రతి గింజను కనీస మద్దతు ధరకే ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం ఆర్బీకేలన్నింటిని ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించింది. నేరుగా రైతుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యంలో మంచి రకాలను ఎంపిక చేసి అదనపు ఖర్చుల కింద క్వింటాకు రూ.110 వెచ్చించి నాణ్యమైన బియ్యంగా మార్చి కార్డుదారులకు ఇంటి వద్దే అందిస్తోంది. ఇవేమీ 'ఈనాడు'కు కనిపించడం లేదు.

ఆరోపణ: వరి రైతుకు కనీస మద్దతు ధర దక్కడం లేదు

వాస్తవం: చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 17,94,279 మంది రైతుల నుంచి రూ.40,237 కోట్ల విలువైన 2,65,10,747 టన్నుల ధాన్యాన్ని సేకరించారు. బాబు హయాంలో తక్కువ మంది రైతుల వద్ద నుంచి ఎక్కువ మొత్తం ధాన్యం సేకరించేవారు. ఉదాహరణకు 2014–15లో 1.18 లక్షల మంది రైతుల నుంచి రూ.5,583 కోట్ల విలువైన 40.62 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. నూటికి 90 శాతం సన్న, చిన్నకారు రైతులున్న ఈ రాష్ట్రంలో ఈ స్థాయిలో ధాన్యం అమ్మారంటే వార్ని ఏమంటారో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు రాష్ట్రంలో గత నాలుగేళ్లలో ఏకంగా 32,76,354 మంది రైతుల నుంచి రూ.58,739 కోట్ల విలువైన 3,10,56,117 టన్నుల ధాన్యాన్ని సేకరించారు. గతంతో పోలిస్తే ధాన్యం అమ్ముకున్న రైతుల సంఖ్య దాదాపు రెట్టింపు అయ్యింది.

ఆరోపణ: అమ్మాలంటే అగచాట్లు

వాస్తవం: గత ప్రభుత్వ హయాంలో రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని బస్తా (75 కిలోలు)కు మద్దతు ధర కంటే రూ.200 నుంచి రూ.500 వరకు తగ్గించి ఇచ్చేవారు. ఇలా ఎకరాకు తక్కువలో తక్కువ 30–33 బస్తాల దిగుబడి వేసుకున్నా రూ.6 వేలకు పైగా రైతులు నష్టపోయేవారు. అంతేకాకుండా దళారులు, వ్యాపారులు తేమ శాతం పేరిట ఇష్టమొచ్చినట్టు కోత పెట్టేవారు. కానీ ప్రస్తుతం జిల్లాకో మొబైల్ మిల్లును పంపి రైతుల ఎదుటే శాంపిల్స్ పరీక్షించి మరీ కొనుగోలు చేశారు. ముక్క విరుగుడు ధాన్యాన్ని బాయిల్డ్ రకంగా పరిగణించి మరీ కొన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను తేమ, నూక శాతాలతో సంబంధం లేకుండా కొనుగోలు చేసి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది.

నేనే క్రతువును, నేనే యజ్ఞాన్ని, హోమం చేసే మూలికలు నేనే,
మంత్రాన్ని నేనే, అగ్నినీ ఆహుతినీ కూడా నేనే.
– భగవద్గీత

సాక్షి
శనివారం, 10 జూన్ 2023

ఎన్ఎంసీ తీరు మారాలి

దేశంలో వైద్య విద్య పర్యవేక్షణకు నెలకొల్పిన భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) భ్రష్టుపట్టిందనీ, దాని ప్రక్షాళన అసాధ్యమనీ పదమూడేళ్ల క్రితం సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఆ తర్వాత 2019లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు చట్టమై జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆవిర్భవించింది. 2020 సెప్టెంబర్ నుంచి కొత్త సంస్థ పనిచేయటం ప్రారంభమైంది. పాత వ్యవస్థలోని లోపాలనూ, దోషాలనూ పరిహరించి కొత్త వ్యవస్థ వస్తున్నదంటే ఎవరైనా స్వాగతిస్తారు. కానీ ఈ మూడేళ్లలో ఎన్ఎంసీ ఆచరణ సరిగా ఉందా లేదా అన్నదే ప్రశ్న. కొత్త చట్టం వచ్చినప్పుడూ, కొత్త వ్యవస్థలు రూపుదిద్దుకున్నప్పుడూ సంబంధిత రంగాల్లోనివారు నిశితంగా గమనిస్తారు. అవి తమ ఆశలకూ, ఆకాంక్షలకూ అనుగుణంగా ఉన్నాయో లేదో తరచి చూస్తారు. ఎంబీబీఎస్ పూర్తయ్యాక వైద్య వృత్తిలో ప్రవేశించేందుకైనా, పీజీ కోర్సుల్లో ప్రవేశం కోరడానికైనా నేషనల్ ఎగ్జిట్ టెస్ట్(నెక్స్ట్) పేరిట జరిగే ఉమ్మడి ప్రవేశపరీక్ష రాయాల్సిందేనన్న నిబంధనను బిల్లుపై పార్లమెంటు చర్చిస్తున్న సమయంలోనే వైద్యరంగ నిపుణులు, వైద్య విద్యార్థులు గట్టిగా వ్యతిరేకించారు. అలాగే ఫీజుల నిర్ణయం విషయంలోనూ ఆందోళన వ్యక్తమైంది. వారి అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ అది చట్టంగా మారింది. దాని సంగతలావుంచి కొత్త వ్యవస్థ అయినా పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదా? దేశవ్యాప్తంగా 38 వైద్య కళాశాలల గుర్తింపు రద్దు చేస్తున్నట్టు ఈమధ్యే ఎన్ఎంసీ ప్రకటించింది. మరో వందకు పైగా వైద్య కళాశాలల్లో అనేక లోటుపాట్లను గుర్తించి వాటిని సరిచేసుకోనట్టయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నిజానికి గతంలో ఎంసీఐ సైతం ఇలాంటి తనిఖీలే చేస్తుండేది. చర్యలు తీసుకునేది. అయినా దానిపై ఎందుకు ఆరోపణలొచ్చేవో, అది ఎందుకు భ్రష్టుపట్టిపోయిందో కొత్త వ్యవస్థ సారథులు సరిగా అర్థం చేసుకున్నట్టు లేరు.

వచ్చే నెలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ ప్రవేశాలుంటాయి గనుక ఎన్ఎంసీ ముందుగానే వైద్య కళాశాలలను తనిఖీ చేయటం మెచ్చదగింది. గుర్తింపు రద్దు చేసినంత మాత్రాన వెంటనే ఆ కళాశాలలకు కేటాయించిన సీట్లన్నీ రద్దుకావు. అవి సకాలంలో మేల్కొని దిద్దుబాటు చర్యలు తీసుకుని, తిరిగి దరఖాస్తు చేసుకుంటే ఎన్ఎంసీ పరిశీలించి అనుమతులు పునరుద్ధరిస్తుంది. అలాగే ఎన్ఎంసీ సంతృప్తి చెందని పక్షంలో సంబంధిత కళాశాల కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖను కూడా ఆశ్రయించే వెసులుబాటుంది. వైద్య కళాశాలలపై ప్రధానంగా బోధనా సిబ్బంది కొరత విషయంలోనే ఆరోపణలొస్తున్నాయి. రెసిడెంట్ డాక్టర్ల సమస్య సరేసరి. ఇక ఇతరేతర మౌలిక సదుపాయాల లేమి సైతం ఎన్ఎంసీ కన్నెర్రకు కారణమవుతోంది. వైద్య కళాశాలల్లో విద్యా ప్రమాణాల తీరుతెన్నులనూ, అక్కడి మౌలిక సదుపాయాల కల్పననూ మదింపు వేయటం చాలా అవసరం. అయితే ఆ ప్రక్రియలో పారదర్శకత లోపిస్తే మాత్రం ప్రయోజనం శూన్యం. వాస్తవానికి ఎన్ఎంసీ చట్టం–2019లోని సెక్షన్ 26(ఈ) ప్రకారం సంస్థకు చెందిన మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ (మార్బ్) కళాశాల తీరుతెన్నులపై ఇచ్చే మదింపు, ఆ కళాశాలకిచ్చే రేటింగ్ అందరికీ అందుబాటులో ఉంచాలి. కానీ ఈ నెల మొదట్లో జారీ చేసిన కళాశాలల ఏర్పాటు, మదింపు, రేటింగ్ నిబంధనల్లోని సెక్షన్ 25 దీన్ని నీరుగారుస్తోంది. నిజానికి ఎన్ఎంసీ ఏర్పడింది మొదలు కళాశాలల మదింపు నివేదికల జాడే లేదు. సరిగదా అంతక్రితం ఎంసీఐ ఉన్నప్పుడు పొందుపరిచిన మదింపు నివేదికలు, రేటింగ్‌లు సైతం మాయమయ్యాయి. ఫలానా కళాశాలలో ఏ సదుపాయాలు లోపించాయో, దానిపై ఎందుకు చర్యలు తీసుకోవలసి వచ్చిందో, కాలక్రమంలో అది ఏయే అంశాల్లో మెరుగుపడిందో అందరికీ తెలియకపోతే ఎట్లా? ఇక ఆ తనిఖీల వల్ల సాధారణ విద్యార్థులకు ఒరిగేదేముంటుంది? విద్యార్థులు నచ్చిన కళాశాలను ఎంపిక చేసుకునే సమయంలో ఎన్ఎంసీ మదింపు నివేదికలు అందుబాటులో ఉంటే, కళాశాల పూర్వ చరిత్ర తెలిస్తే వారు మెరుగైన నిర్ణయం తీసుకోగలుగుతారు. అంతేతప్ప కేవలం అది ప్రకటించిన ఫలితాన్నీ, దాని రేటింగ్‌నూ చూసి ఎలా సరిపెట్టుకుంటారు? ఈ చిన్న విషయం ఎన్ఎంసీకి తెలియదా? ఇలాంటి ధోరణి అటు కళాశాలలకు సైతం నష్టం కలిగిస్తుంది. రేటింగ్ సరిగా లేని కళాశాలలో స్వల్ప లోటుపాట్లు మాత్రమే ఉండొచ్చు. అవి సరిచేసుకునే స్థాయిలోనే ఉండొచ్చు. కానీ ప్రత్యర్థి కళాశాలకు చెందినవారు మాత్రం ఆ లోపాలను భూతద్దంలో చూపి తప్పుడు ప్రచారానికి దిగొచ్చు. విద్యార్థులకు తగిన సమాచారం అందుబాటులో లేకపోవటంతో ఆ కళాశాలపై అనాసక్తి ప్రదర్శిస్తారు.

ఎన్ఎంసీ తీరుపై కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)కి చాన్నాళ్ల క్రితమే ఫిర్యాదులు దాఖలయ్యాయి. ఆ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని సీఐసీ మొన్న మార్చిలో ఆదేశాలు కూడా ఇచ్చింది. తీరా ఈ నెల మొదట్లో నోటిఫై చేసిన నిబంధనలు గమనిస్తే సీఐసీ ఆదేశాలు బేఖాతరైనట్టు అర్థమవుతుంది. గతంలో పనిచేసిన ఎంసీఐ అవినీతిమయం అయిందని రద్దు చేస్తే, దాని స్థానంలో వచ్చిన ఎన్ఎంసీ కూడా అదే బాటలో సాగుతున్నదన్న అభిప్రాయం కలిగిస్తే, పారదర్శకతకు పాతరేస్తే ఏమనాలి? ఇది సరికాదు. దేశంలోని ప్రతి వైద్య కళాశాలకు సంబంధించి ఎంసీఐ కాలంనాటి మదింపు నివేదికలు, రేటింగ్‌లతోపాటు ఎన్ఎంసీ గత మూడేళ్ల అంచనాలు సైతం అందరికీ అందుబాటులో ఉంచాలి. విద్యార్థులు మెరుగైన నిర్ణయం తీసుకొనేందుకు తోడ్పడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.సప్తమి సా.5.55 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** శతభిషం రా.7.41 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.1.42 నుండి 3.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.29 నుండి 7.14 వరకు, **అమృతఘడియలు:** ప.12.48 నుండి 1.55 వరకు

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.29
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

శాంతి స్థాపనలో భారత్ ముఖ్యపాత్ర?

విశ్లేషణ



పి.కె. వాసుదేవ

ఉక్రెయిన్–రష్యా యుద్ధం కారణంగా చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. శాశ్వత కాల్పుల విరమణను, స్థిరమైన శాంతిని సాధించడానికి దీర్ఘకాలిక అంకితభావం, పట్టుదలతో పాటు అంతర్జాతీయ ఒత్తిడి అవసరం. ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణ ప్రభావిత ప్రాంతాలలో శాంతి భద్రతలను నిర్వహించడంలో భారత్ ముఖ్యమైన పాత్రను పోషించింది. పుతిన్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తోనూ భారత్ నాయకత్వం సన్నిహితంగా ఉండటంతో శాంతిని నెలకొల్పేందుకు భారత ప్రధాని మధ్యవర్తిత్వం వహించవచ్చని కొన్ని దేశాలు అభిప్రాయపడుతున్నాయి. సమస్యను పరిష్కరించడంలో అగ్రదేశాలు విఫలమవుతున్న నేపథ్యంలో భారత్ గురుతర బాధ్యత పోషించాల్సి ఉంది.

మెజారిటీ దేశాల ఆర్థిక వ్యవస్థలను అధమ స్థాయికి చేర్చిన 15 నెలల రష్యా–ఉక్రెయిన్ యుద్ధం గురించి ప్రపంచం మొత్తం ఆందోళన చెందుతోంది. ఈ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా ఇంధనం, ఆహార మార్కెట్లకు భారీ షాక్ ఇచ్చింది. సరఫరాను తగ్గించి, నిత్యావసరాల ధరలను మునుపెన్నడూ లేని స్థాయికి పెంచింది. ఇతర ఆర్థిక ప్రాంతాలతో పోలిస్తే, ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర రేపే ఆర్థిక పరిణామాలకు యూరో ప్రాంతానికి ప్రత్యేకించి హాని కలుగుతుంది.

అణ్వాయుధాలను ఆశ్రయించవచ్చని రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ పదేపదే హెచ్చరించినప్పటికీ, అణుయుద్ధం జరిగే అవకాశాలు పెద్దగా లేవు. తనను బెదిరించినట్లయితే రష్యా 'ప్రాదేశిక సమగ్రతను' రక్షించడానికి 'అందుబాటులో ఉన్న అన్ని ఆయుధ వ్యవస్థలను' ఉపయోగిస్తానని పుతిన్ 2022 సెప్టెంబరు 21న తేల్చిచెప్పారు.

భారత్ స్పందనేమిటి?

భారతదేశం సాంప్రదాయకంగా అంతర్జాతీయ సంఘర్షణలలో అలీన విధానాన్ని, తటస్థ విధానాన్ని అనుసరిస్తోంది. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణపై భారత ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తూ, సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. పుతిన్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సన్నిహితంగా ఉండటంతో శాంతి నెలకొల్పేందుకు ప్రధాని మోదీ మధ్యవర్తిత్వం వహించవచ్చని కొన్ని దేశాలు అభిప్రాయపడుతున్నాయి.

ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్ని భారత్ నిలకడగా సమర్థిస్తోంది. అయితే ఉక్రెయిన్‌లో 'సమగ్రమైన, న్యాయమైన, శాశ్వత శాంతి' ఆవశ్యకతను నొక్కిచెప్పే తీర్మానంపై ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో ఓటింగుకు మాత్రం భారత్ దూరంగా ఉండిపోయింది.

2015లో, క్రిమియాను రష్యా విలీనం చేసుకోవడాన్ని ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి సాధారణ సభ చేసిన తీర్మానానికి... ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదనే విధానాన్ని పేర్కొంటూ భారతదేశం దూరంగా ఉంది. అయితే దౌత్య మార్గాల ద్వారా వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం భారతదేశం పిలుపునిచ్చింది. అలాగే మిన్స్క్ ఒప్పందం అమలు జరగాలని సూచించింది. భారత్ వైఖరిని ఉక్రెయిన్‌తో సహా కొన్ని దేశాలు విమర్శించాయి. రష్యా చర్యలపై న్యూఢిల్లీ మరింత బలమైన వైఖరిని తీసుకోవాలని ఉక్రెయిన్ వాదించింది. అంతర్జాతీయ శాంతి పరిరక్షక ప్రయత్నాలలో, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి మిషన్లలో పాల్గొనడం ద్వారా భారతదేశం నిర్మాణాత్మక పాత్ర పోషిస్తూ వస్తోంది. ఐరాస శాంతి పరిరక్షక కార్యకలాపాలకు దళాలను స్థిరంగా అందించిన సుదీర్ఘ చరిత్ర భారత్‌కు ఉంది. పైగా ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణ ప్రభావిత



ప్రాంతాలలో శాంతి భద్రతలను నిర్వహించడంలో భారత్ ముఖ్య పాత్రను పోషించింది.

విశ్వసనీయ దేశం

దేశాల సఖ్యత విషయంలో భారతదేశం విశ్వసనీయతను పొందుతోంది. ఇండో–పసిఫిక్ ఫోరమ్ దేశాలు భారత టీకా దౌత్యం, అవసరమైన సమయంలో మానవతా సహాయం తర్వాత భారతదేశంతో సహకారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఆసక్తిని వ్యక్తం చేశాయి. ఆస్ట్రేలియాతో ద్వైపాక్షిక సంబంధాలు కూడా గణనీయమైన పురోగతిని చూపుతున్నాయి. ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మధ్య సమావేశాలు పరస్పర విశ్వాసంతో గౌరవంతో జరిగాయి. సంబంధాలను మెరుగుపరిచేందుకు తీవ్రంగా కృషి చేసిన తర్వాత, ఎలక్ట్రిక్ కార్ బ్యాటరీల కోసం భారత్‌కు లిథియం సరఫరా చేసేందుకు ఆస్ట్రేలియా సిద్ధంగా ఉండటంతో ఇరుపక్షాల సంబంధాలు కొత్త పుంతలు తొక్కాయి.

హిరోషిమాలో ఇటీవల జరిగిన జీ7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ రష్యాతో యుద్ధాన్ని ముగించే శాంతి ప్రణాళికను ప్రధాని మోదీకి అందించారు. దానికి భారతదేశం ఆమోదం కోరారు. ఉక్రెయిన్‌లో పర్యటించాల్సిందిగా మోదీని ఆహ్వానించారు కూడా. అధికారిక సోర్సుల ప్రకారం, అనేక దేశాలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత్ వైపు చూస్తున్నాయని భావించినందున, తన శాంతి ప్రతిపాదనకు మద్దతు కోరడం మినహా జెలెన్‌స్కీ భారతదేశంపై ఎటువంటి డిమాండ్ మోపలేదు. ఈ ప్రతి పాదనను మోదీ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

శాంతి స్థాపన చర్యలు

ఉక్రెయిన్ యుద్ధంలో కాల్పుల విరమణను అమలు చేయడం అనేది బహుళ పార్టీలతో, భౌగోళిక రాజకీయ పరిగణనలతో కూడిన సంక్లిష్ట సమస్య. కాల్పుల విరమణ కోసం తీసుకోవాల్సిన కొన్ని చర్యలు: ఉక్రెయిన్, రష్యా, తూర్పు ఉక్రెయిన్‌లోని వేర్పాటువాద సమూహాలతో సహా వివాదాస్పద పక్షాల మధ్య చర్చలను సులభతరం చేయడానికిగానూ దౌత్య ప్రయత్నాలను ప్రోత్సహించడం; సంభాషణను, శాంతి చర్చలను సులభతరం చేయడానికి ఐక్యరాజ్య సమితి లేదా ఐరోపాలో భద్రత, సహకార సంస్థ (ఓఎస్‌సీఈ) వంటి అంతర్జాతీయ మధ్యవర్తులు లేదా సంస్థలను నిమగ్నం చేయడం; విరుద్ధమైన పార్టీలు శత్రుత్వాలను విరమించుకోవడానికి తగిన దౌత్యపరమైన ఒత్తిడి తీసుకురావాలని యూఎస్, యూరోపియన్ యూనియన్, పొరుగుదేశాల వంటి అంతర్జాతీయ పాత్రధారులను కోరడం; కాల్పుల విరమణకు అనుగుణంగా ఆర్థిక ఆంక్షలు విధించడం; దౌత్యపరంగా ఒంటరయ్యేట్టు చూడటం; ఇంకా ఇతర రాజకీయ చర్యలను ఉపయోగించవచ్చు. ప్రమేయం ఉన్న పక్షాల మధ్య సంభాషణ, నమ్మకాన్ని పెంపొందించడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేలా పరస్పర విశ్వాసాన్ని పాదుగొలిపే చర్యలు తప్పనిసరి. ఇందులో ఖైదీల మార్పిడి, భారీ ఆయుధాల ఉపసంహరణ, నిర్దిష్ట స్థానిక ప్రాంతాల్లో కాల్పుల విరమణల అమలు వంటివి ఉంటాయి.

అంతేకాకుండా, సంఘర్షణలో చిక్కుకున్న పౌరులకు వైద్య సామగ్రి, ఆహారం, ఆశ్రయంతో సహా ప్రభావిత ప్రాంతాల్లో మానవతా సహాయానికి, తోడ్పాటుకు అనియంత్రిత ప్రాప్యతను ఏర్పరచాల్సిన అవసరం ఉంది.

జనాల బాధలను తగ్గించడానికి, సద్భావనను పెంపొందించడానికి రెండు వైపులా మానవతా సాయాన్ని అందించాలి. దీనితో పాటు కాల్పుల విరమణ అమలును పర్యవేక్షించడానికి, ధృవీకరించడానికి సమర్థవంతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఇందులో అంతర్జాతీయ పరిశీలకులు, శాంతి పరిరక్షక దళాలకు ప్రమేయం ఉండాలి. ఈ సంస్థలు కాల్పుల విరమణ ఉల్లంఘనలను నివేదించడంలో సహాయపడతాయి. అలాగే అంగీకరించిన నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూడటం ద్వారా పార్టీల మధ్య విశ్వాసాన్ని పెంపొందించవచ్చు. రాజకీయ, ఆర్థిక, జాతిపరమైన మనోవేదనలతో సహా సంఘర్షణ మూల కారణాలను పరిష్కరించడానికి రాజకీయ సంభాషణలను, సయోధ్యను ప్రోత్సహించాలి. సంఘర్షణ–ప్రభావిత ప్రాంతాల ప్రతినిధులతో సహా మొత్తం వాటాదారులను నిమగ్నం చేయడం అనేది, అంతర్లీన సమస్యలను పరిష్కరించడంలో, స్థిరమైన శాంతి ఒప్పందం కోసం పని చేయడంలో సహాయపడుతుంది.

ఈ పరిమాణంలో ఉన్న సంఘర్షణను పరిష్కరించడానికి అన్ని పార్టీల నిబద్ధత, సహకారం అవసరం. శాశ్వత కాల్పుల విరమణను, సుస్థిరమైన శాంతిని సాధించడానికి దీర్ఘకాలిక అంకితభావం, పట్టుదల, అంతర్జాతీయ ఒత్తిడి అవసరం.

వ్యాసకర్త అంతర్జాతీయ వాణిజ్య విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇదీ సేవే!



ట్రూ కాలర్‌లో స్పామ్ కాల్స్‌ను 'ఫ్రాడ్' అని మార్క్ చేసేవాళ్లు తమ పనికి తగిన విలువ దక్కని దయాళువులు.

– ఆదిత్య మేనన్, జర్నలిస్ట్

మూల బీజం



ఈ 'అఖండ్ భారత్' మ్యాప్ ఎక్కడినుంచి వచ్చిందని మీరు ఆశ్చర్యపడుతుంటే గనక, అది హిందుత్వ ఊహల నుంచి వచ్చింది. అది హిందూ రాజ్యం అనే భావనతో లోతుగా ముడిపడి ఉంది.

– ఆడ్రే ట్రూష్కే, చరిత్రకారిణి

పెద్ద ప్రశ్నలు



గాంధీజీ హత్యకు సంబంధించిన న్యాయ విచారణ పాఠం చదివితే ఎవరైనా గందరగోళానికి గురవుతారు. గాడ్సే ఎన్ని గుళ్లను పేల్చాడన్నది నిర్ధారించలేదు. ఎందుకంటే ఆయన రివాల్వర్ కనబడలేదు. ఎందుకు మనూ, అభాలను సాక్షులుగా తీసుకోలేదు? ఎవరికీ తెలీదు. ఈ హత్య లబ్ధిదారులు బ్రిటిష్‌వాళ్లు. ఆర్ఎస్ఎస్ మీద నేరం మోపలేదు అయినా దూషణకు గురైంది.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

ఏమిటీ గోల?



మార్కెటింగ్ కాల్స్ తప్పించుకోవడానికి ఎవరైనా ఎందుకు బజాజ్ ఫైనాన్స్ దగ్గర తమ నంబర్ రిజిస్టర్ చేసుకోవాలి? ప్రభుత్వ 'డీఎన్‌డీ' (డు నాట్ డిస్టర్బ్) రిజిస్ట్రీ చాలదా? కాల్ సెంటర్ కాల్స్ తనను ఇబ్బందికి గురిచేయకూడదని ఒక వ్యక్తి అనుకుంటే అతడిని బజాజ్ ఫైనాన్స్ శిక్షిస్తుందా?

– మాలిని, జర్నలిస్ట్

వెయ్యి రోజులా?



పరిశోధక విద్యార్థి ఉమర్ ఖాలిద్ ఏ విచారణ, బెయిల్ లేకుండానే జైల్లో వెయ్యి రోజులు పూర్తిచేసుకున్నాడు. ఆయన మీద చేసినవి తప్పుడు ఆరోపణలు అయినప్పటికీ, వాటిల్లో పొంతన లేని తనం ఉన్నప్పటికీ బెయిల్ తిరస్కరణకు గురైంది.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

ఎంతకాలం ఉచితం?



రెండు కథనాలు నన్ను ఆకర్షించాయి. ఇండియాలో సంగీతం మీద డబ్బులు ఆర్జించడాన్ని 'స్పాటిఫై' సవాలు చేయడం; 'హాట్‌స్టార్' తన ధోరణి మార్చుకుని క్రికెట్‌ను ఉచితంగా ప్రసారం చేయడం. అందరికీ రెండు ప్రశ్నలు. ఉచిత కంటెంట్‌ను మనం ఇష్టపడతాం, తరచుగా వచ్చే వాణిజ్య ప్రకటనలను పట్టించుకోం; ఎందుకు? ఒక్కసారి ఉచితమైతే ఇక భవిష్యత్‌లో ఎప్పుడైనా డబ్బులు చెల్లిస్తామా?

– రానీ స్క్రూవాలా, నిర్మాత

ఏం చేస్తున్నట్టు?




ఉత్తరాఖండ్ సరిహద్దులో వాస్తవాధీన రేఖ వెంబడి చైనా సైన్యం ఎన్నో కొత్త నిర్మాణాలను చేపట్టింది. అయినప్పటికీ చైనా పేరెత్తడానికి మోదీ ఇంకా ధైర్యం కూడగట్టుకోవలసే ఉంది. లదాఖ్, అరుణాచల్ తర్వాత ఒకవేళ ఉత్తరాఖండ్‌లో మరింత భూభాగాన్ని కూడా చైనా తీసుకుంటే యూఎస్ గానీ, రష్యా గానీ ఇండియాను కాపాడలేవు.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

ఇన్‌బాక్స్

విస్మృత దేశభక్తుడు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం తెలంగాణలో జన్మించిన పలువురు కవులు వెలుగులోకి వచ్చారు. అటువంటి వారిలో 'ప్రతిజ్ఞ' రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు ఒకరు. పైడిమర్రి 1962 లోనే ప్రతిజ్ఞ రాసినప్పటికీ, పాఠ్య పుస్తకాలలోకి ప్రతిజ్ఞ అయితే చేరింది కానీ, రచయిత పేరు మాత్రం చేరలేదు. తెలంగాణ సాహితీవేత్తల విజ్ఞప్తి మేరకు 2015లో నూతనంగా ముద్రించిన పాఠ్య పుస్తకాలలో ప్రతిజ్ఞ రచయిత అంటూ ఆయన పేరు చేర్చారు. అలాగే 5, 9వ తరగతి పాఠ్యపుస్తకాలలో ఆయన జీవిత వివరాలను పొందుపరిచారు. 2016లో ఆయన శత జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో సంస్మరణ సభను ఏర్పాటు చేసి పైడిమర్రి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఇదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పైడిమర్రి పేరును పాఠ్యపుస్తకాలలో చేర్చింది.



పైడిమర్రి వెంకట సుబ్బారావు

1916 జూన్ 10న నల్లగొండ జిల్లాలోని అన్నెపర్తి గ్రామంలో జన్మించిన పైడిమర్రి వెంకట సుబ్బారావు గొప్ప దేశభక్తుడిగా పేరు పొందారు. పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించి బహుభాషా కోవిదుడిగా పేరు పొందారు. ఆయన 'కాలభైరవుడు' వంటి నవలలు రాశారు. అనేక ప్రాంతాల్లో ఖజానా శాఖలో వివిధ హోదాలలో పనిచేశారు. హోమియోపతి వైద్యునిగా పేరు పొందారు.

1962లో ఇండియా–చైనా మధ్య యుద్ధం వచ్చినప్పుడు విద్యార్థులలో దేశభక్తి, సోదర భావం వంటివి పెంచడానికి ఓ వాగ్దాన గీతం ఉంటే బావుంటుందని భావించి, తొమ్మిది వాక్యాల ప్రతిజ్ఞ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో 1964 నుండీ, 1965 నుండి దేశవ్యాప్తంగా ఆయన రాసిన ప్రతిజ్ఞను పాఠశాలల్లో విద్యార్థులు చేస్తున్నారు. అయితే తెలుగు రాష్ట్రాల పాఠ్యపుస్తకాలలో మాత్రమే ప్రతిజ్ఞ వద్ద ఆయన పేరు చేరింది. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల పాఠ్య పుస్తకాలలో ఆయన పేరు చేరాల్సి ఉంది. దేశానికి ప్రతిజ్ఞ అందించిన పైడిమర్రి జయంతి వేడుకలను వాడవాడలా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

– ఎమ్. రాం ప్రదీప్, తిరువూరు

(నేడు పైడిమర్రి జయంతి, హైదరాబాద్‌లో 'ప్రతిజ్ఞ సందేశం' పుస్తకావిష్కరణ)

జాతీయ బ్యాంకులపై ప్రైవేటు 'కత్తి'

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

ప్రైవేటీకరణ కత్తితో పబ్లిక్ రంగ సంస్థలపై విరుచుకుపడుతున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలు మరో 10 నెలల్లో ఎదుర్కోబోతున్నప్పటికీ తన ప్రైవేటీకరణ ఎజెండా నుంచి 'తగ్గేదేలే' అంటోంది. 'బ్యాంకింగ్ రంగంలో మరిన్ని సంస్కరణలు చేపట్టనున్నాం' అంటూ ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో మరోవిడత పబ్లిక్ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లను విలీనం చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు అర్థమయింది. ఇంతకుముందు 10 పబ్లిక్ రంగ బ్యాంకులను విలీన ప్రక్రియతో 4కు కుదించిన కేంద్రం.. మరో 12 చిన్న ప్రభుత్వరంగ బ్యాంకులను విలీన ప్రక్రియ ద్వారా 4కు కుదించడానికి పావులు కదుపుతోంది. నిజానికి 2021లోనే నీతిఆయోగ్ చేసిన సిఫార్సులతో కేంద్ర ప్రభుత్వం 'బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) బిల్లు 2021'ను రూపొందించింది గానీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టలేదు.

జూలై లేదా ఆగస్ట్ మాసంలో ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో 'బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) బిల్లు 2021'ను ప్రవేశపెట్టి ఆమోదించుకొన్నాక, 12 చిన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను కుదించేందుకు కేంద్రం చాపకిందనీరులా పని మొదలు పెట్టింది. పీఎస్‌బీలను ప్రైవేటీకరించే అంశంలో ఓ కమిటీని నియమించి, సదరు కమిటీ సిఫార్సుల మేరకు వాటిల్లో పెట్టుబడులను ఉపసంహరించుకోవాలన్నది కేంద్ర ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తున్నది.

కేంద్ర ప్రభుత్వ ఆలోచనలను పసిగట్టిన బ్యాంకు ఉద్యోగ సంఘాలు 'బ్యాంక్ బచావో... దేశ్ బచావో' అనే నినాదంతో ఆందోళన చేయడానికి సమాయత్తం అవుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ రంగ బ్యాంకులు ఐదున్నర దశాబ్దాలుగా వెన్నెముకగా నిలుస్తున్నాయి. 60 శాతం జనాభా ఆధారపడిన వ్యవసాయ రంగానికి; 20 కోట్ల మంది ఆధారపడిన చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు తక్కువ వడ్డీపై రుణాలందించి వాటి వ్యాపార కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించడానికి దోహదం చేస్తున్నవి పీఎస్‌బీలే.

ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రాధాన్యత రంగాలలో మొదటిది వ్యవసాయరంగమే. రిజర్వ్‌బ్యాంకు నిబంధనల ప్రకారం.. ప్రభుత్వ రంగ బ్యాంకులు అందించే మొత్తం రుణవితరణలో 40 శాతం ప్రాధాన్యతా రంగాలకు అందించాలి. అంతేకాదు పీఎస్‌బీలు చేసే వ్యవసాయ రుణవితరణలో తప్పనిసరిగా చిన్న, సన్నకారు రైతాంగానికి 8 శాతం మేర రుణాలు అందించాలి. 1969లో బ్యాంకులు జాతీయం అయ్యేనాటికి గ్రామీణ ప్రాంతాలలో రుణవితరణ కేవలం రూ. 115 కోట్లు కాగా, జాతీయం అయ్యాక కేవలం ఒక దశాబ్ద కాలం నాటికే రూ. 3,000 కోట్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ రుణాల పరిమాణం అదే కాలంలో రూ. 67 కోట్ల నుండి రూ. 2,800 కోట్లకు చేరింది. కాగా, ప్రస్తుతం జాతీయ బ్యాంకులు అందిస్తున్న వ్యవసాయ రుణాలు రూ. 10 లక్షల కోట్లుగా ఉన్నాయి. దేశ ఆర్థికాభివృద్ధిలో జాతీయ బ్యాంకులు పోషిస్తున్న పాత్ర ఏమిటో దీనినిబట్టి అర్థం చేసుకోవచ్చు.

అంతేకాకుండా, ప్రభుత్వరంగ బ్యాంకులపై చట్టపరంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్‌బీఐల అజమాయిషీ, నియంత్రణ గలిగి ఉంటాయి. పైగా, డిపాజిట్‌ల రక్షణ విషయంలో సెంట్రల్ విజిలెన్స్ కమిటీ (సీవీసీ), సీబీఐలు కూడా అవసరమైన సందర్భాలలో జోక్యం చేసుకొనే అవకాశం ఉంది. దీనికితోడు 2005 నుంచి 'సమాచార హక్కు చట్టం' ద్వారా ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరుకు సంబంధించిన సమాచారాన్ని ప్రతి పౌరుడు పొందే వెసులుబాటు ఉంది. ఇన్ని వ్యవస్థలు ప్రభుత్వరంగ బ్యాంకుల్ని 'వాచ్ డాగ్'లా కనిపెట్టుకొని ఉండటం వల్ల వాటికి జవాబుదారీతనం హెచ్చుస్థాయిలో ఉంది.



ఇందిరాగాంధీ దేశానికి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1969లో తొలుత 14 బ్యాంకుల జాతీయాకరణ జరిగింది. దేశానికి స్వతంత్రం లభించిన ఏడాది తర్వాతనే భారత రిజర్వుబ్యాంకును జాతీయం చేశారు. 1955లో 'ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'ను 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'గా మార్చారు. కాగా, 1980లో మరో 6 బ్యాంకుల్ని జాతీయం చేశారు. జాతీయ బ్యాంకులకు సామాజిక బాధ్యత ఉండటం వల్ల సంక్షేమ రాజ్యం భావనతో రాజ్యాంగం ఏర్పరిచిన లక్ష్యాల మేరకు సామాన్యులకు సైతం సేవలు అందిస్తున్నాయి. అయితే, 1991లో దేశంలో 'సంస్కరణలు; ఉదార ఆర్థిక విధానాలు' మొదలయ్యాక... వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో, ప్రభుత్వ రంగ బ్యాంకులలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ మొదలయింది. ప్రభుత్వరంగ బ్యాంకుల బోర్డులలో రాజకీయ నాయకులకు స్థానం కల్పించడం ఎక్కువయ్యాక, వారి ప్రమేయంతో పేరు, ఊరు లేని సంస్థలకు భారీగా రుణాలందించడం కూడా ఎక్కువైంది. కావాలని బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టే జాడ్యం దేశంలో పెరిగిపోయింది. ఫలితంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల నిరర్థక ఆస్తులు దాదాపు 12 శాతం మేరకు చేరుకొన్నాయి. అయితే, వాటిని సమర్థవంతంగా రికవరీ చేయకుండా ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించడం ఏకైక మార్గంగా పరిగణించడం కేంద్రంలోని ప్రభుత్వాలకు అలవాటైంది.

ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరణ బాట పట్టించడం వల్ల ఒనగూరే లాభాలు చాలా స్వల్పం. కస్టమర్ సేవల్లో, పాలనా వ్యవహారాలలో నాణ్యత పెరిగే మాట నిజమే. అలాగే, నిరర్థక ఆస్తుల శాతం తగ్గిపోతుంది. అయితే, ప్రైవేటు బ్యాంకుల కార్యకలాపాలపై ఆర్‌బీఐ పర్యవేక్షణ నామమాత్రంగా ఉంటుంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తెచ్చిన బ్యాంకింగ్ నియంత్రణ చట్టం– 1949, ఆర్‌బీఐ చట్టం–1934 వంటివి ప్రైవేటు బ్యాంకులకు వర్తించినప్పటికీ... ఆ రెండు చట్టాలూ డిపాజిటర్ల హక్కులను పూర్తిగా రక్షించలేవు. ఇక, ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగ నియామకాల్లో అమలు జరిగే రిజర్వేషన్లను ప్రైవేటు బ్యాంకులు అమలు చేయవు. దానివల్ల ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు అవకాశాలు లేకుండా పోయి, సామాజిక న్యాయం జరగాలన్న రాజ్యాంగ లక్ష్యం దెబ్బతింటుంది.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

క్లుప్తంగా...

చిరుతతో పోరాడి.. రైతు ప్రాణాలు కాపాడిన ఆవు

- కర్ణాటకలోని దావణగెరె జిల్లాలో ఘటన



చిరుతతో పోరాడిన ఆవు గౌరీతో యజమాని కరిహాలప్ప

బనశంకరి: తన యజమానిపై దాడి చేసిన చిరుత పులితో తీవ్రంగా పోరాడి రైతు ప్రాణాలు ఆవు కాపాడిన ఘటన కర్ణాటకలోని దావణగెరె జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... చెన్నగిరి తాలూకా ఉబ్రాణి హోబళి కొడతికెరె గ్రామానికి చెందిన రైతు కరిహాలప్ప(58) గత సోమవారం తన ఆవును తోటలో వదిలిపెట్టి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాడు. అక్కడే మాటువేసిన చిరుత పులి ఒక్కసారిగా కరిహాలప్పపై దాడి చేసింది. గమనించిన ఆవు పరుగెత్తుకొచ్చి చిరుతపైకి దూకింది. కొమ్ములతో పొడిచింది. దీంతో చిరుత కిందపడిపోగా, అక్కడే ఉన్న శునకం కూడా దానిపైకి దూకింది. దీంతో చిరుత అక్కడి నుంచి ఉడాయించింది. ఈ సందర్భంగా రైతు కరిహాలప్ప మాట్లాడుతూ తాను పోషించిన ఆవు గౌరీ, శునకం మాత్ర శౌర్యాన్ని ప్రదర్శించి చిరుత బారి నుంచి తన ప్రాణాలు కాపాడాయని చెప్పాడు.

కులమతాల మధ్య చిచ్చుపెడుతున్న చంద్రబాబు

- 985వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో మూడు రాజధానుల ఏర్పాటు తప్పనిసరని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 985వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. ఓ ప్రాంతానికే అభివృద్ధిని కేంద్రీకరించాలని చూసినందుకే బాబుకు గత ఎన్నికల్లో చావుదెబ్బ పడిందని తెలిపారు. అయినా తన తీరు మార్చుకోకుండా బహుజనుల ప్రయోజనాలకు దెబ్బకొడుతూ అడ్డగోలు రాజకీయాలు చేస్తున్న బాబును తరిమికొట్టడం ఖాయమన్నారు. రాజధాని పేరుతో బాబు దోచేసిన రూ.3.50 లక్షల కోట్లు కక్కించేందుకు విచారణకు వేస్తే వ్యవస్థలను అడ్డుపెట్టుకుని స్టేలు తెచ్చుకుని తిరుగుతున్న బాబు రాష్ట్రంలో కులమతాల మధ్య చిచ్చుపెడుతూ తన పబ్బం గడుపుకోవాలని చూడటం దుర్మార్గమని చెప్పారు. ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగురుతానన్న చందంగా పాదయాత్రలో లోకేశ్ చేస్తున్న వ్యాఖ్యలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, వార్డు కౌన్సిలర్‌గా గెలవలేని లోకేశ్‌ను ఎల్లోమీడియాలో జాకీలు పెట్టి లేపి చూపిస్తున్న తీరు హాస్యాస్పదమన్నారు. వీరంతా కలిసి ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు బాబు అండ్ కో, ఎల్లో మీడియాను ఎప్పటికీ ప్రజలు నమ్మరని చెప్పారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, పులి దాసు, కారుమూరి పుష్పరాజ్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గడపకు మహిళా పోలీస్!



మహిళలతో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి తదితరులు

చిత్తూరు అర్బన్: మహిళా సాధికారత కోసం సీఎం వైఎస్ జగన్ చేపడుతోన్న కార్యక్రమాలకు అనుగుణంగా..మహిళల సమస్యలు తెలుసుకుని, నేరాలను తగ్గించడానికి చిత్తూరు జిల్లా పోలీసులు శుక్రవారం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి రూపొందించిన 'ప్రతీ గడపకు మహిళా పోలీస్' కార్యక్రమాన్ని కలెక్టర్ షన్మోహన్ ప్రారంభించారు. అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, నగర మేయర్ అముద కలిసి పలు ఇళ్లల్లో మహిళలతో మాట్లాడారు. మహిళలపై వేధింపుల నివారణ, ఆకతాయిల సమస్యల పరిష్కారానికి ఓ యాప్‌ను రూపొందించి వివరాలను అందులో నిక్షిప్తం చేశారు. సత్ఫలితాలిస్తే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని డీఐజీ తెలిపారు.

ఇక వాహనాల తుక్కు యూనిట్లు

కాల పరిమితి ముగిసిన వాహనాలు ఇక తుక్కుకే



సాక్షి, అమరావతి: కాలం చెల్లిన వాహనాలకు సెలవు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'వాహనాల తుక్కు విధానం' మేరకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణకు ఉపక్రమిస్తోంది. అందుకోసం జిల్లాస్థాయిలో 'వెహికల్ స్క్రాపింగ్ యూనిట్లు' నెలకొల్పనుంది. దాంతోపాటు ప్రైవేట్ రంగంలోనూ వెహికల్ స్క్రాపింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలని తాజాగా నిర్ణయించింది. అందుకోసం ఔత్సాహిక వ్యాపారులకు అనుమతులు జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. కేంద్ర విధానం ప్రకారం 15 ఏళ్ల జీవిత కాలం దాటిన వాణిజ్య వాహనాలు, 20 ఏళ్ల జీవిత కాలం దాటిన వ్యక్తిగత వాహనాలను తుక్కుగా మార్చాల్సి ఉంది. ఈ ఏడాది నుంచే ఈ విధానాన్ని అమలు చేయాలని కేంద్రం స్పష్టంగా నిర్దేశించింది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో వాహనాల స్క్రాపింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ రిజిస్టర్ అథారిటీగా నిర్ణయించారు. అంటే స్క్రాపింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేసే అధికారం రవాణా శాఖ కమిషనర్‌కు అప్పగించారు. ఇక అప్పిలేట్ అథారిటీగా రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వ్యవహరిస్తారు. రవాణా శాఖ కమిషనర్ దరఖాస్తును తిరస్కరిస్తే ఆ నిర్ణయాన్ని పునఃసమీక్షించేందుకు అప్పిలేట్ అథారిటీని సంప్రదించవచ్చు.

కాల పరిమితి దాటిన వాహనాలు 2 లక్షలు

రాష్ట్రంలో దాదాపు 1.50 కోట్ల వాహనాలు ఉన్నాయి. వాటిలో 1.20 కోట్లు వ్యక్తిగతవి కాగా.. 30 లక్షలు వాణిజ్య వాహనాలు. 15 ఏళ్లు జీవిత కాలం దాటిన వాణిజ్య వాహనాలు, 20 ఏళ్ల జీవిత కాలం దాటిన వ్యక్తిగత వాహనాలు కలిపి దాదాపు 2 లక్షల వాహనాలు ఉంటాయని అంచనా. వాటిని తుక్కుగా మార్చాల్సి ఉందని గుర్తించారు. తరువాత ఏటా జీవిత కాలం ముగిసే వాహనాలను తుక్కు కింద మారుస్తారు. రాష్ట్రంలో ప్రభుత్వ వాహనాల్లోనే దాదాపు 3,500 వాహనాలకు జీవితకాలం ముగిసిందని ఇటీవల నిర్ధారించారు. మొదట ఆ వాహనాలను తుక్కుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం అన్ని శాఖలకు త్వరలోనే ఆదేశాలు జారీ చేయనుంది.

జిల్లాకు రెండు యూనిట్లు

జిల్లాకు కనీసం రెండు చొప్పున వెహికల్ స్క్రాపింగ్ యూనిట్లు నెలకొల్పాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అందుకు తగిన స్థలం, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులను ప్రోత్సహిస్తారు. వాహనాల ఫిట్‌నెస్‌ను పూర్తిగా కంప్యూటర్ ఆధారంగా నిర్ధారించేందుకు ఆటోమేటెడ్ వెహికల్ చెకింగ్ యూనిట్లను నెలకొల్పాలి. అలా వాహనాల ఫిట్‌నెస్‌ను నిర్ధారించి సర్టిఫికెట్లు జారీ చేస్తారు. మరమ్మతులు, రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసేందుకు కూడా పనికిరావు అని నిర్ధారించే వాహనాలను తుక్కు కింద మార్చాల్సి ఉంది. వాటితోపాటు జీవితకాలం పూర్తయిన వాహనాలను కూడా యజమానులు తుక్కు కింద మార్చవచ్చు. తుక్కు కింద ఇచ్చే కార్లు, బస్సులు, లారీలు, ఆటోలకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు స్క్రాపింగ్ యూనిట్లు చెల్లిస్తాయి. స్క్రాపింగ్ యూనిట్లు జారీ చేసే సర్టిఫికెట్‌ను సమర్పిస్తే కొత్త వాహనం కొనుగోలుపై వాహనాల కంపెనీలు డిస్కౌంట్లు ఇస్తాయి. ఆ మేరకు వాహన తయారీ కంపెనీలతో కేంద్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది. స్క్రాపింగ్ యూనిట్లలో వాహనాల తుక్కును ఆ కంపెనీలకు విక్రయిస్తారు. స్క్రాపింగ్ సర్టిఫికెట్ సమర్పిస్తే కొత్త వాహనాల కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం పన్ను రాయితీ ఇస్తుంది. దాంతో కాలం చెల్లిన వాహనాలను తుక్కు కింద మార్చి, కొత్త వాహనాల కొనుగోలుకు ప్రోత్సాహం లభిస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. రోడ్లపై తిరుగుతున్న కాలం చెల్లిన వాహనాలపై రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారు. ఆ వాహనాల యజమానులపై జరిమానాలు విధిస్తారు. దాంతో కాలుష్య నియంత్రణ సాధ్యమవడంతోపాటు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని రవాణా శాఖ భావిస్తోంది.

2005లో చార్జిమెమో ఇచ్చి 2015లో చర్యలా?

- అది కూడా పదవీ విరమణ చేశాక!
- శాఖాపరమైన చర్యల్లో అసాధారణ జాప్యం చెల్లదు : హైకోర్టు

సాక్షి, అమరావతి: ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే విషయంలో అసాధారణ జాప్యం తగదని హైకోర్టు స్పష్టం చేసింది. ఓ ఉద్యోగికి 2005లో చార్జిమెమో ఇచ్చి, 2015లో అతనిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా షోకాజ్ నోటీసులివ్వడాన్ని తప్పుపట్టింది. అది కూడా ఆ ఉద్యోగి పదవీ విరమణ చేసిన ఏడేళ్లకు షోకాజ్ నోటీసులివ్వడంపై విస్మయం వ్యక్తంచేసింది. తీరిక ఉన్నప్పుడు చర్యలు తీసుకుంటామంటే కుదరదని, ఇదే విషయాన్ని సుప్రీం కోర్టు సైతం స్పష్టం చేసిందని హైకోర్టు గుర్తు చేసింది. ఓ విషయంలో స్పష్టత కోసం ఉన్నతాధికారులకు లేఖలు రాశామని, ఈ ప్రక్రియ కారణంగానే ఐదేళ్ల జాప్యం జరిగిందన్న అధికారుల వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. 2005లో ఆ ఉద్యోగికి అధికారులు జారీ చేసిన చార్జిమెమోను, 2015లో జారీ చేసిన షోకాజ్ నోటీసును హైకోర్టు రద్దు చేసింది. ఈ విషయంలో ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

2010లో విచారణ పూర్తి.. 2015లో షోకాజ్ నోటీసులు..

శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేవీవీ సత్యనారాయణమూర్తి వ్యవసాయశాఖాధికారి. అరకు అటవీశాఖలో డిప్యుటేషన్‌పై అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో సత్యనారాయణమూర్తిపై విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారంటూ ఆరోపణలొచ్చాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు అతనికి 2005లో చార్జిమెమో ఇచ్చారు. దీనికి ఆయన వివరణ ఇచ్చారు. వివరణ సంతృప్తికరంగా లేదంటూ విచారణకు ఆదేశించారు. 2010లో విచారణను ముగించారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఆరోపణలు రుజువు కాలేదని విచారణలో తేల్చారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని విచారణాధికారి తన నివేదికలో పేర్కొన్నారు. విచారణ జరుగుతుండగానే 2008 డిసెంబర్ 12న సత్యనారాయణమూర్తి పదవీ విరమణ చేశారు. 2015లో సత్యనారాయణమూర్తికి షోకాజ్ నోటీసులిచ్చి, పెనాల్టీ ఎందుకు విధించకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ షోకాజ్ నోటీసులను సవాలు చేస్తూ సత్యనారాయణమూర్తి ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ)ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్.. 2005లో జారీ చేసిన చార్జిమెమోను, 2015లో జారీ చేసిన షోకాజ్ నోటీసులను రద్దు చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ వ్యవసాయ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ హైకోర్టులో 2017లో పిటిషన్ దాఖలు చేశారు.

మరో మూడు భారత్ గౌరవ్ పర్యాటక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): భారత దేశంలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లోని ముఖ్యమైన చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక ప్రదేశాలను తెలుగు రాష్ట్రాల ప్రజలు సందర్శించుకునేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో మొదటి భారత్ గౌరవ్ రైళ్లను ప్రవేశపెట్టింది. మార్చి 18న సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన మొదటి రైలుకు విశేష స్పందన రావటంతో ఇప్పటి వరకు ఐదు రైళ్లను విజయవంతంగా నడిపారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు జూన్, జూలై నెలల్లో మరో మూడు రైళ్లను నడిపేందుకు రైల్వేశాఖ చర్యలు తీసుకుంది.

దర్శించే ప్రదేశాలు..టికెట్ ధరలు: ఈ నెల 28, జూలై 12, 26 తేదీల్లో సికింద్రాబాద్‌లో బయలుదేరే ఈ రైలుకు సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోటలో బోర్డింగ్ పాయింట్ సదుపాయం కల్పించారు. ఎనిమిది రాత్రుళ్లు, తొమ్మిది పగళ్లు సాగే ఈ యాత్రలో పూరి, కోణార్క్, గయా, అయోధ్య, ప్రయాగ్ తదితర పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు. ఈ ప్రయాణ సమయంలో అల్పాహారం, భోజనం, వసతి, పర్యాటక ప్రదేశాలను దర్శించేందుకు రోడ్డు మార్గంలో రవాణా, టూర్ గైడ్, ఎస్కార్ట్స్, ప్రయాణ బీమా తదితర ఏర్పాట్లు చేశారు. స్లీపర్ క్లాస్ ఒక్కొక్కరికి రూ. 15,075, 3 ఏసీ రూ.23,875, 2 ఏసీ రూ.31,260 ప్యాకేజీగా నిర్ణయించారు. ఆసక్తి ఉన్నవారు ఐఆర్‌సీటీసీ విజయవాడ కార్యాలయంలో గానీ, వెబ్‌సైట్ ద్వారా గానీ టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

ప్రజల పరిశీలనకు'స్విమ్స్'లో 'శ్రీబయో'

సాక్షి, అమరావతి: తిరుపతిలోని స్విమ్స్‌లో శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ(శ్రీబయో) ఏర్పాటులో భాగంగా రూ.124 కోట్లతో సివిల్ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను జ్యుడీషియల్ ప్రివ్యూ, ఏపీ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రతిపాదనలపై ప్రజలు, బిడ్డర్‌ల నుంచి సూచనలు, అభ్యంతరాలను తెలియజేయవచ్చు. క్యాన్సర్‌కు అత్యాధునిక చికిత్స సదుపాయాలను అందుబాటులోకి తీసుకుని రావడంపై సీఎం జగన్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో టీటీడీ సహకారంతో తిరుపతిలో శ్రీబయోను ఏర్పాటు చేస్తున్నారు. రూ.124 కోట్లతో బయోకు భవన నిర్మాణాలు చేపడతారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి భవన నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. మరో రూ.200 కోట్ల నిధులతో అత్యంత అధునాతన వైద్య పరికరాలను సమకూర్చనున్నారు.

మోతుగూడెం పరిసరాల్లో పెద్దపులి సంచారం

పాదముద్రలు సేకరించిన డీఎఫ్‌వో





ఆధారాలు సేకరిస్తున్న అటవీ సిబ్బంది (ఇన్‌సెట్‌లో) సుకుమామిడి అటవీ ప్రాంతంలో పెద్దపులి అడుగుల ముద్రలు

మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా): చింతూరు మండలం మోతుగూడెం సమీపంలోని సుకుమామిడి పరిసరాల్లో పెద్దపులి సంచరించినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. మోతుగూడెం గ్రామానికి చెందిన రైతు నాగేశ్వరరావుకు సంబంధించిన గేదెపై రెండు రోజుల కిందట సుకుమామిడి సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి దాడి చేసి చంపింది. ఈ విషయం తెలియడంతో డీఎఫ్‌వో సౌజన్య శుక్రవారం గేదె కళేబరాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న పాదముద్రల కొలతలు సేకరించారు. అవి పెద్దపులి పాదముద్రలుగా ఉన్నాయని డీఎఫ్‌వో తెలిపారు. పులి కదలికలు తెలుసుకునేందుకు నిఘా కెమెరాలు అమర్చి అటవీ సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. సమీప గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, రాత్రిళ్లు బయటకు రావొద్దని ఆమె సూచించారు. రాత్రి వేళ గస్తీ నిర్వహించాలని అటవీ సిబ్బందిని ఆదేశించారు.

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకున్న మంత్రి కాకాణి

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) డాక్టరేట్ పట్టాను అందజేసింది. వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి చేతుల మీదుగా శుక్రవారం డాక్టరేట్ ధ్రువీకరణ పత్రాన్ని మంత్రి కాకాణి అందుకున్నారు. ఆయన వీఎస్‌యూలో పీహెచ్‌డీ రీసెర్చ్‌లో భాగంగా పంచాయతీరాజ్ వ్యవస్థలో మార్పులు, నూతన సంస్కరణలపై అధ్యయనం చేసి శుక్రవారం కమిటీ సభ్యుల సమక్షంలో పీహెచ్‌డీ వైవా ప్రజెంటేషన్ ఇచ్చారు. దాదాపు 45 నిమిషాల పాటు పంచాయతీరాజ్ వ్యవస్థలో చోటు చేసుకున్న మార్పులు, నూతన సంస్కరణల వల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనాలు, ఇతర అంశాల గురించి క్షుణ్ణంగా వివరించారు. మంత్రి ప్రజెంటేషన్‌ను కమిటీ సభ్యులు అభినందించి డాక్టరేట్‌కు సిఫార్సు చేశారు. దీంతో వైస్ చాన్సలర్ కమిటీ సభ్యులు, ఇతర ప్రముఖులు సమక్షంలో గోవర్ధన్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు.

రూ.8 వేల కోట్లతో వైద్య కళాశాలల నిర్మాణం

- ఈ ఏడాది ఐదు కాలేజీల ప్రారంభం
- అందుబాటులోకి రానున్న 750 ఎంబీబీఎస్ సీట్లు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు



గాజులరేగ సమీపంలో వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కృష్ణబాబు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో రూ.8 వేల కోట్లతో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను దశలవారీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. విజయనగరం జిల్లా గాజులరేగ సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల, వసతిగృహాల భవనాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ తొలి విడతగా విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, నంద్యాల, మచిలీపట్నం వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాలకు అనుగుణంగా జూలై 15కు భవనాల నిర్మాణం పూర్తి చేసి ఆగస్టు నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కొత్త కాలేజీల వల్ల రాష్ట్రంలో అదనంగా 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఒక్కో వైద్య కళాశాలలో 722 మంది ఉద్యోగులు ఉంటారని, మరో 280 మంది చొప్పున నియమించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వివరించారు. ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ డి.మురళీధరరెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, అకడమిక్ డీఎంఈ సత్యవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమైన పులివెందుల స్కిల్ అకాడమీ

రూ.40 కోట్లతో ఏర్పాటు

- డ్రోన్, ఆటోమోటివ్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాల్లో నైపుణ్య శిక్షణ
- ప్రాకార్, టాటా స్ట్రైవ్, గ్రీన్‌కో, నెడ్‌క్యాప్‌లతో ఒప్పందం
- జర్మనీలో అవకాశాలు పొందేలా జర్మన్, ఇంగ్లిష్ భాషల్లో శిక్షణ
- రబ్బర్ టెక్నాలజీపై 5 మొబైల్ ల్యాబ్‌లు
- వచ్చే నెల 8న వైఎస్సార్ జయంతి సందర్భంగా సీఎం చేతుల మీదుగా ప్రారంభం



నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమవుతున్న పులివెందులలోని స్కిల్ అకాడమీ

సాక్షి, అమరావతి: నూతన సాంకేతిక పరిజ్ఞానంలో యువతకు నైపుణ్యం పెంచడానికి పులివెందులలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ అకాడమీ ప్రారంభానికి సిద్ధమయ్యింది. సుమారు రూ.40 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఈ స్కిల్ అకాడెమీలో డ్రోన్ టెక్నాలజీ, రెన్యువబుల్ ఎనర్జీ, విద్యుత్ వాహనాలకు సంబంధించిన కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 8న వైఎస్సార్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా స్కిల్ అకాడమీని ప్రారంభించడానికి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ప్రణాళిక సిద్ధం చేసింది. ఏటా కనీసం రెండు వేల మందికి ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకోటిరెడ్డి తెలిపారు. ఈ అకాడమీలో మొత్తం ఐదు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ)లను ఏర్పాటు చేశామని, ఇందుకోసం ఆయా రంగాల్లోఉన్న ప్రముఖ కంపెనీలతో కలిసి ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ స్కిల్ అకాడమీలో భాగస్వామ్యం కావడానికి టాటా గ్రూపునకు చెందిన స్కిల్ అకాడెమీ టాటా స్ట్రైవ్ ఆసక్తిని వ్యక్తం చేసింది.

డ్రోన్ సీవోఈ

డోర్ డెలివరీ నుంచి వ్యవసాయ రంగంలో పురుగు మందుల పిచికారీ వరకు ఇప్పుడు డ్రోన్ వినియోగం పెరుగుతోంది. దీంతో డ్రోన్ టెక్నాలజీలో అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఈ అకాడమీలో డ్రోన్ సీవోఈని ఏర్పాటు చేస్తున్నారు. దీని ఏర్పాటుకి ప్రాకార్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ముందుకు రాగా నాలెడ్జ్ పార్టనర్‌గా ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం వ్యవహరించనుంది.

రెన్యువబుల్ ఎనర్జీ సీవోఈ

పునరుత్పాదక ఇంధన వనరుల్లో భారీ పెట్టుబడులను రాష్ట్రం ఆకర్షిస్తోంది. దానికి అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందుకోసం ఈ అకాడమీలో రెన్యువబుల్/సోలార్ సీవోఈని గ్రీన్ జాబ్స్ ఎస్ఎస్‌సీ ఏర్పాటు చేస్తోంది. అలాగే విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుతుండటంతో ఆటోమోటివ్ ఎలక్ట్రిక్ వెహికల్ సీవోఈని నెడ్‌క్యాప్ ఏర్పాటు చేస్తోంది.

జర్మనీ అవకాశాల కోసం

ఆటోమోటివ్ రంగంలో జర్మనీలో అవకాశాలు అధికంగా ఉండటంతో వాటిని అందిపుచ్చుకునేలా లాంగ్వేజ్ సీవోఈని ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. జర్మనీ, ఇంగ్లిష్ భాషల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సీవోఈని ఏర్పాటు చేయడానికి లాజిస్టిక్ ఎస్ఎస్‌సీ ముందుకొచ్చింది. అలాగే రబ్బర్ పునర్వినియోగంపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని రబ్బర్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా స్కిల్ ఆన్ వీల్స్ సీవోఈ పేరిట ఐదు వాహనాల్లో ల్యాబ్‌లను ఏర్పాటు చేసి పులివెందుల కేంద్రంగా రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ ఇవ్వనున్నారు.

• తెలంగాణ

జాగా ఉంటే చాలు 'గృహ'లక్ష్మి!

సాక్షి, హైదరాబాద్: తెల్ల రేషన్ కార్డు ఉండి ఎంతో కొంత సొంత జాగా ఉంటే చాలు 'గృహలక్ష్మి' పలకరించబోతోంది. ఇల్లు నిర్మించేందుకు ఎంత జాగా ఉండాలన్న విషయంలో పరిమితులేమీ లేకుండా పథకాన్ని ప్రారంభించే యోచనలో ప్రభుత్వం ఉంది. దీనికి ముఖ్యమంత్రి ఆమోదం కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. ఓ పద్ధతి, ప్రణాళిక అంటూ లేకుండా చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం వివాదాలకు కేంద్రంగా మారిన నేపథ్యంలో, లబ్ధిదారులకే రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించి, సొంత జాగాలో వారే ఇల్లు నిర్మించుకునేలా 'గృహలక్ష్మి' పథకానికి రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. ఈ పథకాన్ని కాంగ్రెస్ హయాంలో కొనసాగిన 'ఇందిరమ్మ ఇళ్ల' తరహాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పరిమితులు ఉండాలా? వద్దా?

సొంత జాగా ఉన్న తెల్ల రేషన్ కార్డు దారులకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరు చేయనున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వేర్వేరుగా నిర్ధారిత పరిమాణంలో సొంత జాగా ఉండేలా నిబంధనలు రూపొందించాలని, కులాలవారీగా రిజర్వేషన్లు ఏర్పాటు చేయాలని తొలుత భావించారు. దీనివల్ల కొత్త వివాదం రావటంతోపాటు ఆ పథకం పట్టాలెక్కేందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ఎలాంటి పరిమితులు లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. సొంత జాగా ఉంటే చాలు ఇల్లు మంజూరు అన్నట్టుగా నిబంధనల రూపకల్పనకు ఆలోచన చేస్తున్నారని సమాచారం. అయితే, గృహ నిర్మాణ శాఖ అధికారులను పరిగణనలోకి తీసుకోకుండా, ఐఏఎస్ అధికారుల స్థాయిలోనే దీని కసరత్తు జరుగుతున్నట్టు, సీఎం నుంచి తుది ఆమోదం తీసుకుని పథకాన్ని పట్టాలెక్కించాలని భావిస్తున్నట్టు సమాచారం. త్వరలో ఎన్నికలు జరగనున్నందున, ఈ లోపు కనీసం లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఉంది. ఈ పథకం నియమనిబంధనలు ఫైనల్‌గా ముఖ్యమంత్రి నిర్ణయంపై ఆధారపడి ఉన్నాయి. ఆయన నుంచి అనుమతి రాగానే పథకంపై ప్రకటన ఉండనుంది.

కేంద్రప్రభుత్వ పథకంలో లింకు లేకుండా..

గృహలక్ష్మి పథకాన్ని కేంద్రప్రభుత్వ గృహ నిర్మాణ పథకంతో లింకు లేకుండా ప్రస్తుతానికి సొంత నిధులతోనే చేపట్టే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా అన్ని నియోజకవర్గాలకు కలిపి 4 లక్షల ఇళ్లకు పరిపాలన అనుమతులు జారీ చేసి, కనీసం లక్ష ఇళ్లకు నిధులు మంజూరు చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజనతో లింకు పెట్టారు. కేంద్రం మంజూరు చేసిన ఇళ్ల సంఖ్య ఆధారంగా అక్కడి నుంచి నిధులు విడుదలయ్యాయి. తొలి విడత నిధులు వచ్చినా, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం ఓ పద్ధతి లేకుండా సాగటంతో కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. కనీసం లబ్ధిదారుల జాబితా కూడా లేకుండా పథకాన్ని ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించి, జాబితా ఇస్తేనే మలివిడత నిధులు విడుదల చేస్తామని తేల్చి చెప్పింది. దీంతో కేంద్రం నిధులు ఆగిపోయాయి. ఫలితంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం అభాసుపాలయ్యింది. ఇప్పుడు ఎన్నికలకు ఎక్కువగా సమయం లేని నేపథ్యంలో, కేంద్రప్రభుత్వ పథకంతో లింకు పెట్టుకుంటే సమయం వృథా అవుతుందని, దాని బదులు సొంత నిధులతోనే చేపడితే బాగుంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. కొద్ది రోజుల్లో పథకం వివరాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

'మాచ్‌ఖండ్'పై మూడు కొత్త ప్రాజెక్టులు

- అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్‌లో 98 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మాణం
- ఉద్యోగుల భాగస్వామ్యంపై అధ్యయనానికి అంతర్గత కమిటీ
- ఏపీ, ఒడిశా అధికారుల ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేషన్ కమిటీ సమావేశం

సాక్షి, అమరావతి: 'మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్ అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్‌లో 98 మెగావాట్ల సామర్థ్యంతో మూడు కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి ఏపీ, ఒడిశా రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. రెండు ప్రభుత్వాలు, ఏపీ జెన్‌కో, ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఓహెచ్‌పీసీ) మధ్య మాచ్‌ఖండ్ హైడ్రో ఎలక్ట్రిక్ (జాయింట్) పథకంపై 2020 అక్టోబర్ 23న ఒప్పందం కుదిరింది. దీనికి సంబంధించి రెండు శాఖల అధికారులతో మొదటి ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేషన్ కమిటీ (పీఏసీ) సమావేశం భువనేశ్వర్‌లో శుక్రవారం జరిగింది. మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్, మాచ్‌ఖండ్ నదిపై చేపట్టాల్సిన ఇతర ప్రాజెక్టులపై ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల అధికారులు చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ జెన్‌కో, ఓహెచ్‌పీసీ మధ్య 50:50 నిష్పత్తిలో ఉద్యోగుల భాగస్వామ్యంపై అధ్యయనం చేసి, 30 రోజుల్లో నివేదిక ఇచ్చేలా అంతర్గత కమిటీ ఏర్పాటుకు అంగీకరించారు. రెండు రాష్ట్రాల ఇంధన కార్యదర్శులు పీఏసీ సమావేశానికి కో–చైర్మన్లుగానూ, ఏపీ జెన్‌కో, ఓహెచ్‌పీసీ మేనేజింగ్ డైరెక్టర్లు సభ్యులుగానూ ఉండేలా ఇరు రాష్ట్రాలు అంగీకరించాయి.

క్లుప్తంగా...

మోదీ రాక కోసం ఎదురుచూస్తున్నాం

అమెరికా రక్షణ శాఖ వెల్లడి

వాషింగ్టన్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాక కోసం తాము ఉత్సాహంగా ఎదురుచూస్తున్నామని అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది. మోదీ పర్యటన భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త ఒరవడిని నిర్దేశిస్తుందని ఆశిస్తున్నట్లు తెలియజేసింది. అంతేకాకుండా రక్షణ సహకారం, భారత్‌లో స్వదేశీ రక్షణ రంగ పారిశ్రామిక ప్రగతి విషయంలో భారీ, చరిత్రాత్మక, ఉత్తేజభరిత ప్రకటనలు వెలువడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ప్రధాని మోదీ ఈ నెల 21న అమెరికా పర్యటన ప్రారంభిస్తారు. నాలుగు రోజులపాటు అగ్రరాజ్యంలో పర్యటిస్తారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ప్రథమ పౌరురాలు జిల్ బైడెన్ ఈ నెల 22న ఇచ్చే అధికారిక విందుకు మోదీ హాజరవుతారు. అధ్యక్షుడిగా బైడెన్ పగ్గాలు చేపట్టిన తర్వాత మోదీ అమెరికాలో అధికారికంగా పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి. మోదీ రాకవల్ల భారత్, అమెరికా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని భావిస్తున్నట్లు అమెరికా రక్షణ శాఖ సహాయ మంత్రి (ఇండో–పసిఫిక్ భద్రతా వ్యవహారాలు) ఎలీ రట్నార్ చెప్పారు. ఇరు దేశాల వ్యూహాత్మక సంబంధాల్లో ఇదొక చరిత్రాత్మక సందర్భం అవుతుందన్నారు.

సిద్ధూ దయవల్లే భగవంత్ మాన్‌కు సీఎం పోస్టు

నవజోత్ కౌర్ స్పష్టీకరణ

చండీగఢ్: తన భర్త నవజోత్‌సింగ్ సిద్ధూ దయవల్లే భగవంత్ మాన్ పంజాబ్ ముఖ్యమంత్రి అయ్యారని నవజోత్ కౌర్ పరోక్షంగా తేల్చి చెప్పారు. పంజాబ్ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నేత భగవంత్ మాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ క్రికెటర్ నవజోత్‌సింగ్ సిద్ధూ నడుమ మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఆమె తాజాగా ట్వీట్ చేశారు. 'ఆప్' జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒకదశలో తన భర్త సిద్ధూను పంజాబ్ సీఎంగా నియమించాలని కోరుకున్నారని తెలిపారు. వివిధ మార్గాల్లో సిద్ధూను సంప్రదించారని ఉద్ఘాటించారు. పార్టీని దృష్టిలో పెట్టుకొని చివరకు భగవంత్ మాన్‌ను సీఎంగా ఎంపిక చేశారని వెల్లడించారు. భగవంత్‌కు ముఖ్యమంత్రి పదవి సిద్ధూ ఇచ్చిన బహుమతి అని స్పష్టం చేశారు. సిద్ధూకు పంజాబ్ ప్రజల సంక్షేమమే ముఖ్యమని, అందుకోసం ఎలాంటి త్యాగాలైనా చేస్తారని పేర్కొన్నారు. స్వర్ణ పంజాబ్ అనేది సిద్ధూ కల అని వివరించారు. 2022 ఫిబ్రవరిలో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

అమెరికా అధ్యక్షుడు ఎవరైనా పదవి దిగిపోయిన వెంటనే తన అధీనంలో ఉన్న ప్రభుత్వ డాక్యుమెంట్లు జాతీయ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ ఏజెన్సీ (ఎన్ఏఆర్ఏ)కి అప్పగించాలి. ప్రభుత్వానికి సంబంధించిన ఆ రహస్య పత్రాలన్నీ జాతి సంపదగా భావిస్తారు. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఓటమి పాలైన కొద్ది నెలలకి అంటే 2021 మేలో ఎన్ఏఆర్ఏ ట్రంప్ రహస్య పత్రాలు పూర్తిగా ఇవ్వలేదని తొలిసారిగా బయటపెట్టింది. రెండు డజన్ల బాక్సుల్లో ఉండే పత్రాలు ఇవ్వలేదని పేర్కొంది. దీనిపై విచారణ మొదలై ట్రంప్ అధీనంలో ఉన్న రహస్య పత్రాలన్నీ ఆర్కైవ్స్‌కు ఇవ్వాలంటూ కోర్టు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. 2021 జనవరిలో అధ్యక్షుడిగా గద్దె దిగిన ట్రంప్ వందలాది పత్రాలను తన అధీనంలోనే ఉంచుకున్నట్టుగా ఆరోపణలు వచ్చాయి. కోర్టు ఆదేశాలతో ట్రంప్ తరఫు లాయర్లు మరో 30 పత్రాలు అందజేశారు. అంతకు మించి తమ దగ్గర ఏవీ లేవని స్పష్టం చేశారు. 2022 ఆగస్టులో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) రంగంలోకి దిగి ఫ్లోరిడాలోని ట్రంప్ ప్రైవేటు ఎస్టేట్ మార్ ఎ లాగోలో సోదాలు చేపడితే 15 బాక్సుల్లో 184 కీలక పత్రాలు లభించాయి. ఇందులో 67 విశ్వసనీయ పత్రాలు, 92 రహస్య, 25 అత్యంత రహస్య పత్రాలు లభించినట్టుగా అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇదే తరహా రహస్య పత్రాల కేసులో ట్రంప్ హయాంలో ఉపాధ్యక్షుడిగా వ్యవహరించిన మైక్ పెన్స్, అంతకు ముందు ఉపాధ్యక్షుడు, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌పై కేసులు నమోదై ఉన్నాయి. వైట్ హౌస్ నుంచి అత్యంత కీలకమైన డాక్యుమెంట్లను ట్రంప్ ఉద్దేశపూర్వకంగానే తీసుకువెళ్లారా ? గూఢచర్య చట్ట నిబంధనల్ని ట్రంప్ ఉల్లంఘించారా ? అన్న దిశగా ప్రాసిక్యూషన్ విచారణ సాగిస్తోంది.అయితే శ్వేతసౌధం ఖాళీ చేయడానికి తక్కువ సమయం ఇవ్వడంతో హడావుడిగా తీసుకువెళ్లిన సామాన్లలో పత్రాలు కూడా వచ్చి ఉంటాయని ట్రంప్ కార్యాలయం అప్పట్లో సమర్థించుకుంది.



ఏమిటీ రహస్య పత్రాల కేసు..?

ట్రంప్‌పై నేరాభియోగాలు

నమోదు చేసిన ఫెడరల్ జ్యూరీ

- మాజీ అధ్యక్షుడిపై నేరుగా అభియోగాలు నమోదు చేయడం చరిత్రలో తొలిసారి
- ఏడు ఆరోపణలతో కేసు నమోదు

మియామి: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చుట్టూ ఒకదాని తర్వాత మరొకటి కేసుల ఉచ్చు బిగుస్తోంది. ప్రభుత్వానికి చెందిన అత్యంత రహస్య పత్రాల కేసులో ట్రంప్‌పై నేరాభియోగాలు నమోదయ్యాయి. ఒక మాజీ అధ్యక్షుడిపై ఫెడరల్ జ్యూరీ నేరుగా అభియోగాలు నమోదు చేయడం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారి. ఈ కేసులో 13 తేదీ మంగళవారం మియామి కోర్టుకు హాజరు కావాలని సమన్లు కూడా అందాయి. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. ఒక మాజీ అధ్యక్షుడికి దేశంలో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని తాను ఎన్నడూ ఊహించలేదన్నారు. అమెరికా చరిత్రలో ఇదో చీకటి రోజుగా అభివర్ణించారు. దేశం ఎంతగా దిగజారిపోతున్నా, అందరం కలిసి అమెరికా గ్రేట్ ఎగైన్ అని నిరూపిద్దామని తన అభిమానులకి పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వానికి జరుగుతున్న పోరులో ముందంజలో ఉన్న ట్రంప్ చుట్టూ కేసుల ఉచ్చు బిగుస్తూ ఉండడం రాజకీయంగా ఆయనకి గట్టి ఎదురుదెబ్బగానే చెప్పాలి. నిన్నటికి నిన్న పోర్న్ స్టార్‌కి ముడుపులు చెల్లించిన కేసులో నేరాభియోగాలు ఎదుర్కొన్న ట్రంప్ ఈ సారి ఏకంగా ఫెడరల్ జ్యూరీ అభియోగాలనే నేరుగా ఎదుర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా 2021లో గద్దె దిగిన తర్వాత ప్రభుత్వానికి సంబంధించిన రహస్య పత్రాలను ఆర్కైవ్స్‌కు అప్పగించకుండా ఫ్లోరిడాలో తన ఎస్టేట్‌కు తరలించారని ట్రంప్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే

రుజువైతే వందేళ్లు జైలు

రహస్య పత్రాల కేసులో గూఢచర్య చట్టం కింద డొనాల్డ్ ట్రంప్‌పై ఏడు అంశాల్లో అభియోగాలు నమోదయ్యాయి. ప్రభుత్వానికి చెందిన రహస్య పత్రాలను ఉద్దేశపూర్వకంగా తన దగ్గర ఉంచుకోవడం, న్యాయ ప్రక్రియను అడ్డుకోవడానికి కుట్ర, నిజాయితీ లేకుండా డాక్యుమెంట్లను దాచిపెట్టడం, తన గుట్టు బయటపడకుండా పథక రచన, తప్పుడు ప్రకటనలు జారీ చేయడం వంటి అంశాల్లో అభియోగాలు నమోదయ్యాయి. ఇవి రుజువైతే ట్రంప్‌కి గరిష్టంగా వందేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలున్నాయి. ట్రంప్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి ఈ అభియోగాలు ఎలాంటి అడ్డంకి కాకపోయినప్పటికీ రిపబ్లికన్ పార్టీలో ట్రంప్ అభ్యర్థిత్వానికి ఎంత మద్దతు లభిస్తుందా అన్న అనుమానాలైతే ఉన్నాయి.

ట్రంప్ ఎదుర్కొంటున్న కేసులు ఇవే..!

హష్ మనీ

అగ్రరాజ్యం చరిత్రలో నేరాభియోగాలు ఎదుర్కొన్న ఒక మాజీ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ హష్ మనీ కేసులో నిలిచారు. 2016 అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్నప్పుడు తనతో లైంగిక సంబంధాలున్నాయని ఆరోపించిన పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్ నోరు మూయించడానికి 1.30 లక్షల డాలర్లను ముట్టజెప్పినట్టు అభియోగాలు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో ట్రంప్ లాయర్ మైఖేల్ కోహెన్ ద్వారా సొమ్ములు చెల్లించి ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. ఈ కేసులో ట్రంప్ మన్‌హట్టన్ క్రిమినల్ కోర్టుకు ఈ ఏడాది ఏప్రిల్ 4న హాజరయ్యారు.

క్యాపిటల్‌పై దాడి

2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ట్రంప్ ఓటమి భారాన్ని తట్టుకోలేక క్యాపిటల్ భవనంపై దాడికి తన అనుచరుల్ని ఉసిగొల్పిన ఘటనకు సంబంధించిన కేసు కూడా పెండింగ్‌లో ఉంది. కొలంబియా జిల్లా కోర్టులో ట్రంప్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. అదే సమయంలో కొత్త అధ్యక్షుడిగా జో బైడెన్ ఎన్నికను కాంగ్రెస్ ధ్రువీకరించకుండా అడ్డుకోవాలని అప్పటి ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్‌పై ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలపై కూడా కేసు నమోదై ఉంది.

అక్రమ వ్యాపారాలు

డొనాల్డ్ ట్రంప్ న్యూయార్క్‌లో చేసిన వ్యాపారాల్లో నిబంధనల్ని తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడ్డారని, తన ఆస్తుల్ని కూడా తప్పుడుగా చూపించారంటూ న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిషియా జేమ్స్ కేసు నమోదు చేశారు. ట్రంప్ న్యూయార్క్ రాష్ట్రంలో వ్యాపార లావాదేవీలు కొనసాగించకుండా నిషేధం విధించాలంటూ ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంలో ఇప్పటికే ట్రంప్‌ను అటార్నీ జనరల్ తన కార్యాలయంలోనే కొన్ని గంటలు ప్రశ్నించారు. న్యాయస్థానంలో ఈ కేసు అక్టోబర్‌లో విచారణకు రానుంది.

ఎన్నికల్లో అక్రమాలు

2020 అధ్యక్ష ఎన్నికల్లో ఎన్నికల తుది ఫలితాలు ప్రకటించడానికి ముందే జో బైడెన్‌పై గెలుపు తనదేనంటూ ట్రంప్ ప్రచారం చేయడంపై విచారణ జరుగుతోంది. జార్జియా రాష్ట్ర కార్యదర్శి బ్రాడ్ రాఫెన్స్‌పెర్గర్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుతూ జార్జియాలో జరిగిన రీకౌంట్‌లో తనకు అదనపు ఓట్లు లెక్కించాలంటూ మాట్లాడిన సంభాషణ బయటకు రావడంతో ఈ కేసు నమోదైంది. ఈ ఏడాది జులై–సెప్టెంబర్ మధ్య ఈ కేసులో నేరాభియోగాలు నమోదయ్యే అవకాశాలున్నాయి.



కాలమిస్ట్‌పై అత్యాచారం

మూడు దశాబ్దాల క్రితం తనపై అత్యాచారం చేశారన్న ఆరోపణలతో కాలమిస్ట్ జీన్ కరోల్ వేసిన కేసులో డొనాల్డ్ ట్రంప్‌ను న్యూయార్క్ కోర్టు మే 9న దోషిగా తేల్చింది. 1990లో మన్‌హటన్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూమ్‌లో ట్రంప్ తనపై అత్యాచారం చేశారంటూ 2019లో న్యూయార్క్ కోర్టులో ఆమె పిటిషన్ వేశారు. ఏప్రిల్ 25న దీనిపై విచారణ మొదలైంది. కరోల్‌ను అబద్ధాల కోరుగా ప్రచారం చేసి ఆమె పరువుని బజారుకి ఈడ్చినందుకు నష్టపరిహారంగా 50 లక్షల డాలర్లు చెల్లించాలంటూ న్యూయార్క్ కోర్టు తీర్పు చెప్పింది. దీనిపై ట్రంప్ న్యాయనిపుణుల బృందం పై కోర్టుకు వెళ్లనుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఈయన పేరు డాక్టర్ జో డిటూరి. యూఎస్ నేవీ రిటైర్డ్ డైవర్, శాస్త్రవేత్త.. నీటి అడుగున దీర్ఘకాలం జీవించే మనిషి శరీరంపై ఒత్తిడి ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయం తెలుసుకోవాలనుకున్నారు జో. ఇందుకోసం ఫ్లోరిడా సమీపంలోని సముద్రంలో 22 అడుగుల లోతైన జూల్స్ అండర్ సీ లాడ్జి గదిలోకి మార్చి ఒకటో తేదీన అడుగుపెట్టారు. శుక్రవారం బయటకు వచ్చారు. ఏకబిగిన 100 రోజులు ఒకే వాతావరణంలో నీటి అడుగున గడిపి ఇప్పటిదాకా ఉన్న 73 రోజుల రికార్డును బద్దలు కొట్టారు.

శరద్ పవార్‌ను చంపుతామంటూ బెదిరింపు

- ముంబై పోలీసులకు ఎన్సీపీ ఫిర్యాదు
- బెదిరింపులతో గొంతు నొక్కలేరు: పవార్



ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) చీఫ్ శరద్ పవార్(82)ను చంపుతామంటూ సోషల్ మీడియా ద్వారా బెదిరింపులు వస్తున్నాయని ఆ పార్టీ ఆరోపించింది. ఎన్సీపీ ఫిర్యాదు మేరకు ముంబై పోలీసులు దక్షిణ ప్రాంత సైబర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌కు బెదిరింపులపై సీఎం ఏక్‌నాథ్ షిండే స్పందించారు. పవార్‌ను గౌరవనీయుడైన సీనియర్ నేత అంటూ ఆయన..బెదిరింపు హెచ్చరికల అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటామని, దర్యాప్తు జరపాలంటూ ఆదేశాలిచ్చామని చెప్పారు. అవసరమైతే పవార్‌కు భద్రత పెంచాలని అధికారులను కోరామన్నారు. రాష్ట్రంలో ఉద్రిక్తతలు రాజేసేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఎం షిండే ఆరోపించారు. శరద్ పవార్ కూతురు, లోక్‌సభ ఎంపీ సుప్రియా సూలె ఆధ్వర్యంలో ఎన్సీపీ నేతలు శుక్రవారం ముంబై పోలీస్ చీఫ్ వివేక్ ఫన్సాల్కర్‌ను కలిసి, చర్యలు తీసుకోవాలని కోరారు. 'నరేంద్ర ధబోల్కర్‌కు పట్టిన గతే శరద్ పవార్‌కు పడుతుంది' అంటూ సామాజిక మాధ్యమం ద్వారా వచ్చిన మెసేజీ స్క్రీన్ షాట్ ప్రింటవుట్‌లను ఆయనకు అందజేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి చర్య తీసుకుంటామని అధికారులు తెలిపారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న నరేంద్ర ధబోల్కర్‌ను 2013 ఆగస్టు 20న గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. ఇలా ఉండగా, శరద్ పవార్‌కు బెదిరింపు మెసేజీ పంపిన సౌరవ్ పింపాల్కర్ బీజేపీ మద్దతుదారని అతడి సోషల్ మీడియా ప్రొఫైల్‌ను బట్టి తెలుస్తోందని ఎన్సీపీ సీనియర్ నేత అజిత్ పవార్ ఆరోపించారు. సిద్ధాంతపరమైన విభేదాలపై హుందాగా పోరాడాలే తప్ప, భావ ప్రకటన స్వేచ్ఛను ఈ విధంగా దుర్వినియోగం చేయరాదని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సంయమనం పాటించాలని, అందరూ ప్రశాంతంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఎన్సీపీ విజ్ఞప్తి చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం లౌకికవాదాన్ని ప్రోత్సహించి, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందో లేక దభోల్కర్ హంతకులను విడిచిపెడుతుందో లేదో వేచి చూస్తామని వ్యాఖ్యానించింది.

బెదిరింపులతో గొంతు నొక్కాలనుకోవడం భ్రమే: శరద్ పవార్

బెదిరింపులతో గొంతు నొక్కాలని ఎవరైనా అనుకుంటే అది భ్రమేనని శరద్ పవార్ వ్యాఖ్యానించారు. తనకు వచ్చిన బెదిరింపులపై ఆయన ఈ మేరకు స్పందించారు. మహారాష్ట్ర పోలీసులపై తనకు పూర్తి నమ్మకం ఉందని, అందుకే బెదిరింపులపై తాను భయపడటం లేదని చెప్పారు. మహారాష్ట్ర ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పించుకోజాలదన్నారు.

మణిపూర్‌లో మళ్లీ హింస.. ముగ్గురి కాల్చివేత

ఇంఫాల్: మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం ఇంఫాల్ వెస్ట్ జిల్లాలో భద్రతా బలగాల దుస్తుల్లో వచ్చిన సాయుధులు ఖోకెన్ అనే గ్రామంలోకి ప్రవేశించి ముగ్గురిని కాల్చి చంపారు. జవాన్లు అక్కడికి వచ్చే సరికే వారు పరారయ్యారు. దుండగులు మెయిటీ వర్గం వారై ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటన అనంతరం మణిపూర్ పోలీసులు, అస్సాం రైఫిల్స్, ఆర్మీ ఆ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఆర్మీ చేపట్టిన కూంబింగ్‌లో బుధవారం ఆటోమేటిక్, మోర్టార్లు, హ్యాండ్ గ్రనేడ్లు వంటివాటితోపాటు చిన్న ఆయుధాలు కలిపి 29 వరకు దొరకగా, గురువారం మరో 35 ఆయుధాలతోపాటు మందుగుండు సామగ్రిని కనుగొన్నట్లు అధికారులు తెలిపారు. మే 3నుంచి కొనసాగుతున్న అల్లర్లలో 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

చెన్నైలో పట్టాలు తప్పిన జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్

సాక్షి, చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని బేసిన్ బ్రిడ్జి యార్డ్ సమీపంలో జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. రెండు బోగీలు ట్రాక్ నుంచి కిందకు దిగాయి. ఆ సమయంలో రైలులో ప్రయాణికులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అధికారుల సమాచారం ప్రకారం.. జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ గురువారం అర్ధరాత్రి విజయవాడ నుంచి చెన్నైకి చేరుకుంది. ఎంజీఆర్ సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులంతా వెళ్లిపోయారు. మరుసటి రోజు ఉదయం ఇదే రైలు విజయవాడకు బయలుదేరాల్సి ఉంది. శుభ్రం చేయడానికి సమీపంలోని బేసిన్ బ్రిడ్జి యార్డ్‌కు తీసుకెళ్తుండగా హఠాత్తుగా ఒక బోగీ పట్టాలు తప్పింది. వెంటనే మరో బోగీ పట్టాలు తప్పింది. ఈ రెండు బోగీలను రైల్వే సిబ్బంది మళ్లీ ట్రాక్‌పైకి చేర్చారు. అన్ని రకాల తనిఖీల అనంతరం శుక్రవారం ఉదయం మళ్లీ సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఉదయం 7.20 గంటలకు ఈ రైలు విజయవాడకు బయలుదేరి వెళ్లింది.

భూగోళం.. అగ్నిగుండం

- రికార్డు స్థాయికి చేరిన గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలు
- వేగంగా వేడెక్కుతున్న భూమి
- 50 మంది సైంటిస్టుల ఉమ్మడి నివేదిక



లండన్: శిలాజ ఇంధనాల వాడకం, కాలుష్యం, వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, ప్రకృతి విపత్తులు.. వీటి గురించి తరచుగా వింటూనే ఉన్నాం. అయినప్పటికీ ప్రపంచ దేశాలు నష్టనివారణ చర్యలు చేపట్టిన దాఖలాలు మాత్రం పెద్దగా కనిపించడం లేదు. ప్రమాదకరమైన గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారం గరిష్ట స్థాయికి చేరినట్లు తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా వెలువడుతున్న గ్రీన్‌హౌజ్ వాయువులు 54 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌తో సమానమని తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా 50 మంది అగ్రశ్రేణి శాస్త్రవేత్తలు భూ ఉష్ణోగ్రతలపై విస్తృత అధ్యయనం నిర్వహించి, ఉమ్మడిగా నివేదిక విడుదల చేశారు. మానవ చర్యలు, గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారం భూతాపం, వాతావరణ మార్పులకు కారణమవుతున్నట్టు పేర్కొన్నారు. జీవజాలానికి ఇన్నాళ్లూ ఆవాసయోగ్యంగా ఉంటూ వస్తున్న భూగోళం క్రమంగా అగ్నిగుండంగా మారిపోతోందని హెచ్చరించారు. సైంటిస్టులు తమ నివేదికలో ఇంకా ఏం చెప్పారంటే..

- 1800వ సంవత్సరంతో పోలిస్తే భూఉపరితల ఉష్ణోగ్రతలు ఇప్పుడు 1.14 డిగ్రీలు పెరిగాయి.
- ఉష్ణోగ్రత ప్రతి పదేళ్లకు రికార్డు స్థాయిలో 0.2 డిగ్రీల చొప్పున పెరుగుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూతాపం మానవాళిని కబళించడం ఖాయం.
- గతంతో పోలిస్తే ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాల వాడకాన్ని యథాతథంగా కొనసాగిస్తే భూ ఉపరితల ఉష్ణోగ్రత సమీప భవిష్యత్తులోనే 2 డిగ్రీలు పెరిగిపోతుంది. ఇది చాలా ప్రమాదకరం.
- పారిశ్రామిక విప్లవం ముందునాటి సగటు కంటే ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీలకు మించి పెరగనివ్వరాదన్న పారిస్ ఒప్పంద లక్ష్యాన్ని సాధించడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా కృషి చేయాలి. మునుపెన్నడూ లేనిస్థాయిలో తక్షణమే పటిష్టమైన చర్యలు చేపట్టాలి.
- భూతాపం ముప్పు నుంచి మానవళి బయటపడాలంటే 2035 నాటికి ప్రపంచదేశాలు తమ గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలను 60 శాతానికి తగ్గించుకోవాలని సైంటిస్టు పియర్స్ ఫాస్టర్ చెప్పారు.

సరస్వతిని చంపలేదు.. ఆత్మహత్య చేసుకుంది

- దారుణ హత్య కేసు నిందితుడు మనోజ్ సానె వెల్లడి
- వారిది సహజీవనం కాదు, పెళ్లేనంటున్న ముంబై పోలీసులు



ముంబై: ముంబైలో మహిళ దారుణ హత్య ఘటనలో నిందితుడు మనోజ్ సానె(56) విచారణ సందర్భంగా పోలీసులకు పలు విషయాలు వెల్లడించాడు. తనతోపాటు ఉంటున్న సరస్వతీ వైద్య(36) ఈ నెల 3న ఉదయం విషం తాగి ఆత్మహత్య చేసుకుందని మనోజ్ చెప్పాడు. 'ఆమె నోటి నుంచి తెల్లటి నురగ వచ్చింది. అయితే ఆ నేరం నాపైకి వస్తుందని భయంతోనే మృతదేహాన్ని ముక్కలుగా చేసి, పారేశాను. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా. నేను హెచ్ఐవీ పాజిటివ్ అయినందున ఆమెతో ఎటువంటి శారీరక సంబంధం పెట్టుకోలేదు' అని పోలీసులకు తెలిపాడు. అయితే, మనోజ్ తమను తప్పుదోవ పట్టించేందుకు అవకాశాలున్నాయని పోలీసులు అంటున్నారు. అతడు చెప్పిన దాంట్లో నిజానిజాలను కనుగొనేందుకు విచారణ ముమ్మరం చేశారు. ఈ నేరం వెనుక కారణాలు స్పష్టంగా తెలియడం లేదని పోలీసు అధికారి ఒకరు చెప్పారు. మనోజ్ సానెపై పోలీసులు హత్య, సాక్ష్యాలను నాశనం చేసిన నేరాలపై కేసులు నమోదు చేశారు. అతడికి కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది.

సరస్వతి తోబుట్టువులు ఏం చెప్పారంటే..

మృతురాలు సరస్వతి వైద్య ముగ్గురు సోదరీమణులను కూడా పోలీసులు ప్రశ్నించారు. వారు చెప్పిందాన్ని బట్టి..మనోజ్ సానె, సరస్వతీ వైద్యది సహజీవనం కాదు..వారు భార్యాభర్తలు. ఇద్దరూ గుళ్లో పెళ్లి చేసుకున్నారు. అయితే, వయస్సు రీత్యా అంతరం ఎక్కువగా ఉండటంతో తన తోబుట్టువులకు మాత్రమే ఈ విషయం చెప్పారు. ఇతరులకు తెలియకుండా రహస్యంగా ఉంచారు. సరస్వతి, తోబుట్టువులు చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. తండ్రి వారిని వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో అనాథాశ్రమంలో పెరిగారు. 18 ఏళ్లు నిండాక సరస్వతి ముంబైకి వచ్చింది. సరస్వతికి సేల్స్‌పర్సన్ ఉద్యోగం ఇప్పించింది మనోజ్ సానెనే. ముంబై శివారు నయానగర్ ఏరియాలో ఓ అపార్టుమెంట్ ఫ్లాట్‌లో మనోజ్ సానె, సరస్వతి మూడేళ్లుగా ఉంటున్నారు. ఈ నెల 4న సరస్వతి చనిపోగా, ఆ ఫ్లాట్ నుంచి భరించలేని దుర్గంధం వస్తోందంటూ 7న చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి చూసేసరికి మహిళ శరీర భాగాలు కనిపించాయి. కొన్నిటిని కుక్కర్‌లో ఉడికించి, కొన్ని వేయించినట్లుగా పోలీసులు గుర్తించారు. మరికొన్ని శరీర భాగాలను మురుగు కాల్వలో పడేయగా, కొన్నిటిని వీధి కుక్కలకు ఆహారంగా వేసినట్లు తెలిసింది. ఈ భయానక ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపిన శ్రద్ధావాకర్ దారుణ హత్య కేసును గుర్తుకు తెచ్చింది.

పాఠ్యపుస్తకాల సలహాదారులుగా కొనసాగలేం

ఎన్సీఈఆర్‌టీకి సుహాస్ పల్షికర్, యోగేంద్ర యాదవ్ లేఖ

న్యూఢిల్లీ: నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎన్సీఈఆర్‌టీ) పాఠ్య పుస్తకాల సిలబస్‌లో కోతలపై ప్రధాన సలహాదారులుగా వ్యవహరిస్తున్న సుహాస్ పల్షికర్, యోగేంద్ర యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 9 నుంచి 12వ తరగతి వరకు పొలిటికల్ సైన్స్ పాఠ్య పుస్తకాల సిలబస్ నుంచి కొన్ని అంశాల తొలగింపు ఏకపక్షంగా, అహేతుకంగా ఉందని వారు పేర్కొన్నారు. హేతుబద్ధీకరణ అంటూ పాఠ్యాంశాలను వికృతీకరించి, వాటిని విద్యాపరంగా పనికిరానివిగా మార్చారని ఆరోపించారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, అభిప్రాయం తెలుసుకోకుండా ఎన్సీఈఆర్‌టీ తీసుకున్న ఈ చర్య ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. ఆయా పాఠ్యపుస్తకాల్లో ప్రధాన సలహాదారుల జాబితాలో ఉన్న తమ పేర్లను వెంటనే తొలగించాలని కోరుతూ ఎన్సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ సక్లానీకి లేఖ రాశారు. మహాత్మాగాంధీ మరణం దేశంలో మత సామరస్యతపై చూపిన సానుకూల ప్రభావం, ఆర్ఎస్ఎస్‌పై కొంతకాలం నిషేధం, 2002లో గుజరాత్ అల్లర్లు వంటి విషయాలను సిలబస్ నుంచి తొలగిస్తూ గత నెలలో ఎన్సీఈఆర్‌టీ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. 2006–07లో ముద్రించిన ఎన్సీఈఆర్‌టీ 9 నుంచి 12వ తరగతి పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకాలకు వీరిద్దరూ ప్రధాన సలహాదారులుగా ఉన్నారు. పల్షికర్, యోగేంద్ర యాదవ్ రాజనీతి శాస్త్ర నిపుణులు. కాగా, యోగేంద్ర యాదవ్ స్వరాజ్ ఇండియా అనే సంస్థను నడుపుతున్నారు.

విదేశాల్లోని భారతీయులకు ఓటు హక్కు!

ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ: విదేశాల్లో నివసించే భారతీయులకు సైతం మన దేశంలో జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కల్పించాల్సిన సమయం వచ్చిందని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ చెప్పారు. ఇందుకోసం ఈ–పోస్టల్ బ్యాలెట్ వంటి టెక్నాలజీ ఆధారిత ఆధునిక విధానాలను ఉపయోగించాలని అన్నారు. మన దేశ ఎన్నికల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని హర్షం వ్యక్తం చేశారు. రాజీవ్ కుమార్ శుక్రవారం నిర్వాచన్ సదన్‌లో 'భారత్–ప్రజాస్వామ్యాలకు మాతృమూర్తి, భారత ఎన్నికల సంఘం పాత్ర' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో 2022 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) అధికారుల(ట్రైనీలు)ను ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవలి కాలంలో స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ, ఫలితాలపై సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, కుట్రపూరిత ప్రచారం సాగుతున్నాయని అన్నారు. విదేశాల్లో ఉంటున్న భారతీయులకు ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్(ఈటీబీపీఎస్) ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం గతంలోనే ప్రతిపాదించింది. విదేశాల్లోని భారతీయుల్లో 1.15 లక్షల మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు అంచనా.

శవాలు భద్రపర్చిన బహనాగ పాఠశాల భవనం కూల్చివేత

భువనేశ్వర్: ఒడిశాలో 65 సంవత్సరాల చరిత్ర కలిగిన బహనాగ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం కూల్చివేత పనులను అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల బహనాగ బజార్ రైల్వేస్టేషన్ సమీపంలో ఘోర రైలు ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఆ దుర్ఘటనలో మరణించిన వారి మృతదేహాలను ఇదే పాఠశాలలో భద్రపర్చారు. తాత్కాలిక మార్చురీగా ఉపయోగించారు. శవాలను భద్రపర్చిన పాఠశాలలో తరగతులకు హాజరయ్యేందుకు విద్యార్థులు ఇష్టపడడం లేదని, అందుకే కూల్చివేయాలని నిర్ణయించినట్లు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తెలియజేసింది. అంతేకాకుండా ఈ స్కూల్ భవనం చాలా పాతదని, శిథిలావస్థకు చేరిందని అన్నారు. నేలమట్టం చేయాల్సిందేనని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా డిమాండ్ చేశారని వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంబంధిత అధికారులతో చర్చించారు. బహనాగ స్కూల్ భవనం కూల్చివేతకు అనుమతిచ్చారు. దీని స్థానంలో కొత్త భవనం నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆధునిక వసతులతో మోడ్రన్ స్కూల్‌గా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ నెల 2న జరిగిన రైలు ప్రమాదంలో 288 మంది ప్రయాణికులు మరణించిన సంగతి తెలిసిందే.

కోర్టు మార్షల్‌కు సమయం దగ్గరపడింది

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్



ఇస్లామాబాద్: సైనిక న్యాయస్థానంలో తనపై విచారణ జరిపేందుకు సమయం దగ్గరపడిందని పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. మే 9వ తేదీన ఇమ్రాన్ అరెస్టు సందర్భంగా జరిగిన అల్లర్లకు కుట్ర పన్నిన వారిని మిలటరీ కోర్టుల్లో విచారణ జరిపిస్తామంటూ ఆర్మీ ప్రకటించడం, ఆ హింసాత్మక ఘటనలకు సూత్రధారి ఇమ్రానే అంటూ గురువారం మంత్రి సనావుల్లా పేర్కొన్న నేపథ్యంలో ఇమ్రాన్ ఈ వ్యాఖ్య చేశారు. తనపై నమోదైన 10 కేసుల విచారణకు గాను గురువారం ఇస్లామాబాద్ హైకోర్టుకు హాజరైన ఇమ్రాన్..అనంతరం మీడియాతో మాట్లాడారు. 'మిలటరీ కోర్టులో పౌర విచారణ, చాలా అన్యాయం . ఇది దేశంలో ప్రజాస్వామ్యానికి, న్యాయానికి ముగింపు' అని ఆయన పేర్కొన్నారు. తనపై నమోదైన 150 కేసులు బోగస్‌వేనని తెలిపారు. పౌర న్యాయస్థానాల్లో ఇవి నిలవవు కాబట్టే కోర్టు మార్షల్‌కు నిర్ణయించారని ఆరోపించారు. మే 9 నాటి ఘటనలపై ఇప్పటికే మిలటరీ కోర్టుల్లో విచారణ మొదలైంది. ఇలా ఉండగా, ఇమ్రాన్ ఖాన్‌పై అసంతృప్తితో ఉన్న పాకిస్తాన్–తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ (పీటీఐ)కు చెందిన కొందరు నేతలు వేరుకుంపటి పెట్టుకున్నారు. బడా చక్కెర వ్యాపారి, ఇమ్రాన్ సన్నిహితుడిగా పేరున్న జహంగీర్ ఖాన్ తరీన్ నేతృత్వంలో గురువారం పీటీఐ నేతలు ఇస్తెహ్కామ్–ఇ–పాకిస్తాన్(ఐపీపీ) పేరుతో కొత్త పార్టీని ప్రకటించారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
శనివారం : 10 : జూన్ : 2023

శ్రీవారి సేవలో స్పీకర్

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం పుదుచ్చేరి స్పీకర్ ఆర్.సెల్వం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.



న్యూస్‌రీల్

కూడలూరు విద్యార్థినుల రికార్డు



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్

అన్నానగర్: రాష్ట్ర సిలంబం పోటీల్లో కూడలూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు తమ ప్రతిభ చాటారు. వీరిని శుక్రవారం కలెక్టర్ అభినందించారు. కోయంబత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి సిలంబం చాంపియన్‌షిప్ పోటీల్లో కూడలూరు సమీపంలోని ఓవేలి మున్సిపాలిటీ పరిధిలోని భారతీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పవిత్ర, దర్శిని, హర్ష అనుశ్రీ పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు పవిత్ర, హర్ష పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. దర్శినికి తృతీయ స్థానం లభించింది. పోటీల్లో అనుశ్రీ కూడా రెండు పతకాలు సాధించింది. పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థినులను, కోచ్‌లను కలెక్టర్ కార్యాలయానికి శుక్రవారం పిలిపించి కలెక్టర్ అమృత్ సత్కరించి అభినందించారు.

సవీత ఇంజినీరింగ్‌కు 64వ ర్యాంకు

సాక్షి, చెన్నై: నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్‌ఐఆర్‌ఎఫ్)లో సవీత ఇంజినీరింగ్ కళాశాలకు 64వ ర్యాంక్ దక్కినట్టు ఆ విద్యా సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 2023 సంవత్సరానికిగాను ర్యాంకింగ్‌ల జాబితా నిమిత్తం 8 వేలకు పైగా విద్యా సంస్థలు పోటీపడ్డాయని గుర్తు చేశారు. ఉన్నత విద్యారంగంలో అగ్రగామి సంస్థగా తన స్థానాన్ని మరో మారు పదిలం చేసుకున్నట్టు వివరించారు. విశ్వవిద్యాలయం సంపూర్ణ అభివృద్ధికి, మెరుగైన, నాణ్యమైన విద్యతో విద్యార్థులలో ప్రతిభను పెంపొందించడంలో, కొత్త ఆవిష్కరణలో తమ ఇంజినీరింగ్ కళాశాల ఎప్పుడూ ముందుంటోందని పేర్కొన్నారు. ఈ ర్యాంకింగ్‌తో మరింతగా శక్తివంతంగా విద్యాభ్యున్నతికి కృషిచేస్తామని వివరించారు.

బంగారుగుడికి వెండి ఆభరణం బహూకరణ



వెండి ఆభరణాన్ని చూపుతున్న పీఠాధిపతి శక్తిఅమ్మ

వేలూరు: వేలూరు శ్రీపురంలోని శ్రీ బంగారుగుడి పీఠాదిపతి శక్తిఅమ్మ ఆధ్వర్యంలో 1500 కిలోల స్వచ్ఛమైన బంగారంతో తయారు చేసిన బంగారుపలకలతో కూడిన బంగారుగుడిని 2007వ సంవత్సరంలో నిర్మించి కుంభాభిషేకం చేశారు. ఇక్కడ నిర్మించిన ఆలయం అమృత్‌సర్‌లోని బంగారుగుడి లోపలి విమానంలో ఉన్న 750 కిలోల బంగారం కంటే రెండు రెట్లు ఎక్కువ బంగారంతో తయారు చేశారు. ప్రస్తుతం వేలూరు బంగారుగుడిలో 1,700 కిలోల బరువుతో కూడిన వెండి శక్తి గణపతి విగ్రహం ఉంది. ఈ విగ్రహాన్ని ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా అతి పెద్ద విట్రస్ స్టోన్‌తో తయారు చేశారు. దీంతో ప్రస్తుతం 840 గ్రాముల బరువుతో కూడిన ఆభరణాన్ని శక్తిఅమ్మ ప్రత్యేక పూజలు, చేసి శక్తి గణపతికి సమర్పించారు.

బీజేపీలోకి మైత్రేయన్

- ఢిల్లీలో చేరిక



బీజేపీ నేతలతో మైత్రేయన్

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే బహిష్కృతనేత, రాజ్యసభ మాజీ సభ్యుడు మైత్రేయన్ బీజేపీ గూటికి చేరారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో బీజేపీ పెద్దలను కలిసి ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అన్నాడీఎంకే అధినేత్రి, దివంగత సీఎం, అమ్మ జయలలిత జీవించి ఉన్న కాలంలో పార్టీలో మైత్రేయన్ కీలకంగా ఉండే వారు. వైద్యుడైన ఆయన్ను ఆమె రాజ్యసభకు పంపించే వారు. ఆమె మరణంతో 2017లో ఆ పార్టీ నేత పన్నీరుసెల్వం ధర్మయుద్ధానికి మద్దతుగా మైత్రేయన్ నిలిచారు. ఆ తర్వాత పరిణామాలతో పళనిస్వామి పక్షాన నిలబడ్డారు. ఆయనతో కూడా వైర్యం పెంచుకోవడంతో పార్టీ నుంచి బహిష్కరించ బడ్డారు. ఆయన్న పార్టీ నుంచి అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి పళనిస్వామి శిబిరం తొలగించింది. దీంతో గత కొన్ని నెలలుగా రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉన్న ఆయన తాజాగా బీజేపీలో చేరారు. ఆయన్ను తమ పార్టీలోకి రావాలని బీజేపీ నేతలు ఆహ్వానించినట్టు సమాచారం. దీంతో ఆయన ఢిల్లీ వెళ్లి మరీ బీజేపీలో చేరారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కాలంలో ఢిల్లీలోని అన్ని పార్టీల నేతలతో మైత్రేయన్‌కు సన్నిహిత సంబంధాలు ఉండేవి. ప్రస్తుతం ఆయన బీజేపీలోకి చేరడంతో ఏదేని పదవి వరించేనా అనే ఎదురుచూపుల్లో మద్దతుదారులు ఉన్నారు.

డెల్టాలో స్టాలిన్ అధ్యయనం

- తిరుచ్చి, తంజావూరులలో విస్తృతంగా పర్యటన
- కావేరి తీరంలో పూడికతీత పనుల పరిశీలన
- పనుల వేగవంతానికి ఆదేశాలు
- పొలంబాట పట్టిన అన్నదాతలతో సంప్రదింపులు



కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: కావేరి నదీ తీరంలోని డెల్టా జిల్లాల్లో శుక్రవారం సీఎం ఎంకే స్టాలిన్ పర్యటించారు. తిరుచ్చి, తంజావూరులో ఆయన పర్యటన విస్తృతంగా జరిగింది. కావేరి తీరంలో పూడిక తీత పనులను సీఎం పరిశీలించారు. పనుల వేగవంతానికి ఆదేశించారు. పొలం బాట పట్టిన అన్నదాతలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డెల్టా జిల్లాల వర ప్రదాయిని మేట్టూరు జలాశయం నుంచి సాగు నిమిత్తం ఈనెల 12న నీటిని విడుదల చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. కావేరి నదీ తీరం, అనుబంధ కాలువలు, వాగులు, వంకలలో పూడికతీత పనులపై దృష్టి పెట్టింది. ఈ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సీఎం స్టాలిన్ నిర్ణయించారు. ఇందుకోసం గురువారం రాత్రి తిరుచ్చికి వెళ్లారు. శుక్రవారం ఉదయం మంత్రులు, అధికారులతో సమావేశమయ్యారు. కావేరి తీరంలో జరుగుతున్న పనులు, పూర్తి చేసిన పనుల వివరాలను లఘు చిత్రం ద్వారా సీఎంకు అధికారులు వివరించారు. 4773.13 కి.మీ దూరం పూడిక తీత పనులకు సంబంధించిన వివరాలను సీఎం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు.

వేగం పెంచండి..

కాలువలు, వాగులు, చెరువులు, నీటి పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న పనులు మరింత వేగవంతం చేయాలని అధికారులను ఈసందర్భంగా సీఎం ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాని విధంగా త్వరితగతిన పనులన్నీ ముగించాలన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో అధ్యయనానికి సీఎం బయలుదేరి వెళ్లారు. తంజావూరు జిల్లా అలకుడి, విన్నమంగళం వద్ద పనులను పరిశీలించారు. బూదరాయనల్లూర్, విన్నమంగళం, తిచ్చసముద్రం, వెంకటసముద్రం గ్రామాలకు చెందిన 450 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీటి సౌకర్యం కల్పించే విధంగా పూర్తి చేసిన పనులను చూశారు. అనంతరం తిరుచ్చి లాల్గుడి సర్కిల్, తిరుమంలం, కరియాపురం, వెల్లనూరు, నందియార్‌లలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆతర్వాత ఊట్టత్తూరు, నమ్ముకురిచ్చి, పెరువలపూర్, కనక్కలియానల్లూర్, కూడలూర్, వెల్లనూర్ గ్రామాలు వరద ముంపునకు గురి కాకుండా ముందు జాగ్రత్తలను పరిశీలించారు. మేట్టూరు జలాశయం నుంచి విడుదలయ్యే కావేరి జలాలు ఎలాంటి ఆటంకం లేకుండా గ్రామాల మీదుగా పంట పొలాల్ని తడిపే విధంగా అన్ని ఏర్పాట్లు సకాలంలో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

హక్కులను వదులుకోం

ఈ పర్యటనలో భాగంగా సీఎం ఎంకే స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ కావేరి డెల్టా వ్యవసాయ క్షేత్రంలో ఎలాంటి పరిశ్రమలు, బొగ్గు తవ్వకాలకు అనుమతి లేదని సీఎం స్పష్టం చేశారు. తమ హక్కులను ఈ వ్యవహారంలో వదులుకునే ప్రసక్తే లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 2021–22లో రూ. 62 కోట్లతో సకాలంలో పూడిక తీత పనులుముగించడం ద్వారా నిర్ణీత జూన్ 12వ తేదీ మేట్టూరు నుంచి నీటిని విడుదల చేశామని గుర్తు చేశారు. ఇందుకు ఫలితంగా 4.90 లక్షల ఎకరాల కురువై, 13 లక్షల ఎకరాలలో సంబా సాగు జరిగిందని, 39 లక్షల టన్నుల వరి దిగుబడి సాధించామని వివరించారు. గత ఏడాది 5.36 లక్షల ఎకరాల్లో కురువై, 13.54 లక్షల ఎకరాల్లో సంబా సాగు చేసి 41 లక్షల టన్నుల వరి దిగుబడి సాధించామన్నారు.ఈ ఏడాది ఈ రికార్డులను బద్దలు కొట్టే విధంగా పనులు పూర్తి చేశామన్నారు. అనంతరం మీడియా ప్రశ్నలకు సమాధానం ఇస్తూ, మేఘదాతులో డ్యాంను అడ్డుకుని తీరుతామన్నారు. గవర్నర్ చర్యలను నిశితంగా పరిశీలిస్తున్నామని, అవసరం అయితే, తాము కూడా న్యాయ పోరాటానికి సిద్ధమయ్యే పరిశీలనలో ఉన్నామన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసే వర్సిటీ లేదా, చెన్నై వర్సిటీకి కలైంజ్ఞర్ కరుణానిధి పేరు పెట్టేందుకు పరిశీలిస్తున్నామని తెలిపారు.

రైతులు, కూలీలతో సంప్రదింపు..

క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా సీఎం స్టాలిన్ పలుచోట్ల పొలం పనుల్లో ఉన్న రైతులను కలిశారు. వారి సమస్యలను విన్నారు. వరద ముంపు ఎదురు కాకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సీఎంకు రైతులు సూచించారు. అలాగే, ఉపాధి పథకం కింద పనిచేస్తున్న కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. అన్నదాతలు, రైతుల కూలీలు ఈసందర్భంగా తమ విజ్ఞప్తులను సీఎంకు అందజేశారు. రైతు కూలీల ఎక్కువ శాతం మంది సాయంత్రం వెళుతుండడంతో బస్సుల సేవలు మరింతగా మెరుగు పరచాలని కోరడంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. ఈ పర్యటనలో మంత్రులు దురై మురుగన్, కేఎన్ నెహ్రూ, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, అన్బిల్ మహేశ్, ఎంపీ రామలింగం, ఎమ్మెల్యేలు దురై చంద్రశేఖరన్, సౌందర పాండియన్, త్యాగరాజన్, స్టాలిన్‌కుమార్, జవహరుల్లా, ఐఏఎస్ అధికారులు సందీప్ సక్సేనా, తంజావూరు, తిరుచ్చి జిల్లాల కలెక్టర్లు అధికారులు ఉన్నారు.



అమిత్ షా పర్యటనలో మార్పు

- నేడు చెన్నైకు రాక

సాక్షి, చెన్నై: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఒక రోజు ముందుగా శనివారమే చెన్నైకు రానున్నారు. లోక్‌సభ ఎన్నికలకు తమిళనాడులోని బీజేపీ నేతలను సమాయత్తం చేస్తూ, పార్టీ వర్గాలతో సమావేశాలు, బహిరంగసభలపై అమిత్‌షా దృష్టి పెట్టారు. ఈ మేరకు ఈనెల 11వ తేదీ వేలూరులో జరిగే సభకు ఆయన హాజరుకానున్నారు. ఆ రోజు ఉదయం చెన్నైకు ఆయన వస్తారని తొలుత సమాచారం వెలువడింది. అయితే, ఒకరోజు ముందుగా శనివారం చెన్నైకు రానున్నారు. చెన్నైకు చేరుకుని ఆయన గిండిలోని ఓ హోటల్‌లో పార్టీ వర్గాలతో సమావేశం కానున్నారు. అలాగే, కోవిలంబాక్కంలో జరిగే బీజేపీ రాష్ట్ర కమిటీ, లోక్‌సభ ఇన్‌చార్జ్‌లతో సమావేశానికి హాజరు కాబోతున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి అమిత్‌షాతో భేటీకి అనుమతి కోరినట్టు తెలిసింది. అలాగే మాజీ సీఎం పన్నీరుసెల్వం సైతం ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే, పళనిస్వామికి అమిత్‌షా ప్రసన్నం దక్కే అవకాశాలు అధికంగా ఉన్నాయి. మరుసటి రోజు ఆదివారం మధ్యాహ్నం చెన్నై నుంచి వేలూరుకు అమిత్‌షా వెళ్లనున్నారు. అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు.

ఖాతాదారుల కోసం ఔట్రీచ్

సాక్షి, చెన్నై: చెన్నైలోని తమ ఖాతాదారుల బ్యాంక్ సేవలను సులభతరం చేయడం కోసం ఔట్రీచ్ కార్యక్రమాన్ని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ప్రారంభించింది. స్థానికంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశీష్ పాండే మాట్లాడుతూ తమిళనాడు, పుదుచ్చేరిలలోని ఖాతాదారులతో బలమైన సంబంధాలను కలిగి ఉండడం, ప్రోత్సహించడంలో తమ బ్యాంక్ అంకితభావంతో పనిచేస్తున్నట్టు వివరించారు. అన్ని రకాల బ్యాంకింగ్ అవసరాలను, సేవలను ఒకే వేదికపై తెచ్చే విధంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 2022–23లో అడ్వాన్స్‌డ్ గ్రోత్ 29.49 శాతం పెరగడంతో పాటు సీఏఎస్ఏ డిపాజిట్లు 53.38 శాతంతో దూసుకెళ్తోందన్నారు. ఈ సంవత్సరంలో బాటమ్ లైన్ 126 శాతం వృద్ధి చెంది రూ.2,602 కోట్లకు చేరుకుంటుందని వివరించారు. బ్యాంక్ అధికారులు అరుణ్ కబడే, నాగేంద్ర గౌడ్, పీఎస్ శేషేశ్వర రావు, ఖాతాదారులు హాజరయ్యారు. ఈసందర్భంగా పలు బ్యాంక్ సేవలకు తక్షణం అనుమతులు మంజూరు చేశారు.

రూ.100 కోట్లతో పది చెరువుల అభివృద్ధి



విల్లివాక్కం లేక్

- పర్యాటకంగా సుందరీకరణ

సాక్షి, చెన్నై: చెన్నై నగరం, శివార్లలోని పది చెరువులను అభివృద్ధి పరచడంతో పాటు పర్యాటకంగా సుందరీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం రూ.100 కోట్లను కేటాయించింది. చెన్నై నగర, శివార్లలో 320 చెరువులు ఉన్నట్టు ప్రభుత్వ గణాంకాలు పేర్కొంటున్నాయి. ఇందులో అనేకం అన్యాక్రాంతమయ్యాయి. ప్రస్తుతం ఉన్న చెరువులను పరిరక్షించుకునేందుకు తీవ్ర కుస్తీలను అధికారులు పడుతున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం నగర శివార్లలో ఉన్న 10 చెరువులను ప్రస్తుతం ఎంపిక చేశారు. వీటిని అభివృద్ధి చేయడమే కాకుండా, సుందరీకరించి పర్యాటకంగా ప్రజలను ఆకర్షించేందుకు సిద్ధమయ్యారు. చెన్నై మెట్రోవాటర్ బోర్డు, సీఎండీఏ సంయుక్తంగా ఈ పనులపై దృష్టిపెట్టాయి. ఈ పనుల కోసం పెరుంబాక్కం, రెట్టేరి, ముడిచ్చూరు, మాడంబాక్కం, సెంబాక్కం, అయనంబాక్కం, వేళచ్చేరి, ఆదంబాక్కం, పుళల్, కొరట్టూరు చెరువులను ఎంపిక చేశారు. ఈ చెరువుల అభివృద్ధి, పర్యవేక్షణ పనులకు ప్రత్యేక కమిటీలను ఎంపిక చేయనున్నారు. ఒక్కో చెరువుకు రూ.10 కోట్ల చొప్పున 100 కోట్లను కేటాయించారు. ఈ పనులు జల వనరుల పరిరక్షణతో పాటు, పర్యావరణపరంగా పరిసరాలను తీర్చిదిద్దడం, ఆధునిక హంగులతో పర్యాటకంగా ప్రజలను ఆకర్షించే పనులు త్వరలో ప్రారంభం కాబోతున్నాయి.

బ్యానర్లు పెడితే మూడేళ్ల జైలు శిక్ష

సాక్షి, చెన్నై: అనుమతి లేకుండా బ్యానర్లు, ఫ్లెక్సీలు పెడితే మూడేళ్ల జైలు శిక్ష తప్పదని నగరాభివృద్ధిశాఖ కార్యదర్శి దివ్యదాస్ మీనా హెచ్చరించారు. రాష్ట్రంలో మళ్లీ బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల సంస్కృతి పెరుగుతున్న విషయం తెలిసిందే. వీటి ఏర్పాటుకు నగర పాలక, స్థానిక సంస్థల అనుమతి తప్పనిసరిగా నిబంధనలు అమల్లోకి తెచ్చారు. అలాగే, నిర్ణీత సమయంలోపు వాటిని తొలగించాలన్న ఆదేశాలు ఉన్నాయి. అయితే, అనుమతులు లేకుండా మళ్లీ బ్యానర్లు పుట్టకొస్తుండడం, కోయంబత్తూరులో రెండు రోజుల క్రితం జరిగిన ఫ్లెక్సీ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మరణించడం వంటి ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. శుక్రవారం నగరాభివృద్ధి శాఖ కార్యదర్శి దివ్యదాస్ మీనా తీవ్ర హెచ్చరికలతో ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా, ఎంపిక చేసిన ప్రదేశాలలో కాకుండా ఎక్కడబడితే అక్కడ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే మూడేళ్ల జైలుశిక్ష తప్పదని, ఇందుకు సంబంధించిన చట్ట సవరణలు జరిగినట్టు హెచ్చరించారు. దీంతో మదురై, కోయంబత్తూరులో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. మదురైలో 50 మందిపై కేసు పెట్టడం గమనార్హం.

కమిషనర్‌కు వినతుల వెల్లువ

- సమస్యల్ని విన్నవించుకున్న 370 మంది సిబ్బంది
- గర్భిణులు, చంటి పిల్లలతో సిబ్బంది రాక



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ శంకర్ జివ్వాల్

సాక్షి, చెన్నై: చెన్నై పోలీసు కమిషనర్ శంకర్‌జివ్వాల్‌ను స్థానికంగా పనిచేసే పోలీసులు తమ సమస్యలను శుక్రవారం ఏకరువు పెట్టారు. గర్భిణులు, చంటి బిడ్డలతో మహిళా సిబ్బంది కమిషనర్ ఎదుట హాజరై తమ ఆవేదనను వెళ్లగక్కారు. విధుల్లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా చెన్నై పోలీసు కమిషనర్ శంకర్ జివ్వాల్ శుక్రవారం రాజరత్నం స్టేడియం వేదికగా శిబిరం ఏర్పాటు చేశారు. ఏదో పదుల సంఖ్యలో సిబ్బంది వచ్చి తమ సమస్యలు చెబుతారని భావించిన కమిషనర్‌కు షాక్ తప్పలేదు. ఏకంగా 370 మంది సిబ్బంది తమ సమస్యలను ఏకరువు పెట్టేందుకు వచ్చేశారు. వీరందర్నీ కూర్చోబెట్టి మరీ కమిషనర్ సమస్యలను విన్నారు. ముందుగా సత్య అనే మహిళా కానిస్టేబుల్ తన ఐదు నెలల చంటి బిడ్డతో పాటు కమిషనర్‌కు సెల్యూట్ చేసి మరీ తన ఆవేదనను వినిపించింది. పుదుపేట సాయిధ బలగాల విభాగంలో పనిచేస్తున్న తనకు ఆవడిలో పోస్టింగ్ ఇస్తే, బిడ్డను చూసుకునేందుకు సమయం దొరుకుతుందని విజ్ఞప్తి పెట్టుకున్నారు. లోకనాయకీ అనే మరో మహిళా కానిస్టేబుల్ సైతం తన నాలుగేళ్ల కుమారుడు, పది నెలల చంటి బిడ్డతో వచ్చి మరీ తనను ట్రాఫిక్‌కు బదిలీ చేయాలని విన్నవించుకున్నారు. తాను సాయుధ బలగాల విభాగంలో ఉన్న దృష్ట్యా, బిడ్డకు వెళ్లి పాలు కూడా ఇవ్వలేని పరిస్థితులో ఉన్నట్టు ఉద్వేగానికి లోనయ్యారు. కనిమొళి అనే మరో సిబ్బంది తన చంటి బిడ్డను కింద కూర్చోబెట్టి మరీ కమిషనర్‌కు తన సమస్యలను ఏకరువు పెట్టారు. ఇలా ఎందరో సిబ్బంది బదిలీల కోసం, తాము పడుతున్న సమస్యలను కమిషనర్‌కు వివరించారు. చివరగా రాజకీయనాయకుడి తరహాలో తెల్లచొక్కా..తెల్ల పంచెతో ఓ సిబ్బంది కమిషనర్ ముందుకు వచ్చాడు. ఇతడు తమ సిబ్బందేనా అని కమిషనర్ పరిశీలించాల్సి వచ్చింది. తన పేరు మణియరసన్ అని గత ఏడాది ప్రమాదం కారణంగా ఓ కాలులో ప్లేట్ ఉంచారని, మరో సర్జరీ కూడా చేయాల్సి ఉందని, తనకు ఆర్థిక సాయం అందేలా సహకరించాలని కమిషనర్‌ను కోరాడు. పుదుపేటలో పనిచేస్తున్న కానిస్టేబుల్, హిజ్రా దీపిక పేర్కొంటూ తనకు వచ్చే జీతంలో చెన్నైలో అద్దె చెల్లించలేకున్నానని, ఎక్కడో ఓ చోట క్వార్టర్స్‌లో గృహాన్ని కేటాయించాలని కమిషనర్‌ను కోరారు. అందరి విజ్ఞప్తులను విన్న కమిషనర్ సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధానంగా మహిళా సిబ్బంది పెట్టుకున్న విజ్ఞప్తులపై తక్షణం స్పందించారు.

నైరుతి ఆశలు

- ముందు జాగ్రత్తలపై దృష్టి
- ఆశాజనకంగా పవనాల కదలిక
- అధికారులతో సీఎస్ భేటీ



అధికారులతో సమావేశమైన సీఎస్ ఇరైఅన్బు

సాక్షి, చెన్నై: నైరుతి రుతుపవనాలు గురువారం కేరళ తీరాన్ని తాకడంతో సరిహద్దుల్లో తమిళనాడుకు చెందిన పశ్చిమకనుమల్లో వాతావరణం మారింది. ఇక్కడి జిల్లాల్లో తేలిక పాటి వర్షం శుక్రవారం మొదలైంది. ఈ ఏడాది నైరుతి రూపంలో ఆశాజనకంగానే వర్షాలు పడే అవకాశంతో ముందు జాగ్రత్తలపై సీఎస్ ఇరైఅన్బు దృష్టి పెట్టారు. రాష్ట్రంలో ప్రతి ఏటా నైరుతి రుతుపవనాల ప్రభావం అంతంత మాత్రమే. అయితే, కేరళ, కర్ణాటకల్లో ఈ పవనాల రూపంలో వర్షాలు పడితే తమిళనాడులోని అన్నదాతలకు ఆనందమే. కేరళ నుంచి ముల్లెపైరియార్ , వైగై, భవానీ సాగర్ జలాశయాలకు నీటి రాక పెరుగుతుంది. కర్ణాటకలో వర్షాలు పడితే, కావేరి పరవళ్లు తొక్కినట్టే. అదే సమయంలో ఈ ఏడాది భానుడి ప్రతాపం మరీ ఎక్కువగానే రాష్ట్రంలో ఎదుర్కొవాల్సి వచ్చింది. ఈ దృష్ట్యా జలవనరులలో ప్రస్తుతం నీటి శాతం కూడా తగ్గింది. దీంతో నైరుతిపై ఆశలు మొదలయ్యాయి. సమృద్ధిగా ఈ సారైనా వర్షాలు పడాలన్న ఎదురు చూపులు పెరిగాయి. ఇందుకు అనుగుణంగానే సమాచారాలు వెలువడింది.

సమృద్ధిగానే వర్షాలు..

నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకడంతో తమిళనాడు – కేరళ సరిహద్దుల్లోని కన్యాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, తేని, కోయంబత్తూరు, నీలగిరి, ఈరోడ్ జిల్లాల్లో వర్షాలు ఆశాజనకంగా పడే అవకాశాలు ఎక్కువగానే ఉన్నట్టు వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ జిల్లాలలో శుక్రవారం నుంచి చెదురుమదురుగా వర్షాలు పడుతున్నాయి. అలాగే, పశ్చిమ కనుమలలోని కోయంబత్తూరు, ఈరోడ్, నీలగిరి జిల్లాల్లోనూ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. పశ్చిమకనుమల్లో వాతావరణం పూర్తిగా మారింది. అలాగే, ఉత్తర తమిళనాడులోని వేలూరు, చెన్నై శివార్లలో అక్కడక్కడ వర్షాలు పడ్డాయి.

అధికారులతో సీఎస్ సమీక్ష..

నైరుతి ప్రవేశంతో చేపట్టాల్సిన ముందు జాగ్రత్తలపై సచివాలయంలో శుక్రవారం సీఎస్ ఇరైఅన్బు అధికారులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రభావం రాష్ట్రంలో ఆశాజనకంగా ఉండే అవకాశాలు ఉన్నట్టు వెలువడిన సమాచారంతో అందుకు అనుగుణంగా ఆయా జిల్లాల్లో ముందు జాగ్రత్తగా పనులు విస్తృతం చేయాలని ఆదేశించారు. ఈ పవనాల ప్రభావం అధికంగా ఉండే జిల్లాల కలెక్టర్లు, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని స్థానికంగా చేపట్టాల్సిన పనులను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజలు వర్షాలతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ముందు జాగ్రత్తలు విస్తృతంగా జరగాలని పేర్కొన్నారు.

2 వేల కొత్త బస్సులు

బైక్ ట్యాక్సీకి అనుమతి లేదు • మంత్రి శివశంకర్



రవాణా సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రులు సెంథిల్ బాలాజీ, శివశంకర్

సాక్షి, చెన్నై: త్వరలో రెండు వేల కొత్త బస్సులు రవాణా సంస్థలోకి రానున్నాయని ఆ శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. రాష్ట్రంలో బైక్ ట్యాక్సీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కోయంబత్తూరులో మంత్రి సెంథిల్ బాలాజీతో కలిసి రవాణా సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శివశంకర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నాడీఎంకే హయాంలో రవాణా సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండి పడ్డారు. సిబ్బంది వేతన విధానాన్ని అధ్వానంగా మార్చేశారని, ప్రస్తుతం తాము వాటన్నింటిని క్రమబద్ధీకరిస్తూ వస్తున్నామన్నారు. అందుకే బస్సుల కొనుగోలులో జాప్యం తప్పలేదు. అలాగే, సిబ్బంది నియామకంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఐదేళ్లుగా కండక్టర్లు, డ్రైవర్ల నియామకం జరగకపోవడంతో, ప్రస్తుతం తమ ప్రభుత్వం ఆ పనులను వేగవంతం చేయడానికి నిర్ణయించిందన్నారు. తొలి విడతగా కుంభకోణం రవాణా జోన్‌ను అభివృద్ధిపరచడమే కాకుండా, సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో 2 వేల కొత్త బస్సుల కొనుగోలుకు సీఎం స్టాలిన్ నిధులను కేటాయించారని, అలాగే, జర్మన్ బ్యాంక్ సహకారంతో మరో 2400 బస్సులు కొనుగోలు చేయబోతున్నామన్నారు. మరో ఆరు నెలల్లో రెండు వేల బస్సులు రోడ్డెక్కబోతున్నాయని తెలిపారు. బైక్ ట్యాక్సీ ప్రైవేటు వ్యక్తులకు సంబంధించినట్టు ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అయితే, రాష్ట్రంలో బైక్ ట్యాక్సీలకు ఎలాంటి అనుమతి లేదని, విధి విధానాలు కూడా రూపొందించలేదని మంత్రి స్పష్టంచేశారు.

క్లుప్తంగా

పళ్లిపట్టులో జమాబందీ పూర్తి



జమాబందీ అధికారి రవికి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

పళ్లిపట్టు: పళ్లిపట్టు తాలూకా కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన జమాబందీ శుక్రవారం ముగిసింది. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూశాఖ సమస్యలు పరిష్కరించే విధంగా పళ్లిపట్టు తాలూకా కార్యాలయంలో మంగళవారం నుంచి జమాబందీ చేపట్టారు. పళ్లిపట్టు, పొదటూరుపేట రెవెన్యూ సబ్ డివిజన్లకు సంబంధించిన ప్రజలు పట్టాలు, పట్టా డివిజన్, ఉచిత ఇంటి పట్టాలు కోరుతూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. జమాబందీ అధికారి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో తహసీల్దారు అరుణ్ కుమార్ సహా వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అర్హులైన వారికి వెను వెంటనే ప్రభుత్వ సహాయకాలు అందేందుకు, సర్టిఫికెట్లతో పాటు సహాయకాలు అందజేశారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

అన్నానగర్: దిండుగల్ సహకార సంఘం కార్యాలయం వద్ద గురువారం పారిశుధ్య కార్మికులు ధర్నాకు దిగారు. దిండుగల్ ఆర్తీ థియేటర్ రోడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ సొసైటీ పనిచేస్తోంది. ఇక్కడ 100 మందికి పైగా సభ్యులు కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం 30 మందికి పైగా కార్మికులు సంఘం కార్యాలయం ఆవరణలో బైఠాయించి ధర్నాకు దిగారు. అప్పట్లో కోఆపరేటివ్ సొసైటీ ద్వారా తమకు వచ్చిన రుణానికి నెలవారీ వాయిదాలను సక్రమంగా చెల్లిస్తున్నామని, సహకార సంఘంలో రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు డిపాజిట్ కూడా చెల్లించామని పేర్కొన్నారు. రుణ వాయిదాలు పూర్తిగా చెల్లించినా, అసోసియేషన్ అధికారులు ఖాతాను మూసివేయడానికి నిరాకరిస్తున్నారని ఆరోపించారు. అలాగే వారు తమకు 5 సంవత్సరాల పాటు డిపాజిట్, సేవింగ్స్ ఫండ్‌పై వడ్డీని ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్టు పేర్కొన్నారు. రుణ ఖాతా క్లోజ్ చేసి డిపాజిట్, సేవింగ్స్ ఫండ్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులపక్షాన కొందరు సంఘం అధికారులతో చర్చలు జరిపారు. ఒప్పందం కుదరడంతో ఆందోళన విరమించారు.

సిమెంట్ రోడ్డు పనులు వేగవంతం

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ మాడ వీధుల్లో సిమెంట్ రోడ్డు పనులను వేగవంతం చేసి నాణ్యతగా పూర్తిచేయాలని మంత్రి ఏవా వేలు అన్నారు. మంత్రి గత ఎన్నికల ప్రచార సమయంలో ఆలయ మాడ వీధులకు సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీంతో రెండు నెలల క్రితం శంకుస్థాపన పనులను ప్రారంభించి రూ.15 కోట్ల నిధులు కేటాయించారు. దీంతో ప్రస్తుతం ఉన్న తారు రోడ్డును తొలగించి పూర్తిగా సిమెంట్ రోడ్డు వేసేందుకు పనులు జరుగుతున్నాయి. దీంతో శుక్రవారం ఉదయం కలెక్టర్ మురుగేష్ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మంత్రి తనఖీ చేశారు. మంత్రి విలేకరులతో మాట్లాడుతూ అరుణాచలేశ్వరాలయానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో ఆలయం చుట్టూ ఉన్న మాడ వీధులకు పూర్తిగా సిమెంట్ రోడ్డుతో పాటు డ్రైనేజీ కాలువలను రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పనులను



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఏవావేలు

వేగవంతం చేసి మరో రెండు నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించారని తెలిపారు. పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా గిరివలయం రోడ్డులోనూ భక్తులకు అవసరమైన అన్ని వసతులు సిద్ధం చేస్తామని మంత్రి చెప్పారు. అనంతరం పనుల నాణ్యతను పరిశీలించారు. ఆయనతో పాటు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, అన్నామలైయార్ ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీధరన్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

వేలూరులో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు



ఆస్పత్రిలో రోగుల వద్ద వసతులపై విచారిస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు: వేలూరులో నూతనంగా ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ కదిర్ ఆనంద్ తెలిపారు. ఎంపీ శుక్రవారం ఉదయం వేలూరు పెంట్‌ల్యాండ్ ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని ఈఎస్ఐ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులు చికిత్స పొందుతున్న వార్డు, మందులు అందజేస్తున్న ప్రాంతం, వంట గదులనులాయన పరిశీలించారు. వసతుల గురించి అక్కడి రోగులను అయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు ఆస్పత్రిలో పలు సదుపాయాలు అవసరం ఉందని వారు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేలూరులోని ముఖ్యమైన ఆస్పత్రిగా ఈఎస్ఐ కార్మికుల కోసం ప్రత్యేకంగా నడుస్తోందన్నారు. ఈ ఆస్పత్రి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. అవసరమైన మందుల కొనుగోలు, వసతులపై ప్రత్యేక కమిటీని నియమించినట్టు ఆయన వెల్లడించారు. ఈ కమిటీలో చైర్మన్‌గా ఎంపీ, సభ్యులుగా డాక్టర్లు ఉంటారని ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు. ఆస్పత్రిలో చేపట్టే పనులకు కమిటీ అంగీకారం తెలపాల్సి ఉంటుందని వివరించారు.

ఆర్కేపేటలో గాలీవాన బీభత్సం

పళ్లిపట్టు: ఆర్కేపేటలో గాలీవాన బీభత్సం సృష్టించింది. శుక్రవారం 40 నిమిషాల పాటు కురిసిన వర్షంతో ఉష్ణోగ్రతలు చల్లబడ్డాయి. వేసవి అగ్నిన క్షత్రం ముగిసినా పళ్లిపట్టులో ఎండల తీవ్రత విపరీతంగా వుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు తీవ్రంగాను రాత్రి సమయాల్లో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా గాలీవాన బీభత్సం సృష్టించి 40 నిమిషాల పాటు జోరువాన కుమ్మరించింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కార్మికుడి అవయవాల దానం

- నలుగురికి పునర్జన్మ



జయప్రకాష్ (ఫైల్)

కొరుక్కుపేట: బ్రెయిన్ డెడ్ అయిన కార్మికుడి అవయవాల దానంతో నలుగురికి పునర్జన్మ లభించింది. సేలం నరసోదిపట్టి పెరుమాళ్ ఆలయ ప్రాంతానికి చెందిన జయప్రకాష్ (52) కార్మికుడు. అతనికి భార్య సుమతి, కొడుకు, కూతురు ఉన్నారు. జయప్రకాష్ ఈ నెల 5వ తేదీన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ప్రమాదం జరిగింది. జయప్రకాష్ తీవ్రంగా గాయపడి సేలం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. అతడి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. సేలం ప్రభుత్వ ఆసుపత్రిలో జయప్రకాష్ కాలేయం, కిడ్నీ, రెండు కళ్లను దానం చేశారు. చెన్నై అపోలో ఆసుపత్రికి కాలేయాన్ని దానం చేయనున్నారు. మరొక కాలేయాన్ని కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి, రెండు కళ్లను సేలం ప్రభుత్వాసుపత్రికి అప్పగించారు. ఇలా పొందిన అవయవాల ద్వారా నలుగురికి పునర్జన్మ లభించింది.

యువ క్రీడాకారులకు ప్రోత్సాహం



కొత్త జెర్సీని ధరించిన క్రీడాకారులతో పద్మ

కొరుక్కుపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను చాటుకుంటున్న యువ క్రికెట్ క్రీడాకారులకు ప్రోత్సహిస్తామని సీచెమ్ మదురై పాంథర్స్ యజమాని పద్మా దామోదరన్ తెలిపారు. తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్) క్రికెట్ సీజన్ ప్రారంభం కానున్న సందర్భంగా తమిళనాడు ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఫ్రాంచైజీ సీచెమ్ మదురై పాంథర్స్ టీమ్ కొత్త జెర్సీని ఆవిష్కరించింది. శుక్రవారం చెన్నైలో జరిగిన ఈ కార్యక్రమానికి పాండిచ్చేరి క్రికెట్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, బీసీసీఐ సభ్యుడు పి.దామోదర్ పాల్గొని రాబోయే సీజన్‌లో మదురై పాంథర్స్ సరికొత్త జెర్సీని అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీచెమ్ మదురై పాంథర్స్ సీఓఓ మాట్లాడుతూ మహేష్ మాట్లాడుతూ రాబోయే సీజన్‌లో తమ సరికొత్త జెర్సీని అధికారికంగా లాంచ్ చేయడం సీచెమ్ మదురై పాంథర్స్ చాలా సంతోషిస్తున్నామని తెలిపారు. జట్టు జెర్సీ ఆధునిక డిజైన్‌ను గొప్ప రంగుతో మిళితం చేసి, జట్టు నిబద్ధతను ప్రతిబింబించేలా రూపొందించినట్టు వివరించారు. రానున్న టీఎన్‌పీఎల్ సీజన్లో తమ జట్టు విజయకేతనం ఎగురవేస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. లియో కాఫీ బ్రాండ్ తమ జట్టుకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తోందని తెలిపారు. జట్టు యజమాని పద్మ మాట్లాడుతూ రాష్ట్రాన్ని యువ క్రీడాకారులకు ప్రోత్సహించే విధంగా ముందుకెళుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో లియో కాఫీ ఎండీ వేణు శ్రీనివాసన్, మదురై పాంథర్స్ సీఈఓ పూజ, ఎంవైఎఫ్ ఏబి 11 వ్యవస్థాపకులు స్వాతి చామోలి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ధన్వంతరి పీఠంలో మహాకుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

వేలూరు: రాణిపేట జిల్లా వాలాజాలో మూలవర్ ఆరోగ్యలక్ష్మి సమేత ధన్వంతరి పెరుమాళ్ 90 పరిహారాల దైవాలతో పీఠంలో కొలువై ఉన్నారు. పీఠంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పరిహార దైవాలకు పీఠాధిపతి మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు పుష్పాలంకరణ పూజలు చేస్తున్నారు. వీటితో పాటు ప్రతిరోజూ లోక క్షేమం కోరుతూ ప్రత్యేక హోమ పూజలు చేసి ప్రార్థనలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం శ్రీముకాంబికై దేవితో పాటు రాజకాళి అమ్మన్ఆలయం, వీరభద్రరావు ఆలయ మహాకుంభాభిషేక వైభవం అంగరంగ వైభవంగా జరిగింది. పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ ఎం బాలం ఆర్ సెల్వం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ పీఠాలకు చెందిన పీఠాధిపతులు ప్రత్యేక వేద మంత్రాలు చదివి కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పుణ్య నదుల నుంచి తీసుకొచ్చిన కలశ నీటిని భక్తులపై చల్లారు.



విశేష అలంకరణలో స్వామివారు

లవ్ యూ బంగారం



భర్తతో, పిల్లలతో నయనతార

తమిళసినిమా: లేడీ సూపర్‌స్టార్ నయనతార, దర్శకుడు విఘ్నేష్ శివన్ దంపతుల గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. అయితే శుక్రవారం వారి జీవితంలో ఒక ప్రత్యేకత ఉంది. అవును గత ఏడాది జూన్ 9వ తేదీన ఈ సంచలన జంటకు ఒక పరమార్థం ఏర్పడింది. అదే వివాహ బంధం. దక్షిణాది లేడీ సూపర్‌స్టార్‌గా వెలుగొందుతున్న నయనతార, దర్శకుడు విఘ్నేష్ శివన్ ఆరేళ్ల ప్రేమించుకుని గత ఏడాది పెళ్లి చేసుకున్నారు. నానుమ్ రౌడీదాన్ చిత్ర షూటింగ్‌లో వీరి మధ్య ఏర్పడిన స్నేహం, ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది. కాగా ఇప్పుడు వీరి వివాహ బంధం ఒక వసంతాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు అందించారు. కాగా దర్శకుడు విఘ్నేష్ శివన్ తమ పెళ్లిరోజును పురస్కరించుకుని సామాజిక మాధ్యమాల్లో ఒక ట్వీట్ చేశారు. అందులో నయనతారను ఉద్దేశించి కోరుకుంటూ ఐ లవ్ యూ బంగారం నిన్ననే మన పెళ్లి అయినట్లు ఉంది. అందరి ఆశీస్సులతో, ఆదరణతో మన దాంపత్య జీవితాన్ని ప్రారంభించాం. ఇలా ఇంకా చాలా దూరం పయనించాల్సి ఉంది. అందరి ఆశీస్సులతో రెండవ వసంతంలోకి ఉయిర్, ఉలగస్ (తమ కవల పిల్లలు)లతో కలిసి అని పేర్కొన్నారు. కాగా నయనతార, విఘ్నేష్ శివన్ తమ కవల పిల్లలతో తమ తొలి పెళ్లిరోజును ఘనంగా జరుపుకున్నారు.

మరో హాలీవుడ్ చిత్రం ది ఫ్లాష్



ది ఫ్లాష్ చిత్రంలో ఓ సన్నివేశం

తమిళసినిమా: సూపర్ హీరో కథలతో రూపొందిన చిత్రాలు ఆబాల గోపాలాన్ని అలరిస్తుంటాయి. ఇక అలాంటి కథలతో రూపొందిన హాలీవుడ్ చిత్రాలు అంటే ప్రేక్షకులు అబ్బురపడతారు. తాజాగా అలాంటి కథతో వస్తున్న చిత్రం ది ఫ్లాష్ డీసీ కామిక్స్ పాత్రల ఆధారంగా దర్శకుడు ఆండ్రెస్ ముషియట్టి తెరకెక్కించిన ఇందులో ఎజ మిల్లర్, మైఖేల్ కిటన్ సాషా కెల్లీ ప్రధాన పాత్రలు పోషించారు. వార్నర్ బ్రదర్స్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ భారీ బడ్జెట్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఈనెల 16న విడుదల కానుంది. అయితే ఇండియాలో మాత్రం ఒకరోజు ముందుగా అంటే జూన్ 15న తెరపైకి రానుంది. చిత్రంలో అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్రేకాలు, వినోద భరిత సన్నివేశాలు అంటూ జనరంజకమైన అంశాలు చోటు చేసుకుంటాయని చిత్ర నిర్వాహకులు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దర్శకుడు ఆండ్రెస్ ముషియట్టికి హ్యూమరస్ సన్నివేశాలను, ఎమోషనల్ ఎలిమెంట్స్‌ను తెరపై ఆవిష్కరించడంలో దిట్ట అన్నారు. ఇక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడడం తెలిసిన దర్శకుడు అని పేర్కొన్నారు. చిత్రంలో గ్రాఫిక్స్ సన్నివేశాలు అబ్బురపరుస్తాయన్నారు. చిత్రాన్ని తమిళం, తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో విడుదల చేయబోతున్నట్లు చెప్పారు.

కోలీవుడ్ టాక్స్

ఇరైవన్‌కు తేదీ ఖరారు

తమిళసినిమా: పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో టైటిల్ పాత్రను పోషించి ఆ చిత్ర విజయానికి ఒక పిల్లర్‌గా నిలిచిన నటుడు జయంరవి. ఈయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ఇరైవన్. లేడీ సూపర్‌స్టార్ నయనతార నాయకిగా నటించిన ఈ చిత్రంలో రాహుల్ బోస్, ఆశిష్ విద్యార్థి, నరేన్, విజయలక్ష్మి, చార్లీ ముఖ్యపాత్రలు పోషించారు. ఎంద్రెండుమ్ పున్నగై, మనిదన్‌వంటి విజయవంతమైన చిత్రాల ఫేమ్ అహ్మద్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. ప్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుదన్ సుందరమ్, జయరాం కలిసి నిర్మించిన ఈ చిత్రానికి యువన్ శంకర్‌రాజా సంగీతాన్ని, హరి కె.వేదాంత్ చాయాగ్రహణం అందిస్తున్నారు. చిత్ర విడుదల తేదీని నిర్మాతలు అధికారికంగా వెల్లడించారు. జులై 25న ఇరైవన్ చిత్రాన్ని తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. షూటింగ్‌ను చెన్నై, పాండిచ్చేరి ప్రాంతాలలో నిర్వహించి పూర్తి చేసినట్లు, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్మాతలు తెలిపారు. చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ తేదీని త్వరలోనే వెల్లడించనున్నట్లు చెప్పారు. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్ర కథ, కథనం కొత్తగా ఉంటాయని పేర్కొన్నారు. కాగా తనీ ఒరువన్ చిత్రం తరువాత జయం రవి, నయనతార కలిసి నటించిన చిత్రం కావడంతో ఇరైవన్‌పై మంచి అంచనాలే నెలకొన్నాయి. ఇకపోతే ఈ చిత్ర నిర్మాతలు సిద్ధార్థ్, హీరోగా నిర్మించిన టక్కర్ చిత్రం శుక్రవారం తెరపైకి వచ్చింది.



ఇరైవన్ చిత్ర పోస్టర్

షబ్బీర్ హీరోగా బర్త్ మార్క్

తమిళసినిమా: ఆర్య కథానాయకుడిగా పా.రంజిత్ దర్శకత్వం వహించిన సార్పట్టా పరంపరైలో డాన్సింగ్ రోస్ అనే ముఖ్యమైన పాత్రలో షబ్బీర్ కల్లరాక్కల్ నటించిన విషయం తెలిసిందే. ఆ చిత్రం 2021లో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. కాగా తాజాగా డాన్సింగ్ రోస్ షబ్బీర్ కల్లరాక్కల్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రానికి బర్త్ మార్క్ అనే టైటిల్‌ను నిర్ణయించారు. ఇందులో నటి మీర్జా నాయకిగా నటిస్తున్నారు. విక్రమ్ శ్రీధరన్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తూ నిర్మిస్తున్న చిత్రం ఇది. చిత్ర వివరాలను తెలుపుతూ ఇది 1990 ప్రాంతంలో జరిగే కొన్ని యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రమని చెప్పారు. తమిళనాడు కేరళ సరిహద్దుల్లో గల మరైయూర్ అనే గ్రామంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నటి దీప్తి, ఇంద్రజిత్, పోర్కొడి వి ఆర్ వరలక్ష్మి ముఖ్యపాత్రలు పోసిస్తున్నారని చెప్పారు. మిస్టరీ డ్రామాగా సాగే ఈ చిత్రం కథ ముఖ్యంగా రెండు పాత్రల చుట్టూ తిరుగుతుందన్నారు. డేని అనే సిపాయి కార్గిల్ యుద్ధం అనంతరం తన భార్యను తీసుకుని సొంత ఊరుకు వస్తాడన్నారు. అక్కడ వారు ఎదుర్కొనే సమస్యలు, కష్టాలే చిత్ర ప్రధాన అంశం అని చెప్పారు. సెంటిమెంట్, యాక్షన్‌తో పాటు భావోద్రేకాలతో కూడిన చిత్రం బర్త్ మార్క్ అని తెలిపారు. దీనికి విశాల్ చంద్రశేఖర్ సంగీతాన్ని, ఉదయ్ తంగవేల్ చాయాగ్రహణం అందిస్తున్నారని తెలిపారు.



బర్త్ మార్క్ చిత్ర యూనిట్

అప్పుడే మానసిక ప్రశాంతత

తమిళసినిమా: నటి సాయి పల్లవి నటినే కాదు భావాలు ప్రత్యేకంగా ఉంటాయి. ఏ నటుడు, నటి అయినా పేరు, పరపతి కోసమే సినిమాల్లోకి వస్తారు. నటి సాయిపల్లవి ఇందుకు అతీతం కాదు. అయితే వృత్తిని వృత్తిగానూ, అందులో సంతృప్తిని కోరుకునే అతి తక్కువ మంది నటీమణుల్లో ఈమె ఒకరు. వచ్చిన అవకాశాన్ని ఒప్పేసుకుని నటించేసి డబ్బు సంపాదించుకుందాం అనే మనస్తత్వం కాదు ఈమెది. అలాంటి నటి పలు అవకాశాలను తిరస్కరించి ఏడాదికి పైగా ఖాళీగా ఉండేవారు కాదు. డాక్టర్ పట్టా పొంది, దక్షిణాదిలో చేసింది తక్కువ చిత్రాలే అయినా ఎక్కువ పేరు తెచ్చుకున్నారు. కాగా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చేసే వృత్తి గురించి ఆమె ఏం చెప్పారో చూద్దాం. చేసే వృత్తిని ఆస్వాదిస్తూ ఇష్టంగా చేయాలన్నది తన భావన అన్నారు. పనిలో సంతోషాన్ని వెతుక్కుంటేనే అది మనకు తృప్తిని కలిగిస్తుందన్నారు. చేసే వృత్తిని వ్యక్తిగత జీవితంలోకి తీసుకురాకూడదన్నారు. వృత్తిని వ్యక్తిగతాన్ని వేర్వేరుగా చూడాలన్నారు. అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఏ చిత్రంలో నటించినా, సాయంత్రం షూటింగ్ ముగిసిన తరువాత బయటకు వస్తే ఆ చిత్రం గురించి ఆలోచించనన్నారు. అదేవిధంగా షూటింగ్ స్పాట్‌లోకి ఎంటర్ అయిన తరువాత తన వ్యక్తిగత జీవితం గురించి పూర్తిగా మరచిపోయి వృత్తిలో నిమగ్నమై పోతానని చెప్పారు. చేసేది ఏ పని అయినా వృత్తిని దైవంగా భావించాలన్నారు. అప్పుడే పనిపై పూర్తిగా దృష్టి సారించగలమని సాయిపల్లవి పేర్కొన్నారు. ప్రస్తుతం ఈమె కమలహాసన్ నిర్మిస్తున్న చిత్రంలో శివకార్తికేయన్‌కు జంటగా నటిస్తున్నారు.



సాయి పల్లవి

క్లుప్తంగా

అవయవదానం

అన్నానగర్: మాధవరం సమీపంలో లారీ నుంచి పడి బ్రెయిన్ డెడ్ అయిన కార్మికుడి అవయవాలను బంధువులు గురువారం స్టాన్లీ ఆసుపత్రికి దానం చేశారు. వేలూరు జిల్లా ముత్తుమండపం ప్రాంతానికి చెందిన ప్రభాకరన్ (45) చెన్నై మాధవరం సమీపంలోని మంజంబాక్కంలో లారీ రిపేర్ షాపులో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత 4వ తేదీన లారీలో పనిచేస్తుండగా కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు తెలిపారు. ప్రభాకరన్ బంధువుల అంగీకారంతో కళ్లు, చర్మం, రెండు కిడ్నీలు దానం చేశారు. అతని నుంచి దానం చేసిన కిడ్నీని తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న స్టాన్లీ హాస్పిటల్ పేషెంట్‌కు అమర్చారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగికి మరో కిడ్నీ దానం చేశారు. చర్మం, కళ్లను స్టాన్లీ హాస్పిటల్‌లో ఉంచారు. అవసరమైన వారికి అందజేస్తారు.

సముద్రపు జలగలు స్వాధీనం



అన్నానగర్: రామనాథపురంలో ఇంట్లో నిల్వ ఉంచిన 45 కిలోల సముద్రపు జలగలను శుక్రవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రామనాథపురం ఫారెస్ట్ రేంజర్ సురేష్‌కుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. అప్పుడు దేవీ పట్టణం బీచ్ ప్రాంతంలోని ఓ ఇంట్లో సముద్రపు జలగలు ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో మారియమ్మన్ కోవిల్ వీధిలోని అయాబ్‌ఖాన్ (53) ఇంట్లో సోదాలు నిర్వహించగా 45 కిలోల సముద్రపు జలగలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు అయాబ్‌ఖాన్‌ను అరెస్టు చేశారు.

గజరాజుల వీరంగం

తిరువొత్తియూరు: సత్యమంగళం బన్నారి అమ్మన్ దేవాలయం సమీపంలో మైసూరు జాతీయ రహదారి మధ్యలో రెండు ఏనుగులు పోట్లాడుకోవడంతో వాహనదారులు భయాందోళన చెందారు. ఈరోడ్ జిల్లా సత్యమంగళం టైగర్ రిజర్వు ఫారెస్టులో అనేక ఏనుగులు ఉన్నాయి. ఈ అటవీ ప్రాంతం గుండా వెళ్లే సత్యమంగళం – మైసూర్ జాతీయ రహదారిపై రాత్రి, పగలు తేడా లేకుండా ఏనుగులు సంచరిస్తూ ఉంటాయి. ఈ క్రమంలో బాన్నారి అమ్మన్ ఆలయం సమీపంలోని అడవి నుంచి రోడ్డు పైకి వచ్చిన రెండు ఏనుగులు మార్గమధ్యంలో పోరాడుతూ నిలబడ్డాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు భయాందోళనకు గురై కొద్దిసేపు వాహనాలను నిలిపివేశారు. ఏనుగులు తర్వాత మెల్లగా అడవిలోకి వెళ్లిపోయాయి. రోడ్డుపై అడవి ఏనుగుల బెడద ఎక్కువగా ఉండడంతో వాహనదారులు తమ వాహనాలను అత్యంత జాగ్రత్తగా, ఓ మోస్తరు వేగంతో నడపాలని అటవీశాఖ సూచించింది.

కార్మికుడు హత్య

అన్నానగర్: దిండుక్కల్ సమీపంలో గురువారం పట్టపగలు ఓ కార్మికుడు దారుణ హత్యకు గురయ్యాడు. దిండుక్కల్‌లో పళని రోడ్డులోని మురుగభవన్‌లోని పెట్రోల్ బంకు వద్ద గురువారం మధ్యాహ్నం 3.15 గంటలకు రెండు బైకుల్లో వచ్చిన ముగ్గురు వ్యక్తులు గొడవపడ్డారు. ఆ తర్వాత మరో బైకులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఓ యువకుడితో వాగ్వాదానికి దిగారు. హఠాత్తుగా ఇద్దరు వ్యక్తులు కొడవలి తీసి యువకుడిని దారుణంగా నరికి బైకులో పరారయ్యారు. యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దిండుక్కల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో మృతుడు చానార్‌పట్టి సమీపం బేతాయకౌండన్‌పట్టికి చెందిన అళగుపాండి (25) అని, వెల్డింగ్ వర్క్‌షాప్‌లో కూలీ అని తెలిసింది.

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి బాలుడు మృతి

తిరువొత్తియూరు: కాంచీపురం జిల్లాలో స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి ఆరేళ్ల బాలుడు మృతిచెందాడు. కాంచీపురం జిల్లా తిరుపెరంబుదూరు సమీపం పడప్పై నేలమంగళం ప్రాంతానికి చెందిన కుమార్. ఇతని కుమారుడు వైభవ్. కుమార్ కుమారుడిని అదే ప్రాంతంలో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌కు ఈత నేర్పించేందుకు తీసుకెళ్లాడు. ఈత నేర్చుకుంటుండగా హఠాత్తుగా నీటి మునిగాడు. నందకుమార్ వెంటనే కుమారుడిని బయటకు తీసి ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ వైభవ్ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు చెల్లించలేక ఆత్మహత్య

అన్నానగర్: ఆన్‌లైన్ యాప్‌లో తీసుకున్న అప్పు చెల్లించలేక బీఈ చదివిన విద్యార్థి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నామక్కల్ సమీపంలోని చెల్లప్ప కాలనీకి చెందిన కుమరన్. ఇతని కుమారుడు లోకేశ్వరన్ (22). కరూర్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో బీఈ పూర్తి చేశాడు. లోకేశ్వరన్ ఆన్‌లైన్ యాప్ ద్వారా రుణం తీసుకున్నాడు. రుణాన్ని చెల్లించాలని లోకేశ్వరన్‌పై ఒత్తిడి తెచ్చారు. దీంతో రుణదాతలు లోకేశ్వరన్ తల్లిదండ్రులతో మాట్లాడారు. మనస్తాపానికి గురైన లోకేశ్వరన్ గురువారం రాత్రి ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి నామక్కల్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

కెన్యాతో నరువి ఆస్పత్రి ఒప్పందం

వేలూరు: వేలూరు నరువి ఆస్పత్రితో పాటు కెన్యా దేశ కిస్సు మాగాన ప్రభుత్వంతో పరస్పర ఒప్పందం వేలూరులోని నరువి ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం జరిగింది. ఈ ఒప్పందంలో నరువి చైర్మన్ జీవీ సంపత్, కిస్సు మాగాన గవర్నర్ పీటర్ అయ్యంగ్ నాయాంగో, ఆయన సతీమణి డోరతి నాయాంగో సంతకాలు చేసుకుని పరస్పరం చేసుకున్నారు. నరువి చైర్మన్ మాట్లాడుతూ నాయాంగో కెన్యా దేశంలో దేశాభివృద్ధి పథకం, వైద్య సేవా పథకం మంత్రిగా రెండుసార్లు పనిచేశారని ఇండియాలో మొదటి సారిగా నరువి ఆస్పత్రితో కిస్సు మాగాన ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ఒప్పందం ద్వారా గుండె, చెవి, ముక్కు గొంతు, ఎముకలు వంటి ఆపరేషన్‌లు చేసుకునేందుకు వైద్యసదుపాయాలు చేసేందుకు పరివర్తన చేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. కీస్సు మాగానంను రెండవ ముంబైగా పిలుస్తారన్నారు. ఇక్కడ అధికంగా



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఆస్పత్రి చైర్మన్ జీవీ సంపత్

భారత దేశానికి చెందిన వ్యక్తులు అధిక సంఖ్యలో నివశిస్తున్నారన్నారు. నరువిలోని వైద్యులు కెన్యా వెళ్లి చికిత్స పద్ధతిని అక్కడున్న డాక్టర్‌ల వద్ద శిక్షణ పొందతున్నట్లు కెన్యా దేశ డాక్టర్‌లు నరువిలో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని ఒప్పందాలు చేసుకున్నారన్నారు. కెన్యా ఆరోగ్యశాఖా మంత్రి గిరిగోరి గాండా, ప్రభుత్వ ఆస్పత్రి డీన్ జార్జిరే, టెక్నాలజీ సలహాదారులు హెడిల్లా పాల్గొన్నారు.

14 నుంచి సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్ల పంపిణీ

కొరుక్కుపేట: ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 14వ తేదీ నుంచి పరీక్షల విభాగం వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు, 23వ తేదీ నుంచి ప్రైమరీ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ (డీటీడీ) పరీక్ష హాల్ టికెట్లను పంపిణీ చేయనున్నారు. మార్చిలో జరిగిన ప్లస్ 2 పరీక్షలో ఒకటి లేదా రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్, జూలై నెలల్లో సప్లిమెంటరీ పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు (తక్కల్‌తో సహా) తమ హాల్ టికెట్లను 14వ తేదీ మధ్యాహ్నం తర్వాత **www.dfe.tn.gov.in** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వ్యక్తిగత అభ్యర్థులు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌ను సందర్శించి, వారి రోల్ నంబర్ లేదా శాశ్వత రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేయడం ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వ్యక్తిగత అభ్యర్థులు ప్రాక్టికల్ పరీక్ష తేదీకి సంబంధించిన వివరాల కోసం వారికి కేటాయించిన పరీక్షా కేంద్రంలోని ప్రిన్సిపల్, ఇన్విజిలేటర్‌ను సంప్రదించాలి. టీచర్ ట్రైనింగ్ ఎగ్జామినేషన్ (ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్) కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్, జూలై నెలల్లో పరీక్ష నిర్వహిస్తారు. మొదటి సంవత్సరం పరీక్ష ఈ నెల 23 నుంచి జూలై 12 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈ నెల 22 నుంచి జూలై 11 వరకు జరుగుతాయి. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారు **www.dfe.tn.gov.in** వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం తర్వాత పాస్‌పోర్ట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

అంబత్తూరు డెయిరీ ఫామ్‌లో నిలిచిపోయిన ఉత్పత్తి

కొరుక్కుపేట: ఇటీవల బయట జిల్లాల నుంచి తక్కువ పాలు సరఫరా కావడం, కాంట్రాక్టు కార్మికుల సమస్య వంటి కారణాలతో పాల సరఫరా తగ్గింది. అదే సమస్యతో అంబత్తూరు డెయిరీ ఫారంలో శుక్రవారం మళ్లీ పాల ఉత్పత్తి తగ్గింది. దీంతో లక్ష లీటర్ల పాల ఉత్పత్తి నిలిచిపోయింది. తెల్లవారుజామున 4 గంటలకు రావాల్సిన పాలు 8.30 గంటల వరకు రాలేదు. దీనికి సంబంధించి అన్నానగర్, అమింజ్ కర్తె, అరుంబాక్కం, నెర్కుంద్రం, మధురవాయల్, కోయంబేడు, వలసరవాక్కం, పోరూర్, పూంతమల్లి తదితర ప్రాంతాల్లో పాల సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. దీనిపై చులైమేడు మిల్క్ ఏజెంట్ సతీష్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో తరుచుగా వస్తున్న ఈ సమస్యతో ఏజెంట్లు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలు ఆలస్యంగా రావడంతో మరుసటి రోజు పంపిణీ చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎండాకాలం కావడంతో పాలు పాడవుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. పాల సరఫరా, కూలీల కొరతకు ప్రభుత్వం వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

ప్రయాణికులను ఆకట్టుకుంటున్న ఎలక్ట్రిక్ రైలు

కొరుక్కుపేట :ప్రయాణికులను ఆకట్టుకునేందుకు అరక్కోణం–వేళచ్చేరి మధ్య కలర్‌ఫుల్ ఎలక్ట్రిక్ రైలు సర్వీసు శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. అరక్కోణం రైల్వే స్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్, చెన్నై బీచ్ వరకు, చెంగల్పట్టు, తిరుత్తణి సహా పలు ప్రాంతాలకు 100కు పైగా సబర్బన్ ఎలక్ట్రిక్ రైళ్లు నడుస్తున్నాయి. వీటిని ప్రజలు ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ సందర్భంలో ఆవడి వర్క్‌షాప్‌లో ప్రయాణికులను ఆకర్షించడానికి వివిధ రంగుల్లో 9 కోచ్‌లు, ఆధునిక సౌకర్యాలతో ఎలక్ట్రిక్ రైలును అభివృద్ధి చేశారు. ఈ రైలు సర్వీసు శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. చెన్నై బీచ్ నుంచి తెల్లవారుజామున బయలుదేరి అరక్కోణం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అనంతరం శుక్రవారం ఉదయం 7 గంటలకు అరక్కోణంలో బయలుదేరి చెన్నై వేళచ్చేరి వెళ్లింది.



కలర్‌ఫుల్ ఎలక్ట్రిక్ రైలు

పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

తిరువొత్తియూరు: పోలీసు కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నైలోని టీపీచత్రం పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ అయ్యనార్ (34), పోలీసు కమలకన్నన్ (33) గురువారం టీపీ చత్రం, పరిసర ప్రాంతాల్లో బైక్‌లపై గస్తీ తిరుగుతున్నారు. కేవీఎన్ పురం ప్రాంతంలోని చీకటి క్రాస్ లేన్‌లో ఇద్దరు వ్యక్తులు బైక్‌లపై నిలబడి ఉన్నారు. పట్రోలింగ్ పోలీసులు వారిని విచారణకు పిలిచారు. వారు పోలీసులను చూడగానే పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. వారు బైక్‌ను అక్కడే వదిలేసి అయ్యనార్‌పై దాడి చేసి పరారయ్యారు. గాయపడిన అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయ్యనార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న ఇద్దరినీ గురువారం అరెస్ట్ చేశారు. వారు టీపీ చత్రం కేవీఎన్ పురం మొదటి వీధికి చెందిన అరుణ్‌కుమార్ (27), అతని సహచరుడు మనోజ్ (18) అని తేలింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి ఎగ్మూరు కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

గరుడ వాహనాలపై పెరుమాళ్



గరుడ వాహనాలపై విహరిస్తున్న పెరుమాళ్ స్వామి

తిరువొత్తియూరు: ఒకే చోట 24 ఆలయాల నుంచి వచ్చిన పెరుమాళ్ స్వామికి గరుడ సేవ ఉత్సవం శుక్రవారం తంజావూరులో జరిగింది. తంజావూరులోని 24 పెరుమాళ్ ఆలయాల్లో పెరుమాళ్ ఉత్సవ మూర్తులను ప్రతి సంవత్సరం వైకాశి శ్రావణ నక్షత్రం రోజు గరుడ వాహనంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. తంజావూరులోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన పెన్నానది తీరంలో వెలసివున్న నీల మేఘపెరుమాళ్ ఆలయంలో శుక్రవారం 89వ వార్షిక గరుడసేవ కార్యక్రమం జరిగింది. 24 ఆలయాల నుంచి గరుడవాహనంపై పెరుమాళ్ స్వామి ప్రత్యేక అలంకారంలో బయలుదేరి వరుసగా ధ్వజస్తంభం వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ఉదయం 7 గంటలకు 24 గరుడ వాహనాలు కీల్, సౌత్, మేళరాజ వీధి, ఉత్తర రాజవీధి మీదుగా విహరించారు.

కాలువలో ట్రక్కు బోల్తా

- ఇద్దరు ఉత్తరాది కూలీలు మృతి

అన్నానగర్: తిరువారూరు సమీపంలో కోళ్ల ట్రక్కు కాలువలో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు ఉత్తరాది కూలీలు మృతిచెందారు. కోల్‌కతాకు చెందిన నోబో మాజీ (29), సాటో మాజి (27) రెండు నెలలుగా తంజావూరులోని మాటకోట్టై ప్రాంతంలోని హోల్‌సేల్ చికెన్ షాపులో పనిచేస్తున్నారు. వీరిద్దరూ గురువారం తంజావూరు నుంచి ట్రక్కులో కోళ్లను ఎక్కించుకుని పుదుచ్చేరిలోని కారైకాల్‌కు వెళుతున్నారు. శుక్రవారం వేకువజాము తిరువారూరు సమీపంలోని కోరడచ్చేరి చరకం బ్రిడ్జ వద్ద ట్రక్కు వెళుతుండగా అదుపుతప్పి ఓట్టకుడి కాలువలో లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నోటో మాజీ, సాతో మాజి అక్కడికక్కడే మృతి చెందారు. కొరడాచేరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘనంగా శ్రీకృష్ణ భజన మందిరం కుంభాభిషేకం



పూజలు చేస్తున్న అర్చకులు

పళ్లిపట్టు: వేలన్‌కండ్రిగలో శ్రీకృష్ణ భజన మందిరానికి కుంభాభిషేకాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్కేపేట యూనియన్ ఎస్‌వీజీ.పురం గ్రామ పంచాయతీలోని వేలన్‌కండ్రిగలో ప్రజల ఆర్థిక సాయంతో శ్రీకృష్ణ భజన మందిరం నిర్మించారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు మహాకుంభాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో యాగశాలలు ఏర్పాటు చేసి నిత్య హోమ పూజలు చేశారు. శుక్రవారం ఉదయం మహాపూర్ణాహుతి అనంతరం మంగళ వాయిద్యాల నడుమ పవిత్ర పుణ్యతీర్థాల కలశాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ గోపుర కలశాలకు మహాకుంభాభిషేకం చేపట్టి భక్తులపై పుణ్య తీర్థాలు చల్లారు. అనంతరం శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులందరికీ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

కృష్ణా కాలువలో పడి బాలిక మృతి

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా సెవ్వాపేటలోని కృష్ణా కాలువలో పడి బాలిక (13) మృతిచెందింది. పెద్దపాళ్యం సమీపంలోని ఎర్నాకుళం గ్రామానికి చెందిన గోపి కుమార్తె జోషిక(13) పాన్నేరీలోని వేలమ్మాల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. వారం రోజుల క్రితం తిరువళ్లూరు సమీపంలోని భజనకండ్రిగలో జరిగే బంధువుల వివాహానికి గోపి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం జోషిక బంధువులతో కలిసి భజనకండ్రిగ వైపు వెళుతున్న కృష్ణా కాలువ వద్దకు బట్టలు ఉతకడానికి వెళ్లింది. ఈ సమయంలో ఆడుకుంటూ కాలుజారి కాలువలో పడిపోయింది. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొట్టుకుపోయింది. విషయాన్ని స్థానికులు తిరువూర్ అగ్నిమాపక సిబ్బందితో పాటు సెవ్వాపేట పోలీసులకు తెలిపారు. వారు అక్కడికి చేరుకుని గంట పాటు గాలించి బాలిక మృతదేహాన్ని వెలికితీశారు. సెవ్వాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భర్త కళ్లెదుటే భార్య దుర్మరణం

- బైక్‌ను ఢీకొన్న బస్సు
- భార్య మృతి, భర్తకు గాయాలు

అన్నానగర్: బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో భార్య మృతిచెందగా, భర్తకు గాయాలయ్యాయి. చెన్నైలోని తిరువేర్కాడు ప్రాంతానికి చెందిన రామలింగం (52) కోయంబేడు ప్రాంతంలో టీ దుకాణం నడుపుతున్నాడు. ఇతని భార్య కాంచన (45). కోయంబేడు నుంచి ఇద్దరూ గురువారం ఉదయం బైకులో తిరువెర్కాడుకు బయలుదేరారు. కోయంబేడు-పూందమల్లి ప్రధాన రహదారిపై వెళుతుండగా తిరుత్తణి నుంచి కోయంబేడు బస్టాండ్ వెళుతున్న ప్రభుత్వ బస్సు బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో కాంచన అక్కడికక్కడే మృతిచెందింది. స్వల్పగాయాలతో బయటపడ్డ రామలింగం భార్య మృతదేహం వద్ద కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలిసి కోయంబేడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కాంచన మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రభుత్వ బస్సు డ్రైవర్ పళని(47)ని అరెస్టు చేసి విచారిస్తున్నారు.

బస్సులో 15 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్

అన్నానగర్: బెంగళూరు నుంచి హొసూరు మీదుగా తిరుపూర్‌కు వెళుతున్న ప్రభుత్వ బస్సులో శుక్రవారం 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు ఉత్తర రాష్ట్ర యువకులను అరెస్టు చేశారు. కృష్ణగిరి జిల్లా హొసూరు సమీపంలోని జుజువాడి చెక్‌పోస్టు వద్ద హొసూరు సిప్‌కాట్ పోలీసులు శుక్రవారం ఉదయం వాహనాల తనిఖీలు నిర్వహించారు. బెంగళూరు నుంచి సేలం వెళుతున్న ప్రభుత్వ బస్సును పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీల్లో ఇద్దరు ఉత్తరాది యువకులు బ్యాగులను తనిఖీ చేశారు. అందులో 15 కిలోల గంజాయి వున్నట్లు గుర్తించారు. ఒడిశాకు చెందిన కిషోర్ పలియా (26), దుతం పక్కర్ (21) అనే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి 15 కిలోల గంజాయి ప్యాకెట్లు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

అన్నాడీఎంకే నాయకురాలి ఇంట్లో చోరీ

తిరువళ్లూరు: అన్నాడీఎంకే నాయకురాలి ఇంటిలో 40 సవర్ల బంగారు నగలు, రూ.5.60 లక్షల నగదు చోరీ చేసిన ముగ్గురిని సెవ్వాపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తిరువళ్లూరు జిల్లా తొయ్యూరు గ్రామానికి చెందిన కౌసల్య అన్నాడీఎంకే మహిళా నాయకురాలు. ఆమె ప్రస్తుతం ప్రాథమిక సహకార బ్యాంకులో డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త మనోహరన్ అనారోగ్యం కారణంగా ఇటీవల మృతిచెందారు. ఆమె కొడుకు అఖిలన్‌తో కలిసి స్థానికంగా నివాసం వుంటున్నారు. ఈ నేపథ్యంలో గత మంగళవారం రాత్రి కౌసల్య కుమారుడు అఖిలన్ పూండీ నైవేలి వద్ద వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి అక్కడే రాత్రి వుండిపోయారు. కౌసల్య తన సోదరి సుగంతి ఇంటిలో నిద్రించారు. బుధవారం ఉదయం 6 గంటలకు తిరిగి ఇంటికి రాగా తలుపులు పగులగొట్టి బీరువాలో వుంచిన 40 సవర్ల బంగారు నగలు, 3 కేజీల వెండి, రూ.5.60 లక్షల నగదు, 23 విలువైన పట్టుచీరలు మాయమైనట్టు గుర్తించారు. ఈ సంఘటనపై సెవ్వాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ పుటేజీ ఆధారంగా ఆవడికి చెందిన శివలింగం కుమారుడు ధనశేఖర్ అలియాస్ సంజయ్(18), చెన్నై పట్టాళం ప్రాంతానికి చెందిన మోసస్ కుమారుడు లాసర్(21), విల్లివాక్కం ప్రాంతానికి చెందిన మాసి కుమారుడు రాధాకృష్ణన్(18)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



అరెస్టయిన నిందితులు

ఇద్దరు కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్

వేలూరు: కర్ణాటక మద్యం ప్యాకెట్లను ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలకు కారులో తరలించి విక్రయిస్తున్న ఇద్దరు చిత్తూరు వాసులను పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. వేలూరు జిల్లాలో అధికంగా కర్ణాటక మద్యం, సారా విక్రయిస్తున్నారని, వీటిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ మణివన్నన్ పోలీసులను ఆదేశించారు. దీంతో వేలూరు జిల్లా కాట్పాడి తాలూకా పొన్నై పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదాండకుప్పం గ్రామంలో కారులో కర్ణాటక మద్యాన్ని తీసుకొచ్చి పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం వచ్చింది. పోలీసులు గ్రామంలో విచారణ చేస్తుండగా పోలీసులను చూసి ఒక కారు అతి వేగంగా వెళ్లింది. పోలీసులు కారును వెంబడించి తనిఖీ చేపట్టగా కర్ణాటక మద్యం ప్యాకెట్లను ఆంధ్ర, తమిళనాడులోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తేలింది. కారులో ఉన్న 2,496 మద్యం ప్యాకెట్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు కోటగారిపల్లికి చెందిన చంద్రయ్య కుమారుడు వినోద్‌కుమార్, అదే గ్రామానికి చెందిన రాజన్ కుమారుడు ఆనందన్‌గా తేలింది. వారిని అరెస్టు చేసి విచారిస్తున్నారు.



కర్ణాటక మద్యంతో పట్టుబడిన నిందితులు

అనుమానాస్పద స్థితిలో పారిశ్రామికవేత్త మృతి

అన్నానగర్: ధర్మపురి జిల్లా తోప్పూరు కనుమ సమీపంలోని కాటమేడు ప్రాంతంలో గురువారం రాత్రి కారులో పారిశ్రామికవేత్త అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కాటమేడు ప్రాంతంలో కారు చాలా సేపటి నుంచి నిలిచి ఉంది. ఆ దారిన వెళ్లే వారు తోప్పూరు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కారులోని డ్రైవర్ సీటులో కూర్చున్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని ధర్మపురి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విచారణలో ఆ వ్యక్తి తేని జిల్లా అల్లినగర్ ప్రాంతానికి చెందిన పన్నీర్‌సెల్వం (42)గా తేలింది. అతను కార్లు కొనుగోలు, అమ్మకం వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు. అతను తోప్పూరు ఎందుకు వచ్చాడు, అనారోగ్యంతో చనిపోయాడా? లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కత్తితో బెదిరించి కళాశాల ఉద్యోగినిపై లైంగిక దాడి

అన్నానగర్: మదురైలో ఓ ఇంట్లోకి చొరబడి గురువారం సాయంత్రం కత్తితో బెదిరించి కాలేజీ ఉద్యోగినిపై లైంగిక దాడి చేయడంతోపాటు 4 సవర్ల నగలు అపహరించిన దుండగుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మదురై చింతామణి ప్రాంతానికి చెందిన మహిళ (54) ఓ ప్రైవేట్ కాలేజీలో అసిస్టెంట్‌గా పని చేస్తోంది. ఆమె భర్త కొన్ని నెలల క్రితం చనిపోయాడు. ఆమె గురువారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ సమయంలో యువకుడు (25) హఠాత్తుగా ఇంట్లోకి ప్రవేశించాడు. కత్తితో బెదిరించి ఆమెపై లైంగిక దాడి చేశాడు. అలాగే ఆమె వద్ద ఉన్న 4 సవర్ల బంగారు చైన్, సెల్ ఫోన్, రూ.4 వేలు దోపిడీ చేశాడు. దీనిపై ఆమె సిలైమాన్‌పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దుండగుడి కోసం గాలిస్తున్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

తిరువళ్లూరు: రైలులో గంజాయిని తరలించి సెవ్వాపేట తదితర ప్రాంతాల్లో విక్రయించడానికి యత్నించిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రెండు కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తిరువళ్లూరు జిల్లాలో గంజాయి విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సెవ్వాపేట తిరువూర్, వేపంబట్టు తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు. వేపంబట్టు రైల్వేస్టేషన్‌లో రైలు దిగి ద్విచక్ర వాహనంలో సెవ్వాపేట వైపు వెళుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో బ్యాగులో పరిశీంచారు. అందులో రెండు కిలోల గంజాయి వున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఆ యువకులు అన్నానగర్‌కు చెందిన మహేంద్రన్ కుమారుడు తమిళ్‌వానన్(35), ఐసీఎఫ్ నగర్‌కు చెందిన గిరి కుమారుడు శక్తివేల్(22), చిన్నతంబి కుమారుడు ఉదయకుమార్(31)గా గుర్తించి అరెస్టు చేశారు. వీరు కేరళ నుంచి రైలులో గంజాయిని తరలించి అక్రమంగా విక్రయిస్తున్నట్టు తేలింది.



అరెస్టయిన నిందితులు

2.5 టన్నుల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం

అన్నానగర్: నాగపట్టణంలో 2.5 టన్నుల ప్లాస్టిక్ వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. అయితే నిషేధం ఉన్నప్పటికీ నాగై జిల్లాలో ప్లాస్టిక్ ఉత్పత్తులు విరివిగా అమ్ముడయ్యాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అనంతరం కలెక్టర్ జానీ టామ్ వర్గీస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం నాగై మున్సిపల్ కమిషనర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి కార్తికేయ, మున్సిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ సలహా మేరకు ఫీల్డ్ అసిస్టెంట్లు, స్వచ్ఛ భారత్ ప్రాజెక్టు న్యాయవాదులు, క్లీనింగ్ సూపర్‌వైజర్లతో కూడిన బృందం నాగైలోని నాగూరులో తనిఖీలు నిర్వహించింది. ఆ సమయంలో 200కి పైగా దుకాణాలను తనిఖీ చేసి 2.5 టన్నుల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత దుకాణాలకు రూ.54 జరిమానా విధించి ఆ మొత్తాన్ని మున్సిపల్ ట్రెజరీకి చెల్లించారు.



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులు

వసతుల కోసం వినూత్న నిరసన



స్టౌ, బిందెలతో నిరసన తెలుపుతున్న స్థానికులు

అన్నానగర్: కనీస వసతులు కల్పించాలని కోరుతూ ప్రజలు గురువారం శివగంగై కలెక్టర్ కార్యాలయం వద్ద గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లతో నిరసన తెలిపారు. శివగంగై జిల్లా ఇళయాంకుడి సమీపంలోని ఇ.సుందనేందల్ గ్రామంలో పెద్ద సంఖ్యలో కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ ప్రాంతంలో కనీస వసుతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఈ గ్రామ ప్రజలు గ్రామపెద్ద భూమినాథన్ నేతృత్వంలో శివగంగై కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లతో నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అధకారులు అక్కడికి చేరుకుని ప్రజలతో చర్చలు జరిపారు. వారిని శాంతింపజేశారు.

ఉత్తర్వులు



ఎస్‌ఐఎంఏటీఎస్ నేతృత్వంలో ఉపాధి నైపుణ్యాలు, ప్లేస్‌మెంట్‌లలో ట్రాక్ రికార్డులతో వివిధ పరిశ్రమలలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు దక్కించుకున్న విద్యార్థులను శుక్రవారం స్థానికంగా సత్కరించారు. వారికి ప్రశంసాపత్రాలతోపాటు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు సంబంధించిన ఉత్తర్వులను అందజేశారు.

– సాక్షి, చెన్నై

మావోయిస్టు మహిళా దళ కమాండర్ అరెస్టు

- పోలీసులను హతమార్చేందుకు వచ్చి పట్టుబడిన బుజ్జి
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ముప్పైకి పైగా కేసులు

కొత్తగూడెంటౌన్/మంగపేట:పోలీసులను హతమార్చాలనే లక్ష్యంతో దళ సభ్యులు, మిలీషియా సభ్యులతో కలసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వచ్చిన ఛత్తీస్‌గఢ్‌లోని పామేడు ఎల్‌ఓఎస్ మహిళా దళ కమాండర్ బుజ్జి పోలీసులకు పట్టుబడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం కొత్తగూడెంలో వివరాలను వెల్లడించారు. భద్రాద్రి జిల్లా చర్ల మండల పరిధిలో శుక్రవారం ఉదయం చర్ల పోలీసులు, 141 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది సంయుక్తంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అందులో ఒకరిని పామేడు మహిళా దళ కమాండర్ గొట్టా బుజ్జి అలియాస్ కమలగా గుర్తించారు. దీంతో ఆమెను అరెస్టు చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం చర్లపల్లికి చెందిన బుజ్జి 2008లో మావోయిస్టు పార్టీలో చేరింది. ఆమెను మావోయిస్టు అగ్ర నాయకత్వం పామేడు ఎల్‌ఓఎస్ దళ కమాండర్‌గా నియమించింది. తాజాగా మిలీషియా సభ్యులతో కలసి తాలిపేరు డ్యామ్ వద్దకు వస్తూ పోలీసులకు చిక్కింది. ఆమెపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో 30కిపైగా కేసులు ఉన్నాయని ఎస్పీ వెల్లడించారు. ఆమె నుంచి జిలెటిన్ స్టిక్స్ ఇతర పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో మావోలు?

ములుగు జిల్లా సరిహద్దు గ్రామమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జానంపేటకు చెందిన ఇద్దరు మావోయిస్టులను మంగపేట, ఏటూరునాగారం పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అదుపులో ఉన్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరి తండ్రి పంట పొలంలో గొయ్యితీసి తుపాకీని దాచి పెడుతుండగా పోలీసులు దానిని స్వాధీనం చేసుకుని అతన్ని కూడా అరెస్ట్ చేసినట్లు తెలిసింది. దీనిపై వివరణ కోరేందుకు ఏటూరునాగారం సీఐకి ఫోన్ చేయగా స్పందించలేదు.

బాదుడు.. బుకాయింపే

విద్యుత్ చార్జీలు పెరగలేదు.. వాడుకున్నదానికే బిల్లు

- ఏపీఈఆర్‌సీ అనుమతితోనే ట్రూఅప్ చార్జీలు
- అది కూడా యూనిట్‌కు 0.40 పైసలు మాత్రమే
- వ్యవసాయ విద్యుత్ ట్రూఅప్ భారం రూ.1,066.54 కోట్లు
- సబ్సిడీతో పాటు ఆ మొత్తాన్ని భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచేసిందంటూ టీడీపీ నేతలు, ఎల్లో మీడియా మరోసారి దుష్ప్రచారానికి తెగబడ్డాయి. రకరకాల పేర్లతో అదనపు బాదుడు పెరిగిందంటూ వాస్తవాలను వక్రీకరిస్తున్నారు. నిజానికి విద్యుత్ బిల్లులో అన్ని వివరాలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) అనుమతితో, మార్గదర్శకాల ప్రకారమే పొందుపరుస్తున్నట్లు ఇంధన శాఖ తెలిపింది.

చట్టప్రకారమే సర్దుబాటు..

విద్యుత్ రిటైల్ సరఫరా వ్యవస్థలో ఏడాదికోసారి ఆర్థిక సంవత్సరం మొదలయ్యే ముందు ధరలు ప్రకటిస్తారు. విద్యుత్ పంపిణీ రంగంలో ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలకు అనుగుణంగా సర్దుబాటు చార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ, అవసరాల నివేదికను సెప్టెంబర్ నాటికి ఉన్న పరిస్థితుల ఆధారంగా రూపొందిస్తాయి. కాబట్టి అప్పుడు వంద శాతం ఖచ్చితత్వంతో విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని అంచనా వేయడం సాధ్యం కాదు. ఆర్థిక సంవత్సరం కొనసాగుతున్నప్పుడు విద్యుత్ కొనుగోలు ఖర్చులో హెచ్చు తగ్గులుంటాయి. విద్యుత్ చట్టం నిబంధనల్లో నిర్దేశించిన విధంగా ఇంధన చార్జీలు / కొనుగోలు వ్యయంలో హెచ్చుతగ్గులను సర్దుబాటు చార్జీల ద్వారా వసూలు చేసుకునే వెసులుబాటు డిస్కమ్‌లకు ఉంది. ఆ ప్రకారమే సర్దుబాటు చార్జీలను విధిస్తున్నాయి.

రైతులపై పైసా భారం లేదు..

2014–15 నుంచి 2018–19 వరకు పంపిణీ వ్యవస్థకు సంబంధించి నెట్‌వర్క్ ట్రూఅప్ చార్జీలు దాదాపు రూ.3,977 కోట్లుగా ఏపీఈఆర్‌సీ నిర్ధారించింది. ఇందులో ఏపీఎస్పీడీసీఎల్ వాటా రూ.2135 కోట్లు కాగా ఏపీసీపీడీసీఎల్ వాటా రూ.1,232 కోట్లు, ఏపీఈపీడీసీఎల్ ఖర్చు రూ.609 కోట్లుగా మండలి పేర్కొంది. ఉచిత వ్యవసాయ విద్యుత్ నిమిత్తం ట్రూఅప్ భారం రూ.1,066.54 కోట్లు. రైతులకు అందించే విద్యుత్ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ రూపంలో భరిస్తోంది. కాబట్టి ఉచిత వ్యవసాయ విద్యుత్ వినియోగానికి సంబంధించి ఇంధన వ్యయ సర్దుబాటును కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. మిగిలిన మొత్తం ఇతర కేటగిరీ (వ్యవసాయం కాకుండా) వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాలని డిస్కమ్‌లను కమిషన్ ఆదేశించింది.

పెరిగినదానికన్నా తక్కువే..

విద్యుత్ కొనుగోలులో స్థిర చార్జీలు, చర చార్జీలు (బొగ్గు, ఆయిల్, రవాణా, వాటిపై పన్నులు, డ్యూటీలు) ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి. దానికి తోడు బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ ధరలు ప్రస్తుత అధిక డిమాండ్ సీజన్‌లో (ఫిబ్రవరి – జూన్) గరిష్టంగా యూనిట్ రూ.10 వరకు ఉంటున్నాయి. అంటే టారిఫ్ ఉత్తర్వుల్లో అంచనా విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్ రూ.4.30 కన్నా వాస్తవ విద్యుత్ కొనుగోలు ధర అధికంగా ఉంటోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత పరిస్థితుల నడుమ విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. అయినప్పటికీ వినియోగదారులకు అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో బహిరంగ మార్కెట్ నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చింది. దానివల్ల విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్‌కు దాదాపు రూ.1.20 పెరిగింది. నిబంధనలకు లోబడి ప్రతి నెల విద్యుత్ కొనుగోలు వ్యయ సర్దుబాటు తగ్గింపు లేదా పెంపు యూనిట్‌కు రూ.0.40 వరకూ వసూలు చేసుకునేందుకు డిస్కమ్‌లకు అనుమతి ఉంది.

కేంద్రమే చెప్పింది

అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం వార్షిక సర్దుబాటు విధానం స్థానంలో 2021–22 నుంచి త్రైమాసిక సర్దుబాటు విధానం అమలులోకి వచ్చింది. ఈ నిబంధనలకు అనుగుణంగానే ప్రతి త్రైమాసికం పూర్తి కాగానే పంపిణీ సంస్థలు విద్యుత్ కొనుగోలు వ్యయంలో హెచ్చుతగ్గులపై నివేదికలను సమర్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు త్రైమాసిక విద్యుత్ సర్దుబాటు చార్జీల విధానానికి బదులుగా నెలవారీ విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని సర్దుబాటు చేసేలా ఇటీవల ఏపీఈఆర్‌సీ మార్గదర్శకాలు జారీ చేసింది. 2021–22కి సంబంధించి త్రైమాసికం ప్రాతిపదికన ఇంధన విద్యుత్ కొనుగోలు సవరింపు చార్జీలు వసూలు చేస్తుండగా ఏపీఈఆర్‌సీ నియమావళి ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నెల అదనపు విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని జూన్ నెల విద్యుత్ బిల్లులతో కలిపి తీసుకుంటున్నారు.

క్లుప్తంగా...

రాష్ట్రపతితో భేటీకి ఢిల్లీకి గిరిజనులు



విశాఖ రైల్వేస్టేషన్‌లో ఢిల్లీకి బయల్దేరిన గిరిజనులు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానం మేరకు ఆమెతో భేటీ అయ్యేందుకు ఏపీ అటవీ ప్రాంతాల్లో నివసిస్తోన్న పలు తెగలకు చెందిన 180 మంది గిరిజనులు విశాఖ రైల్వేస్టేషన్ నుంచి ఢిల్లీకి బయల్దేరారు. దేశవ్యాప్తంగా అటవీ ప్రాంతాల్లో జీవనం సాగిస్తోన్న 1,500 మందిని రాష్ట్రపతితో భేటీకి ఎంపిక చేశారు. వీరు జూన్ 12న రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతితో భేటీ కానున్నారని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ మిషన్ డైరెక్టర్ రవీంద్రబాబు తెలిపారు. ఏపీలోని అన్ని ఐటీడీఏల నుంచి 180 మంది గిరిజనులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. దేశంలో అభివృద్ధికి దూరంగా దయనీయ స్థితిలో జీవనం సాగిస్తోన్న ఆదిమ జాతి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రపతి వీరిని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు సమాచారం. ఈ సమావేశానికి అల్లూరి సీతారామ రాజు జిల్లా ఐటీడీఏ నుంచి 7 తెగలకు చెందిన 120 మంది, పార్వతీపురం ఐటీడీఏ నుంచి 2 తెగలకు చెందిన 30 మంది, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ నుంచి ఒక తెగకు చెందిన 18 మంది, సీతంపేట ఐటీడీఏ నుండి ఒక తెగకు చెందిన 10 మంది, కేఆర్‌పురం ఐటీడీఏ నుంచి ఒక తెగకు చెందిన ఇద్దరు బయల్దేరారు. వీరంతా శుక్రవారం హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బయలుదేరారు. వీరికోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు 3 ప్రత్యేక బోగీలు ఏర్పాటు చేశారు.

ప్రపంచం చూపంతా ఏపీ వైపే

సచివాలయాల డైరెక్టర్ లక్ష్మీశా



మాట్లాడుతున్న లక్ష్మీశా, చిత్రంలో ఎమ్మెల్యే వసంత

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో ప్రపంచ దేశాలన్నీ ఏపీ వైపు చూస్తున్నాయని గ్రామ సచివాలయాల డైరెక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి పంచాయతీ పరిధిలోని గ్రామ వలంటీర్లకు గొల్లపూడిలోని దత్త కళ్యాణ మండపంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లక్ష్మీశా, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్‌లతో పాటు ఎంపీపీ ప్రసన్నకుమారి, పీడీ సునీత పాల్గొన్నారు. తలశిల రఘురామ్ మాట్లాడుతూ.. వలంటీర్ల వ్యవస్థ రోజు రోజుకు మరింత బాధ్యతాయుతంగా పని చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందచేస్తున్న వలంటీర్లను సత్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. వలంటీర్ల వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ కొత్త ఒరవడిని తీసుకు వచ్చారన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు ఎంత మేలు జరిగిందో దేశం మొత్తం తెలిసిందన్నారు.

జగన్ పాలనలో ధరలు పెరిగాయ్

సిద్ధవటం సభలో లోకేశ్



సిద్ధవటం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచారని టీడీపీ నాయకుడు నారా లోకేశ్ విమర్శించారు. యువగళం పాదయాత్ర శుక్రవారం రాత్రి వైఎస్సార్ జిల్లా సిద్ధవటం చేరింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడుతూ.. బాబాయ్‌ని చంపిన కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేస్తే ఆ వార్త బయటకు రాకుండా ముఖ్యమంత్రి చేశారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి, అవినాష్‌రెడ్డి సొంత బాబాయ్‌నే లేపేశారన్నారు. సొంత తల్లిని, చెల్లిని బయటకు నెట్టేసిన వైఎస్ జగన్ కడపకు ఏమైనా చేస్తారా అన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏమైందని, అన్నమయ్య డ్యామ్ కొట్టుకు పోయినప్పుడు అక్కడి బాధితుల పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. టీడీపీ 5 సంవత్సరాల పాలన, వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల రెండు నెలల పాలనలో ఎవరేం అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం వచ్చిన 3 నెలలకే సీపీఎస్ రద్దు చేస్తామన్నారు. చేతగాని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కలిసి జెడ్పీలో రూ.15 వేల కోట్ల నిధులు స్వాహా చేశారన్నారు. మేడా మల్లికార్జునరెడ్డి నందలూరు మండలం చుట్టూ బినామీల పేర్లతో 1000 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేశారన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాడులో మూడు స్మశానాలను చదును చేసి వందల ఎకరాలను కబ్జా చేశారని ఆరోపించారు.

'బొప్పరాజు వల్ల ఉద్యోగులకు ఏం మేలు జరిగిందో చెప్పాలి'

ఏలూరు(మెట్రో): ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు చేసిన ఉద్యమంతో ఉద్యోగులకు ఏం మేలు జరిగిందో ఉద్యోగవర్గాలకు ఆయన సమాధానం చెప్పాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఏలూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. తాము మూడు నెలలుగా ఉద్యమం చేస్తే ప్రభుత్వం దిగివచ్చి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిందని బొప్పరాజు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరో ఉద్యమం చేస్తే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదని, ఉద్యోగులకు ప్రభుత్వం ఏమి చేయాలో వాటిని ప్రాధాన్యత క్రమంలో చేస్తుందని ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఆయన చెప్పినట్లుగానే జరిగిందని, బొప్పరాజు సాధించిందేమీ లేదని స్పష్టంచేశారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు చేస్తున్న ఉద్యమంలో చిత్తశుద్ధి లేదని, ప్రభుత్వం ఏదైనా ప్రకటిస్తే అది తన గొప్ప అని చెప్పుకోవడం ఆయన నైజమని విమర్శించారు. బొప్పరాజుకు సొంత ప్రయోజనాలు తప్ప ఉద్యోగుల ప్రయోజనాలు ఏమాత్రం పట్టవని ఆరోపించారు.

వేగంగా కదులుతున్న రుతుపవనాలు

- రెండు రోజుల్లో ఏపీకి విస్తరించే అవకాశం
- అప్పటివరకు కొనసాగనున్న ఉష్ణోగ్రతల తీవ్రత
- అరేబియా సముద్రంలో ఏర్పడిన తుపానుతో పెరిగిన ఉష్ణోగ్రతలు
- రోహిణి కార్తె వెళ్లినా ఇంకా తగ్గని సెగలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం : కేరళలోకి ప్రవేశించిన రుతు పవనాలు వేగంగా కదులుతున్నాయి. గత 24 గంటల్లో వాటి గమనంలో వేగం పెరగడంతో రెండు రోజుల్లోనే అవి రాయలసీమను తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కేరళ నుంచి రుతుపవనాలు ఆంధ్రా ప్రాంతానికి రావడానికి సాధారణంగా 4 రోజులు పడుతుంది. ఇప్పుడు ఒకరోజు ముందుగానే అంటే ఆదివారానికి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని చెబుతున్నారు. అరేబియా సముద్రంలో ఏర్పడిన బిపర్‌జోయ్ తుపాను ప్రభావంతో రుతుపవనాలు బంగాళాఖాతంలో శ్రీలంక కింది భాగం నుంచి విస్తరిస్తున్నాయి. 3 రోజుల్లోనే అవి పైభాగానికి వచ్చి శుక్రవారం తమిళనాడు, కర్ణాటక వరకు విస్తరించాయి. వచ్చే రెండు రోజుల్లో ఆంధ్రాకి వచ్చే అవకాశం ఉంది.

నిప్పుల వానలా రాష్ట్రంలో ఎండలు

రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి పూర్తిగా విస్తరించే వరకు ఎండల తీవ్రత కొనసాగనుంది. ఇప్పటికే రాష్ట్రంలో ఎండలు నిప్పుల వానను తలపిస్తున్నాయి. జూన్ రెండో వారం మొదలైనా భానుడి ప్రతాపం కొనసాగుతోంది. రోహిణి కార్తె వెళ్లాక వచ్చే మృగశిర కార్తెతో వాతావరణం చల్లబడుతుంది. కానీ ప్రస్తుతం మృగశిర కార్తె ప్రవేశించినా రోహిణి కార్తె ఎండలనే తలపిస్తోంది. శుక్రవారం రాష్ట్రంలో అనేక జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 43–45 డిగ్రీల వరకు రికార్డయ్యాయి. ఆయా ప్రాంతాల్లో సాధారణంకంటే ఐదారు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో పలుచోట్ల వడగాడ్పులు, మరికొన్ని చోట్ల తీవ్ర వడగాడ్పులు వీచాయి. కోస్తాలో ప్రధానంగా కృష్ణా, గుంటూరు తీరంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వాతావరణం ఎగువ ప్రాంతంలో ఉన్న గాలుల్లో కూడా పొడి శాతం ఎక్కువ ఉంది. దీనివల్లే ఉష్ణోగ్రతలు బాగా ఎక్కువగా ఉంటున్నాయి. ఏప్రిల్‌లో వచ్చిన మోకా తుపాను బంగాళాఖాతంలో ఉన్న తడి గాలులన్నింటినీ లాగేసుకోవడంతో ఉష్ణోగ్రతలు, ఉక్కపోత తీవ్రమయ్యాయి. ఇప్పుడు అరేబియా సముద్రంలో ఏర్పడిన తుపాను వల్ల కొంత వేడి వాతావరణం ఉంటుంది. దీనికితోడు రాజస్థాన్ నుంచి వచ్చే గాలులు కూడా పొడిగానే ఉంటున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి.

శుక్రవారం అన్ని జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలో అత్యధికంగా 45.5 డిగ్రీలు నమోదైంది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల, కాకినాడ జిల్లా కరపలో 45.3, తూర్పు గోదావరి జిల్లా చిట్యాలలో 45.2, అల్లూరి సీతారామరాజు జిల్లా కొండాయిగూడెంలో 45.2 డిగ్రీలు, గుంటూరు జిల్లా జంగమహేశ్వరపురంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

దీవించమ్మ.. చెంగాళమ్మా!

- సుడిమాను ఉత్సవానికి పోటెత్తిన భక్తులు
- అట్టహాసంగా మొదలైన చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు
- పగడాల చీర అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



గంగపెట్టెతో వస్తూ వీరుతాళ్లు ఆడుతున్న యాదవులతో ఎమ్మెల్యే కిలివేటి

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట చెంగాళమ్మ వారి బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజైన శుక్రవారం సాయంత్రం సుళ్లు (సుడిమాను) ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గొల్లల ములువు నుంచి తెచ్చిన వడిబాలు సారె, పూల మాలను సుడిమానుకు పైనున్న పాలవెల్లికి కట్టి భక్తులకు చూపించేందుకు మూడు సార్లు తిప్పారు. ఆ తరువాత రుబ్బు రోలు, మూడోసారి నల్ల మేకపిల్లను కట్టి తిప్పారు. సుడిమాను తిరుగుతున్నపుడు భక్తుల జయజయ ధ్వానాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సుళ్లు ఉత్సవానికి ప్రత్యేకత ఉండటంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తదితరులు సుడిమాను పట్టుకుని తిప్పడంతో ఉత్సవం ప్రారంభమైంది. సుడిమాను తిరుగుతున్నంతసేపు భక్తులు ఆకాశం వైపు చూస్తూ 'అమ్మా చెంగాళమ్మ తల్లీ.. దీవించమ్మా' అంటూ దండాలు పెట్టుకున్నారు. సుడిమానులను తాకేందుకు భక్తులు ఎగబడ్డారు. ఈ సందర్భంగా అమ్మవారు పగడాల చీర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అశ్వవాహనంపై ఊరేగిన చెంగాళమ్మ

శుక్రవారం రాత్రి 9 గంటలకు అశ్వవాహనంపై చెంగాళమ్మ తల్లిని పట్టణంలో ఊరేగించారు. అంతకుముందు మన్నారు పోలూరు, నాదెళ్లవారి కండ్రిగ, గొల్లల ములువు, కోటపోలూరు యాదవులు గంగ పెట్టెను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. వేలాది మంది భక్తుల మధ్య యాదవులు చిందులు వేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చెంగాళమ్మ తిరునాళ్లలో మొదటి మూడు రోజులు ప్రత్యేకంగా సుళ్లు ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. కాళంగి నది సుడిగుండంలో దొరికిన అమ్మవారు స్వయంభువుగా ఇక్కడ వెలిశారని ప్రతీతి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బలిహరణ కార్యక్రమం అనంతరం ఆలయ ఆవరణలో సుడిమాను ప్రతిష్టిస్తారు. సుడిమాను పాలవెల్లికి మొదటిసారి గొల్లలములువు నుంచి వచ్చిన వడిబాలు, రుబ్బురోలు, నల్ల మేకపిల్లను మొదటి రోజున తిప్పుతారు. రెండో రోజైన శనివారం సాయంత్రం ఆ మూడింటితో పాటు అదనంగా రోకలి కట్టి తిప్పుతారు. మూడో రోజున నాలుగింటితో పాటు అదనంగా మనిషి బొమ్మను కట్టి భక్తులందరికీ నమస్కారం చేసిన తరువాత సుళ్లు ఉత్సవం ముగుస్తుంది. పూర్వం రోజుల్లో నిజంగా మనిషిని కట్టి నమస్కారం చేయించే వారు. కాలక్రమేణా వచ్చిన మార్పులతో మనిషి బదులు బొమ్మను ఏర్పాటు చేస్తున్నారు.

నేడు మహిషాసురమర్దన ఉత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మహిషాసుర మర్దన ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనిని ఈ ప్రాంతంలో యుద్ధం అని వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాలుస్తారు.

ప్రీతి కేసులో నిందితుడు సైఫ్‌పై వేటు

- కేఎంసీ నుంచి ఏడాదిపాటు సస్పెన్షన్
- ప్రీతిని ర్యాగింగ్ చేశాడన్న కారణంతో నిర్ణయం

సాక్షి, వరంగల్/ఎంజీఎం: వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రీతిని మానసికంగా హింసించి ఆత్మహత్యకు ప్రేరేపించాడన్న ఆరోపణలపై కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లో సీనియర్ అనస్థీషియా విద్యార్థి డాక్టర్ ఎంఏ సైఫ్ అలీని ఏడాది పాటు సస్పెండ్ చేశారు. ఈ ఏడాది మార్చి నాలుగు నుంచి ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని ప్రిన్సిపల్ డాక్టర్ డి.మోహన్ దాస్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మార్చి 4వ తేదీ నుంచి అనస్థీషియాలజీ పీజీ నుంచి ఏడాదిపాటు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. డాక్టర్ ప్రీతిని ర్యాగింగ్ చేయడం, మానసికంగా హింసించడం వల్లే ఆత్మహత్య చేసుకుందని అర్థం చేసుకోవడంతో పాటు.. విచారణ జరిపిన యాంటీ ర్యాగింగ్ కమిటీ ఈ ప్రతిపాదనలు చేయడంతో సస్పెండ్ చేశామని వివరించారు. ఇప్పటికే జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన సైఫ్ తనను తరగతులకు అనుమతించాలని, తాను నిందితుడా, కాదా అన్నది కోర్టు తేలుస్తుందని కేఎంసీకి కొద్దిరోజుల క్రితమే లేఖ రాశారు. తాజాగా మళ్లీ లేఖ రాయడంతో ఏడాదిపాటు తరగతులకు హాజరుకావొద్దంటూ, సస్పెండ్ చేశారు. డాక్టర్ ఎంఏ సైఫ్ అలీ వేధింపుల వల్లే ఫస్టియర్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య చేసుకుందని మట్టెవాడ పోలీసులు కోర్టుకు బుధవారం సమర్పించిన చార్జిషీట్‌లో పేర్కొనడం తెలిసిందే.

జనసేనను వీడిన నరసప్ప చెరువు గ్రామం

- దాదాపు గ్రామస్తులంతా వైఎస్సార్‌సీపీలోకి
- పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి జోగి రమేష్
- సీఎం జగన్ సంక్షేమ పాలన నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు గ్రామస్తుల వెల్లడి



వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులతో మంత్రి జోగి రమేష్

బంటుమిల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలన ఆ ఊరిని ఆకట్టుకొంది. ఇప్పటివరకు జనసేన పార్టీకి ఏకపక్షంగా మద్దతిచ్చిన ఆ గ్రామస్తులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కృష్ణా జిల్లా బంటుమిల్లి, పెడన మండలాల పరిధిలోని పెదతుమ్మిడి, ఉరిమి పంచాయతీల శివారు గ్రామమైన నరసప్ప చెరువు గ్రామస్తులు దాదాపు అందరూ జనసేనను వీడారు. ఆ పార్టీ నాయకులు మానుకొండ రాంబాబు, మానుకొండ రంగరాజు ఆధ్వర్యంలో 450 మంది జనసేన నాయకులు, కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామానికి వచ్చిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి తామంతా జనసేనను వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా, రైతు సంక్షేమ ప్రభుత్వం నడుస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాలతో మహిళల్లో ఆర్థిక స్వావలంబన కలిగించిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముందుగానే కాలువలకు సాగు నీరు విడుదల చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. అనంతరం గ్రామస్తులు మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి ఎంపీపీ వి.చినబాబు, వైస్ ఎంపీపీ ఒ.చిన్నారిబాబు, జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, ఏఎంసీ వైస్‌చైర్మన్ పి.బాబూరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు టి. శ్రీనివాసరావు, బంటుమిల్లి, పెడన మండలాధ్యక్షులు ఎం.రాజబాబు, కె.నాగబాబు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

దళితులు ఎమ్మెల్యేలు కాకూడదా?

- టీడీపీ అగ్రకులాల గ్రామాల్లోకి రాకూడదంటూ ఆ పార్టీ శ్రేణుల దాడులు
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబు

బంగారుపాళెం(చిత్తూరు జిల్లా): టీడీపీ అగ్రకులాల గ్రామాల్లోకి దళిత ప్రజాప్రతినిధులను రానీయకుండా అడ్డుకుంటూ చంద్రబాబు డైరెక్షన్‌లోనే దాడులు చేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారుపాళెం మండలం మొగిలివారిపల్లెలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ అగ్రకులస్తులు వ్యవహరించిన తీరుపై ఆయన మండిపడ్డారు. శుక్రవారం మొగిలివారిపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తనతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులు వెళ్లినట్లు తెలిపారు. దళితవాడ, మొగిలివారిపల్లె గ్రామాల్లో కార్యక్రమం ముగించుకుని మరో గ్రామానికి వెళ్తుండగా.. టీడీపీ అగ్రకులస్తులు తనను కులం పేరుతో దూషించి, దళితుడు తమ గ్రామానికి రాకూడదంటూ అడ్డుపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని వినాయకుడి గుడిలో టీడీపీ ప్రచార పాటలను పెట్టి.. తమ పార్టీని కించపరిచేలా వారు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. దళిత ఎమ్మెల్యే అగ్రవర్ణాల వారి గ్రామాల్లోకి రాకూడదా? ఎస్సీలు ఎమ్మెల్యే కాకుడదా? అని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామిని కూడా టీడీపీ అగ్రకులస్తులు అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. సీఎం జగన్ ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, టీడీపీ కార్యకర్తలకే ఎక్కువ పథకాలు అందుతున్నాయని చెప్పారు. దళితులందరూ ఏకమై టీడీపీకి గుణపాఠం చెబుతారని ఎంఎస్ బాబు హెచ్చరించారు. తనను కులం పేరుతో దూషించి, అడ్డుకున్న వారిపై జిల్లా ఎస్పీ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బంగారుపాళెంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచ్‌లు తదితరులున్నారు.

'సీమ'కు చేసిన ద్రోహానికి క్షమాపణ చెప్పండి

- లోకేశ్‌ది పాదయాత్ర కాదు.. ఒంటిపూట యాత్ర
- టీడీపీ పాలనలో రాయలసీమ సర్వనాశనమైంది
- ఏ ముఖం పెట్టుకుని 'రాయలసీమ డిక్లరేషన్' అంటున్నారు
- అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి



కడప కార్పొరేషన్ : రాయలసీమకు చేసిన ద్రోహానికి టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ ముక్కును నేలకు రాసి క్షమాపణ కోరాలని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్సార్ జిల్లా కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేశ్ మిడిమిడి జ్ఞానంతో ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదువుతూ ఈవెంట్ మేనేజ్‌మెంట్ తరహాలో యాత్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రజలతో మమేకం కాకుండా 19 గంటలు టెంట్‌లో ఉంటూ, ఐదు గంటలు మాత్రమే బయట తిరుగుతున్నారని, అందులో ఒక గంట సెల్ఫీలకే సరిపోతోందని శ్రీకాంత్ ఎద్దేవా చేశారు. మొత్తం మీద అది పాదయాత్రలా కాకుండా ఒంటిపూట యాత్రలా ఉందన్నారు. కడప పర్యటనలో లోకేశ్ 'రాయలసీమ డిక్లరేషన్' అని మాట్లాడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. గత 27 ఏళ్లలో 14 ఏళ్లు మీ తండ్రి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఇన్నేళ్లలో రాయలసీమకు ఆయన చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశామో చెప్పకుండా, మళ్లీ అధికారమిస్తే చేస్తామని చెప్పడం మోసపూరితమన్నారు. రాయలసీమ ప్రజలను రౌడీలు, గూండాలుగా, ఫ్యాక్షనిస్టులుగా చిత్రీకరించి వారి మనోభావాలు దెబ్బతీశారన్నారు.

ప్రాజెక్టులు పూర్తిచేయకుండా కాలయాపన..

తెలుగుగంగ ప్రాజెక్టును దివంగత ఎన్టీఆర్ చేపడితే వైఎస్సార్ పూర్తిచేశారని శ్రీకాంత్ తెలిపారు. పదేళ్లు సీఎంగా ఉండి హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులను పూర్తిచేయకుండా వాటిని తాగునీటి ప్రాజెక్టులుగా మార్చి, శంకుస్థాపనలతోనే కాలయాపన చేశారన్నారు. వైఎస్సార్ సీఎం అయ్యాకే వాటిని సాగునీటి ప్రాజెక్టులుగా మార్చి పూర్తిచేశారని గుర్తుచేశారు. చంద్రబాబే ఆ ప్రాజెక్టులను పూర్తిచేసి ఉంటే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ప్రకారం నీటి వాటాలు దక్కేవన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని వైఎస్ పెంచుతుంటే కృష్ణా బ్యారేజీపై ధర్నా చేయించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపడుతుంటే దాన్ని వ్యతిరేకిస్తూ ప్రకాశం జిల్లా వారితో లేఖ రాయించారన్నారు. మరోవైపు.. రాయలసీమలో హైకోర్టు పెడతామంటే అడ్డుకుని, ఇప్పుడు హైకోర్టు బెంచ్ పెడతామని చెప్పడం దారుణమన్నారు. ఇన్ని విధాలుగా రాయలసీమకు అన్యాయం చేస్తున్న తండ్రీ కొడుకులు ఏ ముఖం పెట్టుకుని 'రాయలసీమ డిక్లరేషన్' అంటున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజలు మూడుసార్లు అవకాశమిస్తే కుప్పానికి నీళ్లివ్వలేని మీరు రాయలసీమకు ఏం చేస్తారని ప్రశ్నించారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాకే కుప్పంకు రెవెన్యూ డివిజన్ తెచ్చారని, మున్సిపాలిటీగా మార్చారని శ్రీకాంత్ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం ఈ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఉద్యోగులకు పీఆర్‌సీ ఇస్తూ, కాంట్రాక్టు కార్మికులను కూడా పర్మినెంట్ చేస్తున్నారన్నారు. కడప కొప్పర్తి పారిశ్రామిక వాడలో నాలుగేళ్లలో వెయ్యి కోట్ల కేంద్ర నిధుల్ని ఈ ప్రభుత్వం తెచ్చిందన్నారు.

బాబు బాధ్యతారాహిత్యం..

సామాన్యుడికి ఎలా మేలు చేయాలో ఆలోచించకుండా కర్ణాటకలో ఇచ్చిన హామీలను తీసుకొచ్చి మేనిఫెస్టోలో చేర్చారని శ్రీకాంత్ ఎద్దేవా చేశారు. అన్నిదేశాలు, రాష్ట్రాలు జనాభా నియంత్రణకు కృషిచేస్తుంటే చంద్రబాబు మాత్రం బాధ్యతారాహిత్యంగా ఎంతమందినైనా కనండి అంటూ రివర్స్‌లో చెబుతున్నారని మండిపడ్డారు.

వాణిజ్య పన్నుల అధికారుల విచారణ ముగింపు

ఆటోనగర్ (విజయవాడ): వాణిజ్య పన్నుల శాఖ విజయవాడ డివిజన్–1 కార్యాలయం ఇంటెలిజెన్స్ విభాగంలో జీఎస్టీ అధికారులు బి.మెహర్‌కుమార్, డీసీటీవోౖకె సంధ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకటచలపతి, ఆఫీస్ సబార్డినేట్ ఎం.సత్యనారాయణను శుక్రవారం పటమట సీఐ కాశీవిశ్వనాథ్ విచారించారు. వీరిని విచారించేందుకు గడచిన మంగళవారం పటమట పోలీసులు కస్టడీకి తీసుకున్న సంగతి విదితమే. ప్రభుత్వానికి రావాల్సిన జీఎస్టీ విషయంలో సుమారు రూ.50 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు విచారణలో తేలిందని సమాచారం. రాత్రి 7గంటల సమయంలో వీరిని కోర్టులో హాజరుపరిచిన అనంతరం జిల్లా జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

న్యూస్ మేకర్

ఎడారి చిరుత





ప్రపంచంలో అత్యంత కష్టమైన మారథాన్ 'సహారా మారథాన్'. ఆరు రోజుల పాటు సహారా ఎడారిలో 250 కిలోమీటర్లు నడవాలి. ఒక్క ఒయాసిస్సు కూడా తగలని ఈ దారిలో ప్రాణం కూడా పోవచ్చు. ఇంతటి ప్రమాదకరమైన పోటీలో భారతీయ మహిళ మహాశ్వేతా ఘోష్ మొదటిసారి పాల్గొని మారథాన్ పూర్తి చేసింది. ఆమె పరిచయం.

'మారథాన్ దెస్ సేబుల్స్' లేదా 'మారథాన్ ఆఫ్ ది శాండ్స్' లేదా 'సహారా మారథాన్'లో పాల్గొనేవారి ధైర్యం ఏమిటో? మామూలుగా ఎండలో నడవడమే కష్టం. అలాంటిది ఎడారి ఎండలో నడవడం సామాన్యమా? మామూలు నేల మీద ఎక్కువసేపు నడవడం కష్టం. ఇక ఎడారి ఇసుకలో ఎక్కువ సేపు నడవడం సాధ్యమా? 44 ఏళ్ల మహాశ్వేతా ఈ అసాధ్యమైన మారథాన్‌ను పూర్తి చేయగలిగింది. అలా చేసిన తొలి భారతీయ మహిళగా రికార్డు స్థాపించింది. ఏప్రిల్ చివరి వారంలో మొదలయ్యి మే 1న ఈ మారథాన్ పూర్తయ్యింది.

ఎడారిలో సాహసవంతులు

'మారథాన్ ఆఫ్ ది శాండ్స్' 1986 నుంచి మొదలయ్యింది. 1984లో పాట్రిక్ బ్యూయెర్ అనే ఫ్రెంచ్ వ్యక్తి మొరాకోలోని సహారా ఎడారిలో 12 రోజుల పాటు ఒక్కడే 250 కిలోమీటర్లు ప్రయాణించాడు. అతడు ప్రయాణించిన దారిలో ఒక్క ఒయాసిస్సు కూడా లేదు. ఎడారి తండాలు కూడా కనిపించలేదు. అంటే ఈ దారి అల్ట్రా మారథాన్‌కు అనువైనదని భావించి రెండేళ్ల తర్వాత ఈ మారథాన్‌ను మొదలెట్టాడు. అయితే 2009 నాటికిగాని ఇది ఊపందుకోలేదు. ఆ సంవత్సరం వెయ్యి మంది సహారా మారథాన్‌లో పాల్గొన్నారు.

అడుగడుగునా సవాళ్లు

2023లో మారథాన్ ఆఫ్ ది శాండ్స్ ఏప్రిల్ చివరి వారంలో మొదలయ్యింది. భారతదేశం నుంచి మహాశ్వేతా ఘోష్ మాత్రమే హాజరయ్యింది. అనేక దేశాల నుంచి మొత్తం 1200 మంది పోటీదారులు వచ్చారు. 'మా అందరికీ 11 కిలోల బరువున్న బ్యాక్ ప్యాక్ మాత్రమే అనుమతించారు. రోజుకు 12 లీటర్ల నీళ్లు నిర్వాహకులు సప్లై చేశారు. అంతకుమించిన నీరు దొరకవు. ఎవరి ఆహారం వారు తినాలి. మారథాన్‌లో పెద్దగా స్నేహాలు ఏర్పడవు. పోటీ కాబట్టి ఎవరి లక్ష్యంలో వారు నడుస్తుంటారు. ఎడారి దారిలో 40 డిగ్రీల నుంచి 50 డిగ్రీల వరకూ ఉండే ఎండలో నడవడం అంటే మాటలు కాదు. మాకు ప్రతిరోజూ లక్ష్యం ఇస్తారు. అంటే రోజుకు 70 నుంచి 90 కిలోమీటర్ల లక్ష్యానికి చేరుకోవాలి. ఇచ్చిన సమయంలో నిర్దేశిత దూరానికి చేరుకోలేకపోతే అక్కడితో వారు పోటీ నుంచి డిస్‌క్వాలిఫై అయిపోతారు. నేను ఎలాగైనా ఈ మారథాన్ పూర్తి చేయదలిచాను. అందుకే ఏ రోజు కూడా నిర్దేశిత గమ్యాన్ని తప్పలేదు. చాలామంది మధ్యలోనే ఆగిపోయారు' అని తెలిపింది మహాశ్వేతా.

పోహా, ఓట్స్

'నేను మారథాన్ సాగిన ఆరు రోజులు హల్దీరామ్ డీహైడ్రేటెడ్ దాల్ చావల్, రెడీ టు ఈట్ పోహా, న్యూట్రి బార్స్, చాక్‌లెట్లు, డ్రై ఓట్స్ తిన్నాను. తల మీద సోలార్ హ్యాట్, కూలింగ్ గ్లాసెస్, ట్రోలింగ్ స్టిక్స్, భుజాన బ్యాగ్‌తో మన నడక కొనసాగాలి. చివరిరోజు చివరి దశలో పరుగు తీయాలి. ఎండ మన సహనాన్ని పరీక్షిస్తుంది.

డీ-హైడ్రేట్ కాకుండా చూసుకోవాలి. చాలామంది తల మీద నీళ్లు పోసుకుంటారు. అలా పోసుకోవడం వల్ల వేడి ఇంకా పెరుగుతుంది. కేవలం మెడ, ముఖం తడుపుకుంటూ ముందుకు సాగాలి. గుడారంలో రాత్రిపూట విశ్రాంతిలో భాగ్ మిల్కా భాగ్‌లోని స్ఫూర్తిగీతం వినేదాన్ని' అని చెప్పిందామె.

భ్రాంతుల నుంచి

'ఎడారిలో భ్రాంతులు ఎక్కువ. వాటి మాయలో పడ్డామంటే చిక్కుల్లో పడతాం. ఈ ఎడారిలో నీకు ఎప్పటికీ నీళ్లు కనిపించవు. కనిపించే నీళ్లను నమ్మకు అని నా మనసుకు చెప్పుకున్నాను. ఏమంటే చాలాసార్లు ఎండమావులు కనిపిస్తాయి. షూస్‌లో ఇసుక దూరకుండా నడవడం పెద్ద విద్య. ఇన్ని కష్టాలు వద్దా అంతిమంగా యాత్ర ముగిస్తే కలిగే ఆనందం నిజంగా జీవితంలో ఒయాసిస్సులా ఉంటుంది' అందామె నవ్వుతూ.

లూజర్స్ స్ఫూర్తి

'మాది పశ్చిమ బెంగాల్. నేను కాలేజీలో చదివేప్పుడు సన్నబడటానికి నడకను, జాగింగ్‌ను సాధనంగా చేసుకున్నాను. అదే కొనసాగిస్తున్నాను. 2019లో నెట్‌ఫ్లిక్స్‌లోని లూజర్స్ సిరీస్ నాకు మారథాన్ ఆఫ్ శాండ్స్ గురించి తెలియజేసింది. అందులోని ఒక ఎపిసోడ్‌లో ఒలింపిక్ విజేత మౌరో ప్రాస్పెరీ మారథాన్ ఆఫ్ శాండ్స్‌ను ఎలా ముగించాడో వివరంగా చూపించారు. నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. అయితే ఎడారిలో మారథాన్ చాలా కష్టం. అందుకే రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో నాలై నేను 75 కిలోమీటర్ల మారథాన్ సాధన చేసి ఈ అతికష్టమైన ఎడారి మారథాన్‌కు సిద్ధమయ్యాను' అని చెప్పింది మహాశ్వేతా ఘోష్.

నేటి అకేషన్‌కు.. అలనాటి డ్రెస్



పెళ్లిలో పెళ్లికొడుకు కంటే పెళ్లికూతురు ముస్తాబుకి కాస్త ఖర్చు ఎక్కువే. పెళ్లిరోజు ప్రత్యేకంగా కనిపించేందుకు ధరించే డ్రెస్‌ను ఏరికోరి ఎంచుకుని, దానికి మరికొన్ని అదనపు హంగులు జోడించి డ్రెస్‌ను అందంగా రూపొందించుకుని పెళ్లిలో ధరించి మురిసిపోతారు. అయితే ఎంతో తాపత్రయపడి, ఎంతో ఖరీదైన డ్రెస్ వేసుకున్నప్పటికీ పెళ్లి తరువాత ఆ డ్రెస్ బీరువాలకే పరిమితమవుతుంది. జీవితంలో మళ్లీ దానిని ధరించే సందర్భం రాదు, చివరికి తీపి జ్ఞాపకంగా మిగిలిపోవడం తప్ప మరే ప్రయోజనం







కనిపించదు. ఈ నేపథ్యంలో ''ఇంత విలువైన డ్రెస్‌లను ఎందుకు వృథాగా పోనివ్వడం! అప్పుడప్పుడు ఏదైనా అకేషన్స్‌కు వాటిని ధరించండి! ఎంతో హుందాగా ఉంటుంది!'' అని చెబుతున్నారు అమెరికా అమ్మాయిలు. చెప్పడమేగాక తమ వెడ్డింగ్ డ్రెస్‌లు వేసుకుని డిన్నర్ చేసి సోషల్ మీడియా సాక్షిగా మురిసిపోతున్నారు.

టెక్సాస్‌కు చెందిన టెర్రీ బోనిస్‌కు పదకొండు మంది సంతానం. ఐదుగురు కొడుకులు, ఆరుగురు కూతుళ్లు. నెలకొకసారి తన సంతానంతో కలిసి బయటికి వెళ్లి విందు భోజనం చేయడం టెర్రీ ఇంటి సంప్రదాయం. భర్త లేకుండా కూతుళ్లు, కొడుకులు లేకుండా కోడళ్లతో కలిసి టెర్రీ బయట డిన్నర్ చేస్తుంది. అయితే టెర్రీ ఆరుగురు కూతుర్లులో ఒకరైన అలెక్సిస్ హ్యూస్టన్ ఈసారి డిన్నర్‌కు తమ పెళ్లినాటి డ్రెస్‌లు వేసుకోవాలని సూచించింది. ఇది అందరికి నచ్చడంతో టెర్రీ కూతుర్లు.. మెడిలీన్, అలెక్సిస్, అన్నెలీస్, కేట్‌లతోపాటు, కోడళ్లు .. హన్నా జాయ్, సిడ్నీలు తమ పెళ్లినాటి గౌన్లు ధరించారు. అంతా రెడీ అయ్యాక హ్యూస్టన్‌లో డిన్నర్‌కు వెళ్లారు.

ఏడుగురు ఒకే టేబుల్ మీద కూర్చొని రోస్టెడ్ వెజిటేబుల్స్, బర్గర్స్, గ్రెయిన్స్ బౌల్, చికెన్ వెరైటీలతో విందును ఆస్వాదించారు. కార్లను పార్కింగ్ చేసిన దగ్గర నుంచి టేబుల్ మీద డిన్నర్ చేస్తున్నంతవరకు వీరిని చూసిన వారంతా ఆశ్చర్యంగానూ, ఈ ఐడియా బావుందన్నట్లు చూశారు. కొంతమంది వారితో కలిసి ఫోటోలు తీసుకున్నారు. అలెక్సిస్ వెడ్డింగ్ డ్రెస్ డిన్నర్ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడంతో యాభైలక్షల మందికిపైగా నెటిజన్లు చూశారు. వీరి ఐడియాను అభినందిస్తున్నారు. అయితే కూతుర్లు , కోడళ్లకు వారి పెళ్లి నాటి డ్రెస్‌లు పాడవకుండా చక్కగానే ఉన్నాయి. కానీ టెర్రీ పెళ్లిడ్రెస్ మాత్రం పాడైపోయింది. దీంతో ఏం చేయాలి అనుకున్న సమయంలో కేట్ స్కూలు కార్యక్రమంలో వేసుకున్న వెడ్డింగ్ డ్రెస్ టెర్రీకి సరిపోవడంతో కూతుళ్లు, కోడళ్లతో టెర్రీ కూడా డ్రెస్‌తో డిన్నర్ జాయిన్ అయ్యింది.

ఆనందం రెట్టింపు అయ్యింది

"ఖరీదైన వాటిని ఒక్కసారి వాడి పక్కన పెడితే ఏం బావుంటుంది? వాటిని ఇలా వాడితే పెట్టిన డబ్బులకు న్యాయం చేసిన వారమవుతాము. మమ్మల్ని నేరుగా చూసిన వారుగానీ, మా వీడియోచూసిన వారు మమ్మల్ని చాలా మెచ్చుకుంటున్నారు. ఐడియా బావుందని అభినందిస్తున్నారు. డ్రెస్ వేసుకున్నప్పుడు కలిగిన ఆనందం, అందరూ మెచ్చుకున్నప్పుడు రెట్టింపు అయ్యింది" అని టెర్రీ కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తోంది.

ఈ అమ్మాయిల ఐడియా అదుర్స్ కదా! ఇంకెందుకు ఆలస్యం అకేషన్‌ను ప్లాన్ చేసి మీ పెళ్లిబట్టలను పెట్టెలో నుంచి తీసి ధరించి మురిసిపోండి.

---

* వరల్డ్ డాల్ డే



ఆత్మీయులకు బొమ్మలను కానుకగా ఇచ్చినా, వారి నుంచి అందుకున్నా శాంతి, సంతోషాలను రెట్టింపు చేయచ్చు. ప్రపంచంలోని విభిన్న సంస్కృతులను బొమ్మల సేకరణ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ ప్రత్యేకతను తెలియజేయడానికి ప్రతి యేడాది జూన్ రెండవ శనివారం వరల్డ్ డాల్ డే ని జరుపుకుంటున్నారు డాల్ లవర్స్. చేతితో సొంతంగా తయారు చేసుకున్న బొమ్మల నుండి డిజైనర్ బొమ్మల సేకరణ వరకు ఈ డాల్ డే ని ప్రత్యేకంగా జరుపుకోవచ్చు.

బొమ్మలకు ఒక రోజు

మనసుల మధ్య ఆత్మీయతను, ఆనందాన్ని పెంపొందించే బొమ్మలు ఆ ఇంటివారితోనూ అనుబంధాన్ని కలిగి ఉంటాయి.

పంచుకోవడం నేర్పుతాయి

బొమ్మలు స్నేహాన్ని పెంపొందించడానికి సహాయపడతాయి. మూడేళ్లైనా, ముప్పై మూడేళ్ల వయసైనా ఆడుకోవడానికి ఒక బొమ్మ ఉండటం అనేది వ్యక్తి జీవితంలో అద్భుతమైన ఆనందాన్ని నింపుతుంది. పిల్లల స్నేహితుల మధ్య బొమ్మలు ఇచ్చి పుచ్చుకోవడం అనే అలవాటును పెంచితే వారికి ఒకరికొకరు సహాయపడటంలోని ఆనందాన్ని అర్థవంతంగా తెలియజేయవచ్చు. మీరు మీ పిల్లల చేత అనాథాశ్రమానికి బొమ్మలను విరాళంగా ఇప్పించవచ్చు. అక్కడి పిల్లల మోముల్లో చిరునవ్వులను పూయించవచ్చు.

తయారీలో సృజన

ఫ్యాబ్రిక్, స్టఫింగ్, దారాలు.. వేటితోనైనా సరే సొంతంగా బొమ్మను తయారుచేసుకుంటే ఆహ్లాదకరమైన అనుభూతిని పొందవచ్చు. ఇందుకోసం వాడకంలోని మెటీరియల్‌ను ఉపయోగించి, సొంతంగా సృజనాత్మకతను జోడించి బొమ్మలను తయారు చేసుకోవచ్చు. దీనిని పిల్లలతో కలిసి తయారుచేస్తే వారి మెదళ్లకు ప్రతిభను జోడించినవారవుతారు. అద్భుతమైన క్రాఫ్ట్ ఐడియాలు పెరగడానికి బొమ్మల తయారీ ఎంతగానో దోహదం చేస్తుంది.

సేకరణ ఓ మంచి హాబీ

బొమ్మల సేకరణను ఓ హాబీగా అలవాటు చేసుకోవచ్చు. ప్రాచీన, ప్రత్యేకమైన బొమ్మల సేకరణ పట్ల దృష్టి పెట్టవచ్చు. ఇందుకు ప్రాచీన వస్తువులు, బొమ్మలు లభించే షాప్‌లను సందర్శించవచ్చు. టూర్లకు వెళ్లినప్పుడు ఆ ప్రాంతానికి ప్రత్యేకమైన కళాత్మక బొమ్మలను సేకరించవచ్చు.

బొమ్మలకోసం పార్టీ

ఎక్కడెక్కడ నుంచో సేకరించిన, సొంతంగా తయారు చేసుకున్న, అతిథుల నుంచి అందుకున్న బొమ్మలను ఇంట్లో ఓ చోట కొలువుదీర్చి పండగ చేయచ్చు. సాధారణంగా మన పండగల సమయాల్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తుంటాం. అయితే, అందుకు పండగలే అక్కర్లేదు. పుట్టిన రోజు, పెళ్లి రోజు వంటి ప్రత్యేక రోజుల్లో బొమ్మల అలంకరించి, అతిథులను ఆహ్వానించి తమ అభిరుచిని చూపించవచ్చు. అతిథులు కూడా తమకు ఇష్టమైన బొమ్మను తీసుకొచ్చి, మీకు కానుకగా ఇవ్వచ్చు.

తోలుబొమ్మల ప్రదర్శన

అభిరుచిని అంచెలంచెలుగా పెంచుకోవడానికి తోలుబొమ్మ (పప్పెట్రీ)ల ప్రదర్శన ఒక మంచి అవకాశంగా మార్చుకోవచ్చు. మీదైన ఓ సొంత కథను తయారు చేసుకోవచ్చు. లేదా పుస్తకాల్లోని కథల నుంచి ప్రేరణ పొందవచ్చు.

అందమైన డ్రెస్‌ల రూపకల్పన

రంగు రంగుల ఫ్యాబ్రిక్స్‌ను సేకరించి, బొమ్మలకు బట్టలు కుట్టడం మొదలుపెట్టవచ్చు. ముచ్చటైన డ్రెస్సులు, స్వెటర్లు, టోపీలు తయారుచేసి, అలంకరించవచ్చు. జుట్టు అల్లడం మొదలుకొని... ఆభరణాలను అలంకరించడం వరకు బొమ్మతో ఎంత సమయం గడిపినా ఎక్కడా బోర్ అనిపించదు. ఇష్టమైన, అరుదైన, విలువైన బొమ్మల కోసం ఆన్‌లైన్ పోర్టల్స్ శోధించి, ఆర్డర్ మీద తెప్పించుకోవచ్చు. బొమ్మలతో ఆడుకోవడానికి ఇష్టపడే పిల్లలకు మరో బొమ్మను బహుమతిగా ఇచ్చి వారిని ఆశ్చర్యానందనంలో ముంచెత్తవచ్చు.

– నిర్మలారెడ్డి

మనవైన బొమ్మలు



మన తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేకమైన హ్యాండీక్రాఫ్ట్స్ నిర్మల్, బొంతపల్లి, చేర్యాల, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు ఉన్నాయి. ఈ ఉడెన్ టాయ్స్ సేకరణ ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది. పిల్లలు మన హస్తకళల గొప్పతనాన్ని తెలుసుకోవడానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయి. అలాగే, గృహాలంకరణలోనూ ప్రత్యేక ఆకర్షణను నింపుతాయి. పిల్లలకు, పెద్దలకు, అతిథులకు, వేడుకల సమయాల్లో ఈ బొమ్మలను కానుకగా ఇవ్వచ్చు. నేటి పిల్లలు అభిరుచికి తగినట్టు ఈ బొమ్మలు తయారీలో చాలా మార్పులు తీసుకువస్తున్నాం. చేర్యాల బొమ్మలు నేచరల్ ఫైబర్, నేచరల్ కలర్స్‌తో చేస్తారు. ఈ బొమ్మల తయారీకి వర్క్‌షాప్స్ కండక్ట్ చేస్తున్నాం. మనవైన బొమ్మల తయారీని భవిష్యత్తు తరాలకూ అందించేలా ప్రణాళికలు చేస్తున్నాం.



– మండడి శ్రీహరిరెడ్డి, తెలంగాణ స్టేట్ టాయ్స్ ఇండస్ట్రీ నోడల్ ఆఫీసర్, నల్గొండ

వెడ్డింగ్ డాల్స్





నేను ఈ సంప్రదాయ బొమ్మల తయారీ మొదలుపెట్టినప్పుడు అందరూ ఏం గిట్టుబాటు అవుద్ది అన్నవారే. కానీ, టీచర్ ఉద్యోగం చేసే నేను కరోనా టైమ్‌లో స్టార్ట్ చేసిన థీమ్ బేస్డ్ బొమ్మల తయారీ నాకు మంచి గుర్తింపుతో పాటు ఆదాయవనరుగా మారింది. పండగలు, వివాహ వేడుకలను ప్రతిఫలించే బొమ్మలను తయారు చేస్తుంటాను. డాల్‌మేకింగ్ వర్క్‌షాప్స్‌తో బిజినెస్ అవకాశాలూ పెంచుకోవచ్చు. బార్బీ డాల్‌ను మన దేశీయ సంప్రదాయ పద్ధతిలో చూపించడం నేను చేస్తున్న ప్రత్యేకత. దీని వల్ల నాకు మంచి బిజినెస్ పెరుగుతుంది. వీటి నుంచి వివాహ వేడుకలకు సృజనాత్మకత వస్తువుల తయారీ కూడా చేస్తున్నాను.

– దివ్య, డాల్ మేకర్, హైదరాబాద్

కళ

నిరుపమాన నృత్య వైభవం

బెంగళూరుకు చెందిన నిరుపమ రాజేంద్ర నృత్యకౌశలం శాస్త్రీయ నృత్య ప్రేమికులకు మాత్రమే కాదు... నాట్యంలో ఓనమాలు కూడా తెలియని వారినీ ఆకట్టుకుంటుంది. రంగస్థలంపై ఆమె అభినయం, కదలికలు, ఆ ఉత్సాహం 'ఆహా' అనిపించేలా చేస్తాయి. ఎన్నో సంవత్సరాలుగా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న అభినయ డ్యాన్స్ కంపెనీ వారి 'రామకథ విస్మయ' సరికొత్త మెరుపులతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. నిరుపమ నృత్యవైభవం మరోసారి కనులవిందు చేయనుంది...







ఎన్నో దేశాల్లో ఎన్నో అద్భుతమైన షోలు చూసిన తరువాత భారతీయతతో కూడిన అద్భుత కళారూపం గురించి నిరుపమ రాజేంద్ర ఆలోచన చేసింది. ఆ ఆలోచనల్లో నుంచి పుట్టిందే... రామ కథ విస్మయ.

'రామాయణం' ఆధారంగా రూపొందించిన 'రామ కథ విస్మయ' సంగీత నృత్య రూపకం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ పొందింది. దీన్ని 2008లో తొలిసారిగా బెంగళూరులో ప్రదర్శించారు. ఆ తరువాత దేశంలోని ఎన్నో ప్రాంతాలలో ప్రదర్శించారు.

'రామాయణంలో ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. మనుషులు, రాక్షసులు, జంతువులు, మొక్కలు...అనేకం ఉంటాయి. అందుకే మేము ఎంచుకోవడానికి ఇది సరియైన కథ అనిపించింది. మా ఎంపిక సరియైనదేనని ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన నిరూపించింది' అంటుంది నిరుపమ.

తల్లి పిల్లలకు చెప్పే కథాసంవిధానాన్ని అనుసరిస్తూ ఆబాలగోపాలాన్నీ ఆకట్టుకునేలా ఈ నృత్యరూపకాన్ని తీర్చిదిద్దారు. తాజాగా ఈ షో రీవ్యాంప్‌తో ప్రేక్షకుల ముందుకువస్తోంది. ప్రొడక్షన్ కంపెనీలో 70 మంది ఆర్టిస్టులు, 25 మంది బ్యాక్‌స్టేజ్ వర్కర్స్ ఉన్నారు. బంగారు లేడి, రావణుడి తలల విషయంలో ప్రయోగాలు చేశారు. లైటింగ్, కాస్ట్యూమ్స్‌కు సంబంధించి రకరకాల కసరత్తులు చేశారు. మాస్కులు, పెయింటెడ్ స్ట్రీక్స్, ఎల్‌ఈడీ ప్రొజెక్షన్‌ల విషయంలో జాగ్రత్తలు తీసుకున్నారు.

మూడు సంవత్సరాల వయసులో నృత్యానికి దగ్గరైంది నిరుపమ. భరతనాట్యం తరవాత కథక్ నేర్చుకుంది. ఆహార్యంతో అద్దంలో చూసుకున్నప్పుడల్లా తనకు తాను ప్రత్యేకంగా కనిపించేది.

'మా కళారూపాలు భావోద్వేగాలతో కూడుకున్నవి. భాషతో పనిలేదు. అందుకే వాటికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలలో నుంచి ఎన్నో అనుభవాలను మూటగట్టుకున్నాం. చైనాలోని షాంఘైలో షో చేసినప్పుడు అక్కడి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది.

నృత్యం గురించి ఏమీ తెలియని వారు కూడా మనల్ని ప్రశంసించేదే అతి పెద్ద ప్రశంస. బెల్జియంలో ఓ స్పానిష్ తల్లి తన కూతురుతో కలిసి నా షోకు హాజరైంది. షో పూర్తయిన తరువాత మా దగ్గరకు వచ్చి కరచాలనం చేస్తూ ఆ తల్లీబిడ్డలు ఆనంద బాష్పాలు కురిపిస్తూ మా షో గురించి ప్రశంసాపూర్వకంగా మాట్లాడారు. ఇది మరిచిపోలేని అనుభవం' అంటుంది నిరుపమ.

ప్రదర్శనలు ఇచ్చిన చోట 'వాక్ ది టాక్'లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. దీని ద్వారా తమ షోకు సంబంధించి సలహాలు, సూచనలు ప్రేక్షకుల నుంచి కోరుతారు. వాటి ఆధారంగా కంటెంట్‌ను మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దుతారు. ఒక షోకు సంబంధించి స్వదేశం, విదేశాలలో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన సాధించారు.

'స్ఫూర్తి అనేది ఎక్కడి నుంచైనా రావచ్చు' అనేది నిరుపమ చెప్పే మాట.

నిజమే మరి, నిరుపమ నృత్యప్రదర్శనలు యువతరంలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఆమె బాటలో అందంగా అడుగు వేసేలా ప్రేరణ ఇస్తున్నాయి.

మీ కిచెన్ సింక్ ఎంత శుభ్రం?



తెల్లవారి లేచేసరికి ప్రతి ఒక్కరికీ కిచెన్ సింక్‌తో పని వస్తుంది. కాఫీ కప్పులు, టీ కప్పులు మొదలుకొని రకరకాల గిన్నెలు, గరిటలు, వంటపాత్రలు, స్పూన్లు... వంటివాటన్నింటినీ కిచెన్ సింక్‌లో పడేస్తుంటాం. వాటిని సరిగా శుభ్రం చేయక పోతే జిడ్డుపట్టి వాటిపై బ్యాక్టీరియా పేరుకు పోతుంది. దీనివల్ల సింకు దుర్వాసన వెదజల్లుతుంది. అయితే కొన్నిసార్లు సింక్‌లు రసాయన ఉత్పత్తులను ఉపయోగించి కడుగుతారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు. దానిలో వాడే విషపూరిత రసాయనాలు ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. అందువల్ల సింక్‌ను శుభ్రంగా ఉంచడానికి కొన్ని సహజ పరిష్కార మార్గాలు తెలుసుకుందాం.

సింక్‌లో పేరుకుపోయిన నూనె వంటి జిడ్డు పదార్థాలను తొలగించేందుకు వేడినీరు చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది. కాబట్టి వీలయినప్పుడల్లా నాలుగైదు గ్లాసుల నీటిని వేడి చేసి సింక్‌లో పోస్తూ ఉండటం మంచిది. అంతకన్నా ముందు కాస్తంత బ్లీచింగ్ పౌడర్‌ను సింక్‌లో చల్లి, దానిమీద వేడినీటిని పోసి కాసేపు ఆగిన తర్వాత ఏదైనా క్లీనింగ్ బ్రష్‌తో క్లీన్ చేసేస్తే సరి.

సాధ్యమైనంత వరకు ఇల్లూ వళ్లూ పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. చాలా మంది ఇంటిలో ఖరీదైన ఫర్నిచర్‌తో నింపేస్తారు. కిచెన్‌ను కూడా వీలైనంత ఆధునాతనంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తారు. అయితే కిచెన్ సింక్‌ను మాత్రం అంతగా పట్టించుకోరు. దానివల్ల ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది.

వెనిగర్, నిమ్మకాయ



ఒకవేళ సింక్‌ను మరింత బాగా శుభ్రం చేయవలసి వస్తే వెనిగర్, నిమ్మరసం ఉపయోగించాలి. నిమ్మకాయ, వెనిగర్ దుర్గంధాన్ని తొలగించే సహజ ఆమ్లాన్ని కలిగి ఉంటాయి. నిమ్మరసం, వెనిగర్ మిశ్రమాన్ని సింక్‌లో పోసి ఓ అరగంటసేపు అలాగే వదిలేయండి, ఆ తర్వాత నీళ్ళతో శుభ్రం చేస్తే దుర్వాసన వదిలి సింక్ శుభ్రపడుతుంది.

వంట సోడా



ఒకోసారి సింక్ బ్లాక్ అవుతుంటుంది. అలాంటప్పుడు దాదాపు అరకప్పు వరకు బేకింగ్ సోడాను సింక్‌పై చల్లి కాసేపు అలాగే ఉంచి తర్వాత కడిగేస్తే సింక్ బ్లాక్ తొలగి శుభ్ర పడుతుంది. బేకింగ్ సోడాను వివిధ మార్గాల్లో శుభ్రపరచడానికి ఉపయోగించవచ్చు.

వేపాకు



వేపలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి కాబట్టి కొన్ని వేప ఆకులను నీటిలో వేసి మరిగించి ఈ నీటిని సింక్‌లో పోయాలి. తర్వాత, సబ్బు నీటిని ఉపయోగించి సింక్‌ను స్క్రబ్ చేస్తే, అది సింక్‌ను శుభ్రపరుస్తుంది.

సింక్ తోపాటు గిన్నెలను శుభ్రం చేయడానికి వాడే స్క్రబ్బర్‌ను కూడా క్లీన్‌గా ఉంచాలి. ఇందుకోసం గిన్నెలు శుభ్రం చేయడం అయిపోగానే స్క్రబ్బర్‌ను నీటిధార కింద కొన్ని సెకన్ల పాటు ఉంచాలి. తర్వాత దానిని పొడిగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే కంటికి కనిపించని బ్యాక్టీరియా చేరుతుంది.

జంక్ వద్దు



ఆధునిక జీవనశైలి కారణంగా ప్రస్తుతం చాలామంది జంక్ ఫుడ్స్ విచ్చలవిడిగా తింటున్నారు. ఇలా తినడం చాలా ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ... ఎప్పుడు పడితే అప్పుడు జంక్ ఫుడ్ తీసుకోవడం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జంక్ ఫుడ్ ఎక్కువగా లేదా తరచు తినడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు కలుగుతాయో తెలుసుకుందాం.

జంక్ ఫుడ్ లో చెడు కొలెస్ట్రాల్, ఉప్పు పరిమాణాలు అధికంగా ఉంటాయి. కాబట్టి వీటిని తినడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగిపోయి తీవ్ర వ్యాధుల బారిన పడతారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఇలాంటి సమస్యల బారిన పడకుండా ఉండడానికి బయటి తిళ్లకు దూరంగా ఉండడం చాలా మంచిది.

ప్యాక్ చేసిన ఆహార పదార్థాలలో కొవ్వు, నూనె, ఉప్పు ఉండవలసిన వాటికన్నా చాలా ఎక్కువ పాళ్లలో ఉండడంతో పాటు వాటిని నిల్వ ఉంచడానికి వాడే రసాయనాల వల్ల కూడా ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. చిప్స్, స్నాక్స్, బర్గర్‌లు, స్ప్రింగ్ రోల్స్, పిజ్జా వంటి 33 జంక్ ఫుడ్‌లు ఇందులో భాగమేనని, కాబట్టి ఇలాంటి ఆహారాలకు దూరంగా ఉండటం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

ఫాస్ట్‌ఫుడ్ తినడం వల్ల కూడా తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడతారని నిపుణులు చెబుతున్నారు. ఆహార పదార్థాలను నూనెలో అతిగా వేయించడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి. రెగ్యులర్ గా జంక్ ఫుడ్ తినే వారిలో దంతాల సమస్యతోపాటు రక్తపోటు, మలబద్ధకం, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇలాంటి ఆహారాలు తీసుకోవడం కారణంగా ప్రతి సంవత్సరం 8 శాతం మంది తీవ్ర దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని ఒక సర్వేలో తెలిసింది.

గుండె సమస్యలు

జంక్‌ఫుడ్ లో కార్బోహైడ్రేట్ల పరిమాణాలు ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా ఇందులో పీచు పదార్థాలు తక్కువగా ఉండటం వల్ల అరుగుదల సామర్థ్యం లోపించి జీర్ణ సమస్యల బారిన పడతారు. దీని కారణంగా కొలెస్ట్రాల్ పరిమాణాలు పెరిగి రక్తంలో మార్పులు వచ్చి గుండెపోటు బారిన పడే అవకాశాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండడానికి జంక్ ఫుడ్ తినడం మానుకోవాలి. అంతేకాకుండా జీవనశైలిలో మార్పులు చేర్పులు చేసుకోవడమూ అవసరం.

ఆరోగ్యానికి అంజీర్

ఆధునిక జీవన శైలి కారణంగా అనారోగ్య సమస్యలు రాకుండా ప్రస్తుతం చాలామంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రతిరోజు డ్రై ఫ్రూట్స్ తో పాటు ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకుంటున్నారు. ప్రతిరోజు అంజీర్ పండ్లను పాలతో పాటు తీసుకుంటే చాలారకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే పోషక విలువలు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా శరీరాన్ని రక్షిస్తాయి. కాబట్టి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు అంజీర్ పండ్లను తీసుకోవడం మంచిది.



అంజీర్ పండ్లలో ఫ్యాటీ యాసిడ్స్‌తోపాటు విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. డయాబెటిస్ ఉన్న వారు రోజూ ఈ పండ్లను తినడం వల్ల రక్తంలోని చక్కెర పరిమాణాలు నియంత్రణలో ఉంటాయి. అంతేకాకుండా ఇందులో ఉండే పోషకాలు ఇన్సులిన్‌పై కూడా ప్రభావం చూపుతాయి. ఈ డ్రై ఫ్రూట్స్‌లో క్యాల్షియం కూడా అధిక పరిమాణంలో లభిస్తుంది. కాబట్టి ప్రతిరోజు పాలలో నానబెట్టిన అంజీర్‌ను తినడం వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి.

ఊబకాయాన్ని అదుపు చేస్తుంది

అంజీర్ పండ్లలో తక్కువ పరిమాణంలో కేలరీలు లభిస్తాయి. కాబట్టి ఉదయాన్నే అల్పాహారంలో భాగంగా పాలలో నానబెట్టిన అంజీర్‌ని తీసుకోవడం వల్ల అధిక బరువు సమస్యలు దూరమవుతాయి.

ఐరన్ లోపాన్ని తగ్గిస్తుంది

ప్రస్తుతం చాలామంది చిన్న పిల్లలు ఐరన్ లోపం సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి సమస్యలతో బాధపడే వారు ప్రతిరోజు అంజీర్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో అధిక పరిమాణంలో ఐరన్ లభిస్తుంది. కాబట్టి వీటిని తినడం వల్ల సులభంగా ఐరన్ లోపం సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది

అంజీర్ లో విటమిన్లు, పొటాషియం, ఖనిజాలు, కాల్షియం సమృద్ధిగా లభిస్తాయి కాబట్టి వీటిని రోజు తినడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా తీవ్ర అనారోగ్య సమస్యలు దూరం అవుతాయి. అలాగని అంజీర్ అతిగా తీసుకోవడం కూడా మంచిది కాదు. దీనికి వేడి చేసే గుణం ఉండటం వల్ల ఇతర సమస్యలు వస్తాయి.

మీకు తెలుసా

- శరీరంలో వ్యర్థపదార్థాలు పేరుకుపోవడం వల్ల రక్త ప్రసరణలో తీవ్ర ఆటంకాలు కలుగుతాయి. మరికొంతమంది లో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం, ముఖంపై మొటిమలు, చర్మం రంగు మారడం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి ఇలాంటి సమస్యలతో బాధపడేవారు రోజు 8 నుంచి 9 గ్లాసుల నీటిని తాగడంతోపాటు తేలికపాటి వ్యాయామాలు చేయడం వల్ల శరీరంలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలు చెమట రూపంలో బయటికి వస్తాయి.



- ప్రతిరోజు నిమ్మకాయ షర్బత్ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందుతారని.. శరీరంలో పేరుకుపోయిన మలినాలన్నీ బయటికి వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మ షర్బత్‌లో ఉండే విటమిన్ సి చర్మ సమస్యలను దూరం చేసేందుకు సహాయపడుతుంది. ముఖ్యంగా చెడు కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్న వారు నిమ్మకాయ నీటిని తాగడం వల్ల సులభంగా ఉపశమనం లభిస్తుంది.



తరచు వికారం... ఎసిడిటీనా?
బీ12 లోపం కావచ్చు!

ఆధునిక జీవనశైలి కారణంగా చిన్న, పెద్ద తేడా లేకుండా చాలామందిలో విటమిన్ బి12 లోపం ఏర్పడే సమస్యలు వస్తున్నాయి. దీనిమూలంగా చాలామందిలో నాడీ మండల వ్యవస్థ దెబ్బతిని మానసిక అనారోగ్య సమస్యలు కూడా ఏర్పడుతున్నాయి. ఇంకొందరిలో కోపం, అలసట, అజీర్ణం వంటి సమస్యలు వస్తున్నాయి. విటమిన్ బి 12 లోపం కారణంగా వికారంతోపాటు విరేచనాలు, మలబద్ధకం, కడుపులో తిప్పడం, ఎసిడిటీ వంటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

పెద్దవారితో పాటు పిల్లల్లో కూడా విటమిన్ బి12 లోపం ఉంటే రోజు మూడు పూటలా గోరువెచ్చని పాలను తాగాలి. ఇలా రోజూ పాలు తాగడం వల్ల విటమిన్ బి 12 లోపం నుంచి ఉపశమనం లభిస్తుంది. దీనివల్ల శరీరంలో క్యాల్షియం పరిమాణాలు కూడా పెరుగు తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ప్రతిరోజు పాలు తాగడం, పొట్టు తీయని పల్లీలు తినడం ఆరోగ్యానికి మంచిది.

శరీరానికి విటమిన్ బి12 అధిక పరిమాణంలో లభించడానికి పాలతో తయారు చేసిన ఉత్పత్తులను వినియోగించాలి. ఆహారంలో కోడిగుడ్లతో పాటు పాలకూరని తీసుకోవడం కూడా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలసట, చురుకుదనం లోపించడం వంటి సమస్యలతో బాధపడేవారు ప్రతిరోజు ఆహారంలో క్యారెట్‌ని వినియోగించడం మంచిది.

సినిమా



వరుణ్ తేజ్
లావణ్యా త్రిపాఠి

ప్రేమను కనుగొన్నాం

వరుణ్ తేజ్– లావణ్యా త్రిపాఠిల నిశ్చితార్థం శుక్రవారం రాత్రి ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో హైదరాబాద్‌లోని నాగబాబు స్వగృహంలో జరిగింది. ''ప్రేమను కనుగొన్నాను'' అని వరుణ్ తేజ్, ''2016లోనే ఎప్పటికీ నాతో నిలిచిపోయే ప్రేమను కనుగొన్నాను'' అని లావణ్యా త్రిపాఠి తమ నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు. ఈ వేడుకలో చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్, అల్లు అరవింద్, అల్లు అర్జున్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్ తదితరులతో పాటు మెగా, అల్లు కుటుంబాలకు చెందిన పలువురు పాల్గొన్నారు. ఇంకా వివాహ తేదీ ఖరారు కాలేదు. అయితే ఇటలీలో డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకుంటారని సమాచారం. 2016లో 'మిస్టర్' సినిమా షూటింగ్ సమయంలో వరుణ్-లావణ్య ప్రేమలో పడ్డారని ఊహించవచ్చు.

ఈ నెలలోనే మాయాపేటిక



పాయల్

విరాజ్ అశ్విన్, పాయల్ రాజ్‌పుత్, సిమ్రత్ కౌర్, రజత్ రాఘవ్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'మాయా పేటిక'. రమేష్ రాపర్తి దర్శకత్వంలో మాగుంట శరత్ చంద్రా రెడ్డి, తారక్‌నాథ్ బొమ్మిరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. విడుదల తేదీని హీరోయిన్ కీర్తీ సురేష్ ప్రకటించారు. రమేష్ రాపర్తి మాట్లాడుతూ – ''ఓ సెల్ ఫోన్ కథ ఆధారంగా రూపొందించిన చిత్రం ఇది'' అన్నారు. ''కొత్త కథతో 'థ్యాంక్ యూ బ్రదర్' చిత్రాన్ని నిర్మించాం. ఆ సినిమాకి లభించిన ఆదరణతో ఎంతో నమ్మకంతో మరో కొత్త కథాంశంతో 'మాయాపేటిక' చిత్రాన్ని నిర్మించాం'' అన్నారు శరత్ చంద్రా రెడ్డి, తారక్‌నాథ్.


దెయ్యాలు పగబడితే...



రెజీనా

హీరోయిన్ రెజీనా ఓసారి లైబ్రరీకి వెళ్లారు. అక్కడ వందల ఏళ్ల క్రితం నాటి 'కాటుక బొట్టు' అనే బుక్ చదివారు. ఆ బుక్‌లోని పాత్రలు దెయ్యాలుగా మారి రెజీనా ముందుకు వచ్చాయట. ఆ తర్వాత ఏం జరిగింది? దెయ్యాలు ఎవరిపై, ఎందుకు పగబట్టాయి? అనేది తెలుసుకోవాలంటే 'కార్తీక' చిత్రం చూడాల్సిందే. కాజల్ అగర్వాల్, రెజీనా, జననీ అయ్యర్ ప్రధాన పాత్రల్లో, రైజా విల్సన్, నోయిరికా కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కరుంగాపియం'. ఈ మేలో తమిళంలో ఈ చిత్రం విడుదలైంది. ఈ సినిమా తెలుగులో 'కార్తీక' టైటిల్‌తో రిలీజ్ కానుంది. ముత్యాల రామదాసు సమర్పణలో టి. జనార్ధన్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ''తనకు హాని కలిగించిన వ్యక్తులపై దెయ్యంగా మారి పగ తీర్చుకునే పాత్రలో కాజల్ అగర్వాల్ కనిపిస్తారు. అనువాద కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఆగస్టులో పార్టీ



రాజు బొనగాని

క్రిష్ సిద్దిపల్లి, రితికా చక్రవర్తి, ఐశ్వర్యా గౌడ, సుచంద్ర ప్రసాద్, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవ్ పార్టీ'. రాజు బొనగాని స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఇది. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా రాజు బొనగాని మాట్లాడుతూ– ''రేవ్ పార్టీల వల్ల యువతకు ఎలాంటి నష్టం జరుగుతుందో ఈ సినిమాలో చూపిస్తున్నాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆగస్టులో చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం'' అని అన్నారు. ఈ చిత్రానికి సహ–నిర్మాతలు: లక్ష్మీకాంత్ ఎన్ఆర్, జయరామ్ డీఆర్, జీఎస్ సీతారామరాజు, ఎస్. నారాయణస్వామి.

ప్రకృతికి విరుద్ధంగా వెళితే...



అప్సరా రాణి

అప్సరా రాణి ప్రధాన పాత్రలో, అశోక్ కుమార్, అజయ్ ఘోష్, 'ఉగ్రం' మంజు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'తలకోన'. నగేష్ నారదాసి దర్శకత్వంలో స్వప్న శ్రీధర్ రెడ్డి సమర్పణలో దేవర శ్రీధర్ రెడ్డి నిర్మించిన చిత్రం ఇది. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. ''హీరోయిన్, ఆమె స్నేహితులు కలిసి తలకోన ఫారెస్ట్‌కి వెళ్లినప్పుడు ఏం జరిగింది? అనేది కథాంశం. ప్రకృతికి విరుద్ధంగా వెళితే ఎలాంటి పరిణామాలు జరుగుతాయో ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశాం'' అన్నారు నగేష్ నారదాసి.

కేరాఫ్ టెంపుల్

భక్తి రసాత్మక చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. అలాగే కొన్ని కమర్షియల్ చిత్రాల్లో దేవుడి ప్రస్తావన ఉంటుంది. ప్రస్తుతం భక్తి నేపథ్యంలో, దేవాలయాలు ప్రధానాంశంగా కొన్ని చిత్రాలు రానున్నాయి. 'కేరాఫ్ టెంపుల్' అంటూ రానున్న ఆ చిత్రాల్లో కొన్ని 'పాన్ ఇండియా' స్థాయిలో విడుదల కానున్నాయి. మరి.. దేవుడు అంటేనే యూనివర్శల్. అన్ని భాషల వారికీ నచ్చే కథాంశాలతో రానున్న ఈ చిత్రాల గురించి తెలుసుకుందాం.



ప్రభాస్



వైష్ణవ్ తేజ్

ఇటు రామాయణం.. అటు విష్ణుతత్వం

ప్రభాస్ అంటే రెబల్ స్టార్. మాస్ పాత్రల్లోనే దాదాపు చూశాం. అందుకు భిన్నంగా సౌమ్యుడిగా కనిపించనున్నారు ప్రభాస్. 'ఆదిపురుష్'లో రాముడిగా వెండితెరపై కరుణ కూడా కురిపించబోతున్నారు. ఈ పాత్రను ప్రభాస్ ఎగ్జయిటింగ్‌గా చేశారు. ప్రభాస్‌ని రాముడిగా చూడటానికి అభిమానులు, ప్రేక్షకులు అంతే ఎగ్జయిటింగ్‌గా ఉన్నారు. ఓమ్ రౌత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సీతగా కృతీ సనన్ నటించారు. రామాయణ ఇతిహాసం నేపథ్యంలో గుల్షన్ కుమార్, టీ సిరీస్ సమర్పణలో భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓమ్ రౌత్, ప్రసాద్ సుతారియా, రెట్రోఫైల్స్ రాజేష్ నాయర్, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న తెలుగు, హిందీ, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఇక 'ఆదిపురుష్'తో ఓవైపు శ్రీరాముడి గాథని ప్రేక్షకులకు చెబుతున్న ప్రభాస్.. మరోవైపు విష్ణు తత్వాన్ని కూడా బోధించనున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ప్రాజెక్ట్ కె'. బిగ్ బి అమితాబ్ బచ్చన్ ముఖ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకోన్ కథానాయికగా నటిస్తున్నారు. తెలుగులో ఆమెకు ఇదే మొదటి చిత్రం. సైన్స్ ఫిక్షన్‌గా రూపొందుతున్న ఈ చిత్రం విష్ణు తత్వం, విష్ణు ఆధునిక అవతారం నేపథ్యంలో సాగుతుందని నిర్మాత అశ్వినీదత్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. భారీ బడ్జెట్‌తో అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న విడుదల కానుంది.



తేజా సజ్జ

గుడి కోసం రుద్రకాళేశ్వర్ రెడ్డి

రుద్రకాళేశ్వర్ రెడ్డి ఓ గుడి కోసం పెద్ద మైనింగ్ మాఫియాకి ఎదురు తిరుగుతాడు. ఒక సామాన్య కుర్రాడు మాఫియాని ఢీకొనడం అంటే చిన్న విషయం కాదు. మరి గుడిని కాపాడటానికి రుద్ర కాళేశ్వర్ ఏం చేశాడు? అనేది 'ఆదికేశవ'లో చూడాలి. రుద్రకాళేశ్వర్ రెడ్డిగా వైష్ణవ్ తేజ్ నటిస్తున్నారు. మైనింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ఒక ఊర్లో శివుడి గుడి చుట్టూ ఈ చిత్రకథ సాగుతుందని టీజర్ చూస్తే అర్థమవుతుంది. 'ఇంత తవ్వేశారు.. ఆ గుడి జోలికి మాత్రం రాకండయ్యా.. శివుడికి కోపం వస్తే ఊరికి మంచిది కాదు' అంటూ ఆలయ పూజారి చెప్పే డైలాగ్‌ని బట్టి చూస్తే శివుడు, గుడి చుట్టూ ఈ కథ సాగుతుందని స్పష్టమవుతోంది. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, ఎస్. సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూలైలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

భైరవకోనలో ఏం జరిగింది?



సందీప్ కిషన్

సందీప్ కిషన్ నటించిన తాజా చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వర్షా బొల్లమ్మ, కావ్యా థాపర్ హీరోయిన్లు. సూపర్ నేచురల్ ఫ్యాంటసీ, సస్పెన్స్ థ్రిల్లర్, అడ్వెంచరస్ మూవీగా 'ఊరు పేరు భైరవకోన' రూపొందింది. భైరవకోనలోని ఓ గుడి నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుందని తెలుస్తోంది. 'శ్రీ కృష్ణ దేవరాయల కాలంలో చెలామణిలో ఉన్న గరుడ పురాణానికి, ఇప్పటి గరుడ పురాణానికి నాలుగు పేజీలు తగ్గాయి', 'గరుడ పురాణంలో మాయమైపోయిన ఆ నాలుగు పేజీలే ఈ భైరవ కోన' అనే డైలాగ్స్‌తో ఇటీవల ఈ మూవీ టీజర్ విడుదలైంది. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది.

అంజనాద్రి కోసం..

'జాంబిరెడ్డి' వంటి హిట్ మూవీ తర్వాత హీరో తేజా సజ్జ– డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'హను–మాన్'. హనుమంతుని శక్తులను పొందిన హీరో హనుమంతుని జన్మస్థలంగా పేర్కొంటున్న అంజనాద్రి కోసం ఎలా పోరాటం చేశాడు? అనే కథాంశంతో రూపొందిన చిత్రం 'హను–మాన్'. ''ఇండియన్ రియల్ సూపర్ హీరో హనుమంతుడి స్ఫూర్తితో అంజనాద్రి అనే ఊహాత్మక ప్రపంచం నేపథ్యంలో ఈ సినిమా రూపొందింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. అమృతా అయ్యర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్ర చేశారు. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ, మరాఠీ, తమిళం, కన్నడ, మలయాళం, ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది.

ఇవే కాదు.. మరికొన్ని సినిమాలు కూడా పురాణాలు, దేవాలయాలు, ఇతిహాసాల కథలతో రూపొందుతున్నాయి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
223	71
62,626	18,563

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి


విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,303	▲	65
డోజోన్స్	33,875	▲	41
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,562	▽	38
డాక్స్	15,950	▽	40
షాంఘై	3,231	▲	18
నికాయ్	32,265	▽	624

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో	
ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
59,976 ▲	389
బంగారం (99.5 స్వచ్ఛత)	
59,736 ▲	388
వెండి (కిలో)	
73,677 ▲	1,678

అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు బలోపేతం

కీలక చర్యలను నోటిఫై చేసిన ఆర్‌బీఐ



న్యూఢిల్లీ: పట్టణ కోఆపరేటివ్ బ్యాంకుల బలోపేతానికి వీలుగా ఆర్‌బీఐ కీలక చర్యలను ప్రకటించింది. ప్రాధాన్య రంగాలకు నిర్దేశిత శాతం రుణ వితరణ లక్ష్యాన్ని చేరుకునేందుకు మరో రెండేళ్ల గడువు ఇచ్చింది. ఆర్‌బీఐ ప్రకటించిన చర్యలు 1,514 పట్టణ కోపరేటివ్ బ్యాంకుల బలోపేతానికి సాయపడతాయని కేంద్ర సహకార శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. కేంద్ర సహకార, హోం శాఖల మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ విస్తృత చర్చ అనంతరం పట్టణ కోఆపరేటివ్ బ్యాంకులకు సంబంధించి ఈ చర్యలు తీసుకున్నట్టు వివరించింది. పట్టణ కోఆపరేటివ్ బ్యాంకులు ఆర్థికంగా బలమైన, మెరుగైన నిర్వహణకు వీలుగా బోర్డు ఆమోదం పొందిన విధానం అమల్లో పెట్టడం ఈ చర్యల్లో ఒకటిగా ఉంది. వాణిజ్య బ్యాంకుల మాదిరే సాంకేతికంగా రుణాలను పట్టణ కోఆపరేటివ్ బ్యాంకులు సైతం మాఫీ చేయవచ్చు. రుణగ్రహీతలతో పరిష్కారం చేసుకోవచ్చు. ప్రాధాన్య రంగాలకు రుణాలను మంజూరు చేసే విషయంలో 60 శాతం లక్ష్యాన్ని 2023 మార్చి 31 వరకు చేరుకోవాల్సి ఉండగా, మరో ఏడాది గడువు ఇచ్చింది. వాణిజ్య బ్యాంకులకు గ్రామీణ ప్రాంతాల్లోనూ శాఖలు ఉంటాయి. కనుక అవి ప్రాధాన్య రంగాల రుణ వితరణ లక్ష్యాలను అమలు చేయడం సులభంగా ఉంటుంది. కానీ, పట్టణ కోఆపరేటివ్ బ్యాంకులు పట్టణాల్లోనే కార్యకలాపాలు నిర్వహించడం వల్ల ఆర్‌బీఐ ఈ మేరకు వెసులుబాటు కల్పించింది. పరిశ్రమ ఎప్పటి నుంచో చేస్తున్న డిమాండ్ మేరకు.. సమన్వయం కోసం నోడల్ ఆఫీసర్లను కూడా ఆర్‌బీఐ ఇటీవలే నోటిఫై చేసింది.

అధిక మైలేజీతో మారుతీ 'టూర్ హెచ్1'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా టూర్ హెచ్1 పేరుతో సరికొత్త కారును ప్రవేశపెట్టింది. భారత్‌లో అధిక మైలేజీ ఇచ్చే ప్రారంభ స్థాయి కమర్షియల్ హ్యాచ్‌బ్యాక్ ఇదేనని కంపెనీ ప్రకటించింది. మైలేజీ పెట్రోల్ వెర్షన్ లీటరుకు 24.60 కిలోమీటర్లు, సీఎన్‌జీ వేరియంట్ కిలోకు 34.46 కిలోమీటర్లు ఇస్తుందని వెల్లడించింది. ధర రూ.4.8 లక్షల నుంచి ప్రారంభం. సీఎన్‌జీ వేరియంట్ ధర రూ.5.7 లక్షలు.



ఆల్టో కే10 ఆధారంగా టూర్ హెచ్1 రూపొందింది. కె-సిరీస్ 1.0 లీటర్ డ్యూయల్ జెట్ ఇంజిన్ పొందుపరిచారు. రెండు ఎయిర్‌బ్యాగ్స్, ప్రిటెన్షనర్, ఫోర్స్ లిమిటర్‌తో ముందు సీట్ బెల్ట్‌లు, సీట్ బెల్ట్ రిమైండర్, ఇంజిన్ ఇమ్మొబిలైజర్, ఎలక్ట్రానిక్ బ్రేక్‌ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్‌తో యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, స్పీడ్ లిమిటింగ్ సిస్టమ్, రివర్స్ పార్కింగ్ సెన్సార్ వంటి హంగులు జోడించారు.

ఐసీఏఆర్‌తో అమెజాన్ ఒప్పందం

రైతులకు తోడ్పాటు అందించడంపై దృష్టి



న్యూఢిల్లీ: కిసాన్ స్టోర్‌లో నమోదు చేసుకున్న రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడంలోనూ, అధిక దిగుబడులు.. ఆదాయం పొందడంలో తోడ్పాటు అందించడంపై ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ ఇండియా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పరిశోధన సంస్థ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. పుణేలోని ఐసీఏఆర్-కృషి విజ్ఞాన్ కేంద్రంలో సంయుక్తంగా నిర్వహించిన పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఊతంతో తమ భాగస్వామ్యాన్ని మరింతగా విస్తరించినట్లు అమెజాన్ తెలిపింది. ఐసీఏఆర్ డిప్యూటీ జనరల్ యూఎస్ గౌతమ్, అమెజాన్ ఫ్రెష్ సప్లై చెయిన్..కిసాన్ విభాగం ప్రోడక్ట్ లీడర్ సిద్ధార్థ్ టాటా ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కింద ఐసీఏఆర్ అభివృద్ధి చేసే అధునాతన వ్యవసాయ సాంకేతికతలను రైతులకు చేరువ చేసేందుకు ఇరు సంస్థలు కృషి చేస్తాయి. అలాగే, రైతులు తమ ఆదాయాలను పెంచుకునేందుకు ఉపయోగపడే మెరుగైన సాగు విధానాలను కిసాన్ వికాస్ కేంద్రాల్లో (కేవీకే) ప్రదర్శిస్తాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా రైతులు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు కావాల్సిన శిక్షణ, సహాయాన్ని అమెజాన్ అందిస్తుంది. తద్వారా రైతులను నేరుగా వినియోగదారులతో అనుసంధానిస్తుంది. 2021 సెప్టెంబర్‌లో అమెజాన్ తమ ప్లాట్‌ఫామ్‌లో 'కిసాన్ స్టోర్' సెక్షన్‌ను ప్రారంభించింది. ఇందులో షాపింగ్ ద్వారా వ్యవసాయానికి అవసరమైన ముడి వనరులను రైతులు ఇంటి దగ్గరే అందుకోవచ్చు.

షావోమీకి ఈడీ షోకాజ్ నోటీసులు

రూ. 5,551 కోట్ల ఫెమా ఉల్లంఘన

న్యూఢిల్లీ: విదేశీ మారక నిర్వహణ చట్ట (ఫెమా) నిబంధనల ఉల్లంఘనకు గాను చైనా మొబైల్ తయారీ దిగ్గజం షావోమీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రాయల్టీ ముసుగులో అనధికారికంగా రూ. 5,551.27 కోట్ల విలువ చేసే మొత్తాన్ని విదేశాలకు బదలాయించడానికి సంబంధించి ఈడీ ఈ మేరకు చర్యలు తీసుకుంది. సదరు మొత్తాన్ని జప్తు చేస్తూ.. షావోమీ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సమీర్ రావు, మాజీ ఎండీ మను జైన్‌తో పాటు సిటీ బ్యాంక్, హెచ్ఎస్‌బీసీ బ్యాంక్, డాయిష్ బ్యాంక్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.



ఎస్‌బీఐ నిధుల సమీకరణ బాట

రుణ సెక్యూరిటీల జారీతో రూ. 50,000 కోట్లు!



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) రుణ సెక్యూరిటీల జారీ ద్వారా రూ. 50,000 కోట్లు సమీకరించే సన్నాహాల్లో ఉంది. ఇందుకు బ్యాంకు కేంద్ర బోర్డు నిర్ణయించినట్లు ఎస్‌బీఐ తాజాగా పేర్కొంది. రూపాయి లేదా మార్పిడికి వీలయ్యే ఏ ఇతర కరెన్సీలో రుణ సెక్యూరిటీలను జారీ చేసేందుకు అనుమతించినట్లు తెలియజేసింది. ఈ ఆర్థిక సంవత్సరం(2023-24)లో దేశీ లేదా విదేశీ ఇన్వెస్టర్లకు బాండ్ల ప్రైవేట్ ప్లేస్‌మెంట్ చేపట్టనున్నట్లు వివరించింది. కాగా.. గతేడాది(2022-23) చివరి త్రైమాసికంలో ఎస్‌బీఐ కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు 90 శాతం జంప్‌చేసి రూ. 18,094 కోట్లకు చేరిన సంగతి తెలిసిందే. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి 58 శాతం అధికంగా రూ. 50,232 కోట్ల నికర లాభం ఆర్జించింది. వెరసి త్రైమాసిక, వార్షిక లాభాల సాధనలో సరికొత్త రికార్డులకు తెర తీయడం ప్రస్తావనార్హం!

బాండ్ల జారీ వార్తల నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు 1.7% క్షీణించి రూ. 579 వద్ద ముగిసింది.

భారత్ వైపు.. దిగ్గజాల చూపు

- ఈ ఏడాది 24 బ్రాండ్స్ ఎంట్రీ
- దశాబ్దకాలంలో గరిష్టం



న్యూఢిల్లీ: కోవిడ్ అనంతరం లగ్జరీ ఉత్పత్తుల వినియోగం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో అంతర్జాతీయ దిగ్గజాలు భారత్ వైపు దృష్టి సారిస్తున్నాయి. ఈ ఏడాది దాదాపు రెండు డజన్ల సంస్థలు ఎంట్రీ ఇవ్వనున్నాయి. దశాబ్దకాలంలో ఇది గరిష్ట స్థాయి కాగలదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. 2020లో ఒక అంతర్జాతీయ బ్రాండ్ రాగా, 2021లో మూడు, 2022లో 11 సంస్థలు వచ్చాయి. కోవిడ్ మహమ్మారికి ముందు ఏటా దాదాపు 12-15 బ్రాండ్స్ భారత్‌కు వచ్చేవి. కోవిడ్ తర్వాత లగ్జరీ ఉత్పత్తులకు డిమాండ్‌తో గత కొద్ది నెలల్లో వాలెంటినో, మెక్‌లారెన్, బాలెన్సియాగా తదితర బ్రాండ్స్ వచ్చాయి. తాజాగా గ్లోబల్ బ్రాండ్స్‌ను తీసుకురావడంలో ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ (ఏబీఎఫ్ఆర్ఎల్), రిలయన్స్ రిటైల్ తదితర సంస్థలు కీలకంగా ఉంటున్నాయి. దేశీయంగా లగ్జరీ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌ను, ప్రత్యేకంగా ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంను ప్రారంభించే దిశగా ఫ్రెంచ్ దిగ్గజం గ్యాలెరీస్ లాఫేట్‌తో ఏబీఎఫ్ఆర్ఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. అటు చైనీస్ దిగ్గజం షీన్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు రిలయన్స్ రిటైల్ ఒప్పందం కుదుర్చుకుంది.

ఫుడ్.. ఎంటర్‌టైన్‌మెంట్ బ్రాండ్స్ ఆసక్తి..

ఈ ఏడాది దేశీ మార్కెట్లోకి ఎక్కువగా ఫుడ్.. బేవరేజెస్, కొన్ని వినోద రంగ బ్రాండ్స్ ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇటాలియన్ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ రాబర్టో కావలీ, బ్రిటిష్ లగ్జరీ గూడ్స్ బ్రాండ్ డన్‌హిల్, అమెరికాకు చెందిన స్పోర్ట్స్‌వేర్..ఫుట్‌వేర్ రిటైలర్ ఫుట్ లాకర్ మొదలైనవి కూడా భారత మార్కెట్లో కాలుపెట్టే ప్రయత్నాల్లో ఉన్నాయి. వీటికి తోడు ఇటలీకి చెందిన లవాజా..అర్మానీ కెఫె, అమెరికన్ సంస్థ జాంబా, ఆస్ట్రేలియన్ బ్రాండ్ ది కాఫీ క్లబ్ కూడా ఈ ఏడాది ఎంట్రీ ఇచ్చేందుకు చర్చలు జరుపుతున్నాయి. రిటైల్ కార్యకలాపాలకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే 5వ అతి పెద్ద మార్కెట్‌గా ఉంది. పలు బ్రాండ్‌ల రాకతో రిటైల్ స్థలం లీజింగ్ 5.5 - 6 మిలియన్ చ.అ.ల మేర ఉండొచ్చని ప్రాపర్టీ కన్సల్టెన్సీలు అంచనా వేస్తున్నాయి. 2019లో నమోదైన 6.8 మిలియన్ చ.అ. గరిష్ట స్థాయి తర్వాత ఇదే అత్యధికం.

వారాంతాన నష్టాల ముగింపు

- సెన్సెక్స్ నష్టం 223 పాయింట్లు
- 18,600 దిగువకు నిఫ్టీ



ముంబై: రోజంతా లాభనష్టాల మధ్య ట్రేడైన స్టాక్ సూచీలు శుక్రవారం చివరికి నష్టాలతో ముగిశాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(1%)తో ఎఫ్ఎంసీజీ, ఐటీ, టెక్ షేర్లలో అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఉదయం సెన్సెక్స్ 34 పాయింట్ల లాభంతో 62,811 వద్ద, నిఫ్టీ 21 పాయింట్లు పెరిగి 18,656 వద్ద మొదలయ్యాయి. తొలి దశలో సానుకూలంగా ట్రేడైన సూచీలు.., యూరప్ మార్కెట్ల బలహీన ప్రారంభంతో మిడ్ సెషన్ నుంచి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 254 పాయింట్లు నష్టపోయి 62,594 వద్ద, నిఫ్టీ 80 పాయింట్లు క్షీణించి 18,555 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. వారాంతపు రోజు కావడంతో పాటు వచ్చే వారంలో కీలక పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపలేదు. దీంతో ద్వితీయార్థం ఆద్యంతం తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. చివరికి సెన్సెక్స్ 223 పాయింట్లు పతనమై 62,626 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 71 పాయింట్లు క్షీణించి 18,563 వద్ద నిలిచింది. నష్టాల మార్కెట్లోనూ ఇండస్ట్రియల్, టెలికమ్యూనికేషన్, యుటిలిటీస్, క్యాపిటల్ గూడ్స్, విద్యుత్ రంగాల షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు(సీపీపీఐబీ) షేరుకు రూ.1,855 వద్ద 3.30 కోట్ల ఈక్విటీ షేర్ల (1.66 % వాటా)ను ఓపెన్ మార్కెట్ ద్వారా విక్రయించింది. డీల్ విలువ రూ.6,123 కోట్లు. షేరు ధర 1% తగ్గి రూ.1,872 వద్ద క్లోజైంది.
- బ్రోకరేజ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు షేరు టార్గెట్ ధరను పెంచడం జొమాటో షేరురెండుశాతానికి పైగా లాభపడి రూ.77.57 వద్ద స్థిరపడింది.
- తమిళనాడులో ప్లాంట్‌ను ప్రారంభించడంతో గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్ షేరు 20% లాభపడి రూ.476 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

స్వియాటెక్ X ముకోవా

- నేడు ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్
- సాయంత్రం గం. 6:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) రూపంలో కొత్త చాంపియన్ అవతరిస్తుందో... లేక డిఫెండింగ్ చాంపియన్ స్వియాటెక్ (పోలాండ్) టైటిల్ నిలబెట్టుకుంటుందో నేడు తేలిపోతుంది. ప్రపంచ 43వ ర్యాంకర్ ముకోవా కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతుండగా ... ఇప్పటికే రెండుసార్లు (2020, 2022) ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచిన స్వియాటెక్ మూడో టైటిల్‌పై గురి పెట్టింది. నాలుగేళ్ల క్రితం ప్రాగ్ ఓపెన్‌లో వీరిద్దరు తలపడగా... మూడు సెట్లలో స్వియాటెక్‌పై ముకోవా గెలిచింది.






ఎదురులేని జొకోవిచ్

- ప్రపంచ నంబర్‌వన్ అల్కరాజ్‌పై గెలుపు
- కెరీర్‌లో 34వ సారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్‌కు
- ఆదివారం ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సాధిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్ సొంతం



పారిస్: 'ఫైనల్'గా పరిగణించిన సెమీఫైనల్లో సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్ పైచేయి సాధించాడు. ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్)తో శుక్రవారం జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో మూడో సీడ్ జొకోవిచ్ గెలుపొందాడు. 3 గంటల 23 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో జొకోవిచ్ 6-3, 5-7, 6-1, 6-1తో అల్కరాజ్‌ను ఓడించి ఏడోసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఓవరాల్‌గా జొకోవిచ్ కెరీర్‌లో 34వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తుది పోరుకు అర్హత సాధించాడు. 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్‌తో ప్రస్తుతం జొకోవిచ్, రాఫెల్ నాదల్ (స్పెయిన్) సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), కాస్పర్ రూడ్ (నార్వే) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో జొకోవిచ్ తలపడతాడు. జొకోవిచ్ చాంపియన్‌గా నిలిస్తే అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పుతాడు. అంతేకాకుండా ప్రస్తుతం ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న అల్కరాజ్‌ను వెనక్కి నెట్టి జొకోవిచ్ మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంటాడు.


అల్కరాజ్

నిలకడగా ఆడి...

గతంలో అల్కరాజ్‌తో ఒకసారి ఆడి ఓడిపోయిన జొకోవిచ్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మాత్రం ఈ స్పెయిన్ ప్లేయర్‌తో తొలిసారి తలపడ్డాడు. గత ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన 20 ఏళ్ల అల్కరాజ్ కెరీర్‌లో 9వ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడుతుండగా... మరోవైపు జొకోవిచ్‌కు 69 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడిన అనుభవం ఉంది. అనుభవానికి తగ్గట్టే కీలకమైన సెమీఫైనల్లో పోరులో జొకోవిచ్ అద్భుతంగా ఆడాడు. సర్వీస్‌లలో కచ్చితత్వం... తిరుగులేని ఫోర్‌హ్యాండ్ షాట్‌లు.. ఎక్కువ అనవసర తప్పిదాలకు తావివ్వకుండా ఆడిన జొకోవిచ్ మ్యాచ్‌ను శాసించాడు. తొలి సెట్‌లో నాలుగో గేమ్‌లో అల్కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ ఆ తర్వాత తన సర్వీస్‌లను కాపాడుకొని సెట్‌ను 59 నిమిషాల్లో సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో అల్కరాజ్ తేరుకున్నాడు. ఎనిమిదో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 5-3తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే ఆ వెంటనే తొమ్మిదో గేమ్‌లో అల్కరాజ్ తన సర్వీస్‌ను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాడు. కానీ 12వ గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్కరాజ్ 77 నిమిషాల్లో సెట్‌ను నెగ్గాడు. అయితే మూడో సెట్‌లో జొకోవిచ్ ఒక్కసారిగా చెలరేగిపోయాడు. మూడుసార్లు అల్కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 36 నిమిషాల్లో సెట్‌ను నెగ్గాడు. నాలుగో సెట్‌లోనూ జొకోవిచ్ జోరు కొనసాగించి రెండుసార్లు అల్కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 31 నిమిషాల్లో సెట్‌ను గెల్చుకోవడంతోపాటు విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. ఓవరాల్‌గా మ్యాచ్‌లో జొకోవిచ్ ఎనిమిది ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. ఏడుసార్లు అల్కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఈ సెర్బియా స్టార్ తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయాడు. 39 విన్నర్స్ కొట్టి 36 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్ వద్ద 25 పాయింట్లు నెగ్గిన జొకోవిచ్ 25 డ్రాప్ షాట్‌లతో పాయింట్లు గెలిచాడు. మరోవైపు అల్కరాజ్ 35 విన్నర్స్ కొట్టి 50 అనవసర తప్పిదాలు చేశాడు.

అంతరం తగ్గించినా... ఆసీస్‌దే పైచేయి!

- రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 123/4
- ప్రస్తుత ఆధిక్యం 296 పరుగులు
- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 296 ఆలౌట్
- రాణించిన రహానే, శార్దుల్

మూడో రోజు ఆటలో మన బ్యాటింగ్ కుప్పకూలిపోలేదు. ఎదురుదాడికి దిగిన రహానే, శార్దుల్ భాగస్వామ్యం జట్టును కాస్త మెరుగైన స్థితికి చేర్చింది. ఆపై మన బౌలర్లు పట్టుదలగా ఆడి ఆసీస్‌ను నిలువరించగలిగారు. అయినా సరే పూర్తిగా మనదే రోజని చెప్పలేం! తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించిన కంగారూలు దానిని కొనసాగిస్తూ ఓవరాల్ ఆధిక్యాన్ని దాదాపు మూడొందలకు చేర్చారు. మిగిలిన 6 వికెట్లతో ఆ జట్టు శనివారం ఎన్ని పరుగులు చేసి లక్ష్యాన్ని నిర్దేశిస్తుందనేది ఆసక్తికరం. పిచ్ నెమ్మదిస్తుండటంతో ప్రస్తుతానికి ఇంకా మ్యాచ్ ఆస్ట్రేలియాతో చేతిలోనే ఉన్నట్లు!


రహానే

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్ కీలకదశకు చేరింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. లబుషేన్ (118 బంతుల్లో 41 బ్యాటింగ్; 4 ఫోర్లు), గ్రీన్ (7 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉండగా... స్టీవ్ స్మిత్ (47 బంతుల్లో 34; 3 ఫోర్లు) రాణించాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 151/5తో తొలి ఇన్నింగ్స్ ఆట కొనసాగించిన భారత్ 296 పరుగులకు ఆలౌటైంది. అజింక్య రహానే (129 బంతుల్లో 89; 11 ఫోర్లు, 1 సిక్స్), శార్దుల్ ఠాకూర్ (109 బంతుల్లో 51; 6 ఫోర్లు) ఏడో వికెట్‌కు 109 పరుగులు జత చేసి జట్టును ఆదుకున్నారు.

శతక భాగస్వామ్యం...

మూడో రోజు రెండో బంతికే భరత్ (5)ను బోలండ్ బౌల్డ్ చేయడంతో ఆసీస్‌కు శుభారంభం లభించింది. పరిస్థితి చూస్తే భారత్ 200 పరుగులైనా చేయగలుగుతుందా అనిపించింది. అయితే రహానే, శార్దుల్ శతక భాగస్వామ్యం జట్టును గట్టెక్కించింది. ఇద్దరూ ఎక్కడా తగ్గకుండా ధాటిగా ఆడటంతో పరుగులు వేగంగా వచ్చాయి. కమిన్స్ బౌలింగ్‌లో వరుసగా 4, 6 కొట్టి రహానే 92 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొలి సెషన్‌లో ఆసీస్ పేలవ బౌలింగ్‌తో భారత బ్యాటర్ల ఆధిక్యం కొనసాగింది. 22 ఓవర్లలోనే ఏకంగా 4.95 రన్‌రేట్‌తో జట్టు 109 పరుగులు సాధించడం విశేషం. అయితే లంచ్ తర్వాత ఆట ఆసీస్‌వైపు మొగ్గింది. గ్రీన్ అద్భుత క్యాచ్‌కు రహానే వెనుదిరగ్గా, ఉమేశ్ (5) అనుసరించాడు. 108 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన శార్దుల్‌ను ఎట్టకేలకు కమిన్స్ అవుట్ చేయగా, షమీ (13) వికెట్ తీసి స్టార్క్ భారత ఇన్నింగ్స్ ముగించాడు. లంచ్ తర్వాత 9.4 ఓవర్లలోనే ఆసీస్ మిగిలిన 4 వికెట్లు పడగొట్టగలిగింది.

ఆకట్టుకున్న జడేజా...

చేతిలో భారీ ఆధిక్యం ఉన్నా ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ తడబడుతూనే సాగింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బంతులతో ప్రత్యర్థిని నిలువరించారు. వార్నర్ (1), ఖ్వాజా (13) ఆరంభంలోనే వెనుదిరగ్గా... లబుషేన్, స్మిత్ పరిస్థితిని చక్కదిద్దారు. లబుషేన్ ఎక్కువ భాగం డిఫెన్స్‌కే కట్టుబడగా, స్మిత్ కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. అయితే ధాటిగా ఆడే క్రమంలో స్మిత్ ఆడిన చెత్త షాట్ ఒక్కసారిగా పరిస్థితిని మార్చేసింది. జడేజా బౌలింగ్‌లో అనూహ్యంగా గాల్లోకి బంతి లేపి స్మిత్ క్యాచ్ ఇవ్వగా, హెడ్ (18) కూడా విఫలమయ్యాడు. బౌండరీ వద్ద ఉమేశ్ క్యాచ్ వదిలేసినా... తర్వాతి బంతికే జడేజాకు అతను రిటర్న్ క్యాచ్ అందించాడు. అయితే లబుషేన్, గ్రీన్ మరో 7.3 ఓవర్లు జాగ్రత్తగా ఆడారు.



శార్దుల్ సూపర్...

రెండేళ్ల క్రితం ఓవల్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లోనూ అర్ధసెంచరీ చేసిన శార్దుల్ ఈసారీ అదే ప్రదర్శన కనబర్చాడు. ఇన్నింగ్స్ ఆసాంతం అనేక సార్లు బంతి అతని శరీరాన్ని బలంగా తాకినా పట్టుదలగా నిలబడి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కొంత అదృష్టం కూడా అతనికి కలిసొచ్చింది. 'సున్నా' వద్ద అతను ఇచ్చిన కష్టసాధ్యమైన క్యాచ్‌ను ఖ్వాజా వదిలేయగా, 8 పరుగుల వద్ద సునాయాస క్యాచ్‌ను గ్రీన్ నేలపాలు చేశాడు. 36 పరుగుల వద్ద కమిన్స్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూ అయినా అది నోబాల్ కావడంతో బతికిపోయాడు. రహానే 72 పరుగుల వద్ద ఉన్నప్పుడు క్యారీ, వార్నర్ సమన్వయ లోపంతో క్యాచ్ వదిలేశారు. ఈ ఇన్నింగ్స్‌లో రహానే టెస్టుల్లో 5 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. మరోవైపు భారత్ ఇన్నింగ్స్ చివర్లో సిరాజ్ ఎల్బీ కోసం గ్రీన్ అప్పీల్ చేయగా అంపైర్ అవుటిచ్చాడు. సిరాజ్ వెంటనే రివ్యూ కోరినా... అదేమీ పట్టించుకోకుండా ఆసీస్ ఆటగాళ్లంతా ఆలౌట్ అనుకొని మైదానం వీడారు. వార్నర్, ఖాజా ప్యాడ్లు కట్టుకునేందుకు సన్నద్ధమయ్యారు. అయితే రీప్లేలో బంతి బ్యాట్‌కు తగిలినట్లు తేలింది. దాంతో వారంతా వెనక్కి వచ్చారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 469; భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) కమిన్స్ 15; గిల్ (బి) బోలండ్ 13; పుజారా (బి) గ్రీన్ 14; కోహ్లి (సి) స్మిత్ (బి) స్టార్క్ 14; రహానే (సి) గ్రీన్ (బి) కమిన్స్ 89; జడేజా (సి) స్మిత్ (బి) లయన్ 48; భరత్ (బి) బోలండ్ 5; శార్దుల్ (సి) క్యారీ (బి) గ్రీన్ 51; ఉమేశ్ (బి) కమిన్స్ 5; షమీ (సి) క్యారీ (బి) స్టార్క్ 13; సిరాజ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 29; **మొత్తం (69.4 ఓవర్లలో ఆలౌట్) 296. వికెట్ల పతనం**: 1-30, 2-30, 3-50, 4-71, 5-142, 6-152, 7-261, 8-271, 9-294, 10-296. **బౌలింగ్:** స్టార్క్ 13.4-0-71-2, కమిన్స్ 20-2-83-3, బోలండ్ 20-6-59-2, గ్రీన్ 12-1-44-2, లయన్ 4-0-19-1. **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** ఖ్వాజా (సి) భరత్ (బి) ఉమేశ్ 13; వార్నర్ (సి) భరత్ (బి) సిరాజ్ 1; లబుషేన్ (బ్యాటింగ్) 41; స్మిత్ (సి) శార్దుల్ (బి) జడేజా 34; హెడ్ (సి అండ్ బి) జడేజా 18; గ్రీన్ (బ్యాటింగ్) 7; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (44 ఓవర్లలో 4 వికెట్లకు) 123. వికెట్ల పతనం:** 1-2, 2-24, 3-86, 4-111. **బౌలింగ్:** షమీ 10-4-17-0, సిరాజ్ 12-2-41-1, శార్దుల్ 6-1-13-0, ఉమేశ్ 7-1-21-1, జడేజా 9-3-25-2.

భారత్ శుభారంభం

భువనేశ్వర్: ఇంటర్‌కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. మంగోలియాతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత జట్టుకు అబ్దుల్ సమద్ (2వ ని.లో), లాలియన్‌జువాలా చాంగ్టె (14వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. సోమవారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో వనౌతు జట్టుతో భారత్ ఆడుతుంది.

మొబైల్‌లో 'ప్రపంచకప్' ఉచితం!

డిస్నీ-హాట్‌స్టార్ కొత్త ఆఫర్

న్యూఢిల్లీ: క్రీడా ప్రసారాల్లో అగ్రగామిగా వెలుగొందుతున్న 'డిస్నీ-స్టార్' గ్రూప్‌నకు ఇటీవల ఐపీఎల్ క్రికెట్ టోర్నీతో భారీ షాక్ తగిలింది. ఐపీఎల్ మొబైల్ ప్రసారాల హక్కులు దక్కించుకున్న 'జియో' సంస్థ ఉచితంగా మ్యాచ్‌లు చూసే అవకాశం కల్పించింది. దాంతో పెద్ద సంఖ్యలో జియో సబ్‌స్క్రైబర్లు పెరిగిపోగా, 'హాట్‌స్టార్'కు ఫ్యాన్స్ దూరమయ్యారు. దాంతో మళ్లీ అభిమానులకు చేరువయ్యేందుకు వాల్ట్ డిస్నీ సంస్థ కొత్త ఆలోచనతో ముందుకు వస్తోంది. ఈ ఏడాది జరిగే ఆసియా కప్, వన్డే ప్రపంచకప్‌లను మొబైల్ ఫోన్‌ల లో ఉచితంగా స్ట్రీమింగ్ చేయాలని నిర్ణయించింది. కేవలం యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు... రుసుము చెల్లించకుండా ప్రపంచ కప్ మ్యాచ్‌లను వీక్షించవచ్చు.

రన్నరప్ స్నేహిత్



సాక్షి, హైదరాబాద్: జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో తెలంగాణ ప్లేయర్ ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్ రన్నరప్‌గా నిలిచాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో స్నేహిత్ 11-5, 11-13, 11-8, 11-8, 3-11, 4-11, 10-12తో మానవ్ ఠక్కర్ (పీఎస్‌పీబీ) చేతిలో ఓడిపోయాడు.

యూనియన్ బ్యాంకులో రిజిస్ట్రేషన్, యూజర్ ఫీజులు

- స్టాంప్ పేపర్లు కూడా విక్రయం
- ఇప్పటి వరకు ఎస్‌బీఐ ట్రెజరీ బ్యాంకుల్లోనే ఈ అవకాశం
- నేటి నుంచి రాష్ట్రంలోని 120 యూబీఐ శాఖల్లో ఈ సేవలు
- ఈ స్టాంప్ పేపర్ ఆధారంగా రిజిస్ట్రేషన్లకు అవకాశం
- స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్‌తో యూబీఐ ఒప్పందం

సాక్షి, అమరావతి: ఆస్తుల రిజిస్ట్రేషన్ ఫీజులు, అన్ని రకాల యూజర్ చార్జీలను ఇకపై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) లోనూ చెల్లించొచ్చు. అన్ని రకాల స్టాంప్ పేపర్లు కూడా ఈ బ్యాంకు శాఖల్లో లభిస్తాయి. ఇప్పటివరకు ఈ సేవలు ఎస్‌బీఐ ట్రెజరీ బ్యాంకుల్లోనే ఉన్నాయి. శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూబీఐ శాఖల్లో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. బ్యాంకులో ఇచ్చే ఈ స్టాంప్ పేపర్ ఆధారంగా రాష్ట్రంలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలను నిర్వహించుకోవచ్చు. ఈ మేరకు స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో యూబీఐ శుక్రవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ రీజనల్ మేనేజర్ సత్యేంద్రకుమార్ తివారీ, యూబీఐ స్టేట్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ నవనీత్ కుమార్‌ల మధ్య విజయవాడలో ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో యూబీఐ ఉన్నతాధికారులు మురళీపార్థసారథి, శారదామూర్తి, పీవీజేఎస్ మూర్తి పాల్గొన్నారు. రాష్ట్రంలోని 120 యూబీఐ బ్రాంచ్‌లలో శనివారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని యూబీఐ ఎఫ్‌జీఎం నవనీత్ కుమార్ వివరించారు.

విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



ఐటీబీఐ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

గుంటూరు రూరల్: దేశ భవిష్యత్తు విద్యార్థుల పైనే ఆధారపడి ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో 8వ గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఇష్టమైన పని కష్టపడి చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మనం విజ్ఞానం వైపు వెళ్లాలని తెలిపారు. డబ్బు వెనుక సరస్వతి రాదని, సరస్వతి వెనుక డబ్బు వస్తుందన్నారు. మాతృభాషను మర్చిపోవద్దని, దేశంలో 14 ఇంజినీరింగ్ కళాశాలల్లో మాతృ భాష రాబోతుందని చెప్పారు. అనంతరం 2019–23 సంవత్సరంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న 1,177 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా బిజినెస్ ఇంక్యూబేటర్‌ను ప్రారంభించారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే రోడ్డుపై నిలబెడతా

టీడీపీ నాయకులకు కోడెల కుమారుడు శివరాం హెచ్చరిక



సత్తెనపల్లి: మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావును, ఆయన కుటుంబాన్ని అవమానించేలా టీడీపీ నాయకులు పిచ్చి ప్రేలాపనలు చేస్తే సహించబోమని, బట్టలూడదీసి నడి రోడ్డుపై నిలబెడతానని ఆయన కుమారుడు, డాక్టర్ కోడెల శివరాం హెచ్చరించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని కోడెల కార్యాలయంలో శివరాం శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కోడెల విగ్రహావిష్కరణల సందర్భంగా తప్పుడు ఆరోపణలు చేసేందుకు, ఇబ్బందులకు గురిచేసేందుకు టీడీపీలోని కొందరు కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. తమ కుటుంబం మీద తప్పుడు ఆరోపణలు చేసే వారంతా ఒళ్లు జాగ్రత్తగా పెట్టుకోవాలని, ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారికి దమ్ముంటే, ఆధారాలు ఉంటే పోలీసు కేసు పెట్టాలని అన్నారు. వారు ఎవరి అండదండలతో ఇదంతా చేస్తున్నారని ప్రశ్నించారు. నిరంతరం సేవ చేసిన కోడెలకు పార్టీలో అవమానాలు జరుగుతున్నా పార్టీ మీద గౌరవంతో ఇంతకాలం నోరు జారలేదన్నారు. కోడెల కార్యాలయం నుంచి కార్యక్రమాలు జరపకూడదని, ఆయన పేరే తలవకూడదని, నివాళులు అర్పించకూడదంటూ అనేక అవమానాలకు గురి చేసినప్పుడు బాధ్యత గల పార్టీ కార్యకర్తగా ఇటీవల పార్టీ కార్యక్రమంలో ప్రశ్నించానన్నారు. సత్తెనపల్లిలో టీడీపీ ప్రభుత్వ కార్యక్రమాలన్నీ ఒకప్పుడు కోడెల కార్యాలయం నుంచే జరిగేవన్నారు. ప్రభుత్వం మారిన తరువాత కోడెల కార్యాలయం నుంచి కార్యకలాపాలు జరగకూడదని, నియోజకవర్గంలో ఎన్టీఆర్ భవన్ నుంచే జరపాలని అచ్చెన్నాయుడు ఉత్తర్వులిచ్చారని చెప్పారు. ఈరోజు ఎన్టీఆర్ భవన్ నుంచే పార్టీ కార్యక్రమాలు జరుగుతున్నాయా అన్న విషయం అచ్చెన్నాయుడు గమనించాలన్నారు. గురువారం రాత్రి జరిగిన కోడెల విగ్రహావిష్కరణకు జీవీ ఆంజనేయులును కూడా పిలిచామని, వస్తానని మాట ఇచ్చి రాకపోవడం బాధాకరమన్నారు.

ఉచితంగా అల్ట్రా, టిఫా స్కానింగ్

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు ప్రారంభం

- ప్రభుత్వ నిర్ణయం వల్ల గర్భిణులకు ఎంతో మేలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



గర్భిణితో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

గుంటూరుమెడికల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో గర్భిణులకు అల్ట్రాసౌండ్, టిఫా స్కానింగ్ సేవలు ఉచితంగా అందిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గర్భిణులకు ఎంతో ముఖ్యమైన అల్ట్రాసౌండ్, టిఫా స్కానింగ్‌లను కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సేవలను మంత్రి రజిని శుక్రవారం గుంటూరులోని వేదాంతం హాస్పిటల్‌లో లాంఛనంగా ప్రారంభించారు. గర్భిణులకు సీమంతం చేసి పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏటా 64వేల మందికిపైగా టిఫా స్కానింగ్ అవసరం ఉంటుందని, అందుకు దాదాపు రూ.7 కోట్ల ఖర్చవుతుందని, ఆ మొత్తాన్ని ఇకపై ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ ప్రతి గర్భిణికి రెండుసార్లు చేయాల్సి ఉంటుందని, వీటిని కూడా పూర్తి ఉచితంగా ఆరోగ్యశ్రీ ద్వారా చేసేలా సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ ద్వారా 2022–23లో రూ.3,400 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. 2022–23లో ఆరోగ్యశ్రీ కింద 2.32 లక్షల కాన్పులు ఉచితంగా చేశామని, కేవలం గర్భిణుల చికిత్సకు రూ.247 కోట్లు వెచ్చించామని వివరించారు. ఆరోగ్య ఆసరా పథకం కింద రోగి కోలుకునే సమయంలో ప్రభుత్వం ఆర్థిక భరోసాను కల్పిస్తోందని చెప్పారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 17,54,000 మందికి పైగా ఆర్థిక ఆసరా అమలు చేశామని, అందుకోసం రూ.1,075 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంధిరప్రసాద్, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, వేదాంత హాస్పిటల్ ఎండీ డాక్టర్ చింతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కేవీవై, కృషోన్నతి యోజన కింద
రూ.1,336 కోట్ల ప్రణాళిక అమలు

సీఎస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్రానికి పంపే ప్రతిపాదనలకు ఆమోదం

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ కృషి వికాస యోజన(ఆర్‌కేవీవై), కృషోన్నతి యోజన కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి కేంద్రానికి సమర్పించాల్సిన ప్రతిపాదనలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశం ఆమోదం తెలిపింది. ఈ రెండు పథకాల కింద మొత్తం రూ.1,336 కోట్ల వ్యయానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికకు ఆమోదం తెలిపారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, ఆ శాఖ కమిషనర్ సి.హరికిరణ్, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి గణేష్‌సింగ్, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు ఇందులో పాల్గొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధరంగాల్లో పంటల సాగు, ఉత్పత్తి పెంచడం, యాంత్రీకరణను మెరుగుపరచటం, ఉద్యాన పంటల అభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్రీయ కృషి వికాస యోజన, కృషోన్నతి యోజన కింద నిధుల మంజూరు ప్రతిపాదనలను సీఎస్ ఆమోదించారు. ఆర్‌కేవీవై కింద కిసాన్ డ్రోన్ టెక్నాలజీ ప్రోత్సాహం, రైతులకు వ్యక్తిగతంగా రాయితీపై స్ప్రేయర్లు అందించడం, భూసార పరిరక్షణ ప్రణాళిక, వర్షాధారిత ప్రాంత అభివృద్ధి, బిందు సేద్యం, పొగాకుకు బదులుగా అపరాలు, నూనె గింజలసాగు పెంచడం తదితర కార్యక్రమాల అమలుకు రూ.676 కోట్ల ప్రణాళికను ఆమోదించారు. ఏపీ మార్క్‌ఫెడ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన శాఖ, పట్టుపరిశ్రమ శాఖ, సీడ్ సర్టిఫికేషన్, డెయిరీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల అమలు కోసం రూ.179.82 కోట్ల ప్రణాళికను, కృషోన్నతి కింద రూ.480 కోట్ల ప్రణాళికను ఆమోదించారు. ఈ పథకం కింద జాతీయ ఆహార భద్రత పథకం, జాతీయ నూనె గింజల పథకం, వ్యవసాయ విస్తరణ, ఆయిల్ పామ్, సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం తదితర ప్రణాళికలను అమలు చేస్తారు.

హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నకిలీ సంస్థ

- ఆ సంస్థతో పాఠశాల విద్యాశాఖకు ఎలాంటి సంబంధం లేదు
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్

సాక్షి, అమరావతి: హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ అసోసియేషన్‌కు, పాఠశాల విద్యాశాఖకు ఎటువంటి సంబంధం లేదని ఆ శాఖ కమిషనర్ సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పేరుతో కొందరు వ్యక్తులు రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రచారం చేస్తున్నారని, నిరుద్యోగ యువత వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ తరహా మోసపూరిత కార్యకలాపాలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. రాష్ట్రంలో కొన్ని అనధికార సంస్థలు స్కౌట్స్ అండ్ గైడ్స్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం గుర్తించిన ఒకే ఒక్క సంస్థ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అని, ఈ సంస్థ న్యూఢిల్లీలోని నేషనల్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉందని తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ గర్ల్ గైడ్స్ అండ్ గర్ల్ స్కౌట్స్ కూడా రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ అసోసియేషన్ అనేది నకిలీ సంస్థ అని, రాష్ట్రంలో కార్యకలాపాలు కొనసాగించేందుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వంలోని ఏ ఇతర కార్యాలయాలు ఆ సంస్థకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ఆయన స్పష్టంచేశారు.

మామిడి రైతులకు సర్కారు బాసట

టన్ను కాయలకు కనీస ధర రూ.15,500	పక్వానికి వచ్చిన తర్వాతే కోతలు	ఫలితంగా ధరల్లో స్థిరత్వం.. క్రమంగా పెరుగుదల



సాక్షి, చిత్తూరు

చిత్తూరు జిల్లాలో మామిడి కోత దశలో ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,08,428 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. సుమారు 5,86,563 టన్నుల మామిడి కాయలు దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో తోతాపురి రకం 4 లక్షల టన్నులు, బేనీషా 29 వేల టన్నులు, నీలం 42 వేల టన్నులు, మల్లిక, కాలేపాడు, ఇమామ్ పసంద్, పులిహోర, జవేరి వంటి రకాల పంటలు 15 వేల టన్నులు దిగుబడి అంచనా వేశారు.

'అకాల' నష్టాల నుంచి గట్టెక్కించేలా..

మామిడి సీజన్ ప్రారంభమైన తర్వాత ఇటీవల అకాల వర్షాలు కురిశాయి. గాలి, వానకు భారీ స్థాయిలో మామిడి కాయలు నేలరాలాయి. ఇది పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. వర్షాల వల్ల మామిడి కాయలపై మంగు మచ్చలు ఏర్పడ్డాయి. ఈ కారణాల వల్ల రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం బాసటగా నిలవాలని నిర్ణయించింది. జిల్లా యంత్రాంగాన్ని రంగంలోకి దింపి రైతుల పెట్టుబడికి తగిన విధంగా రాబడి వచ్చే చర్యలు చేపట్టింది. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే మామిడి పండ్లను కొనుగోలు చేయాలని ప్రాసెసింగ్ యూనిట్ల యాజమాన్యాలకు ఆదేశాలిచ్చింది. మరోవైపు పంట పక్వానికి రాకపోవడం, ఒకేసారి మొత్తం పంట కోయటం వల్ల మద్దతు ధర రాదనే విషయాన్ని రైతులకు తెలియజేసింది. దీంతో ఎక్కువ శాతం మంది రైతులు అప్రమత్తమయ్యారు. దశలవారీగా పక్వానికి వచ్చిన పంటను మాత్రమే కోసి ప్రాసెసింగ్ యూనిట్లకు తరలిస్తున్నారు. అధికారులు పంట కోత పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ధరలపై నిర్ణయం తీసుకుంటోంది. క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేస్తూ ఇటు రైతులు, అటు వ్యాపారస్తుల మన్ననలు అందుకుంటోంది.

కలెక్టర్ నేతృత్వంలో మద్దతు ధర

రైతులు ఏమాత్రం నష్టపోకుండా జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ పకడ్బందీ చర్యలు చేపట్టారు. రైతులు నష్టపోకుండా మామిడికి మద్దతు ధర ప్రకటించారు. సీజన్ ప్రారంభం నుంచి కలెక్టర్ నేతృత్వంలో రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి సమీక్షిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మామిడి కాయల్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 34 మామిడి గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల ద్వారా ఉత్పత్తి అయిన గుజ్జును ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. తోతాపురి రకం మామిడి మొత్తం గుజ్జు పరిశ్రమలకే ఉపయోగిస్తారు. ఈ గుజ్జు జిల్లాలో 7.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది.

మేలు జరుగుతోంది



టన్నుకు రూ.15,500తో మామిడి కొనుగోలు చేయాలని కలెక్టర్ తీసుకున్న నిర్ణయం వల్ల రైతులకు మేలు కలుగుతుంది. ఇప్పటివరకు రకరకాల ధరలతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కలెక్టర్ నిర్ణయించిన ధరను మామిడి వ్యాపారులు అమలు చేసేలా చర్యలు తీసుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుంది.

– సుబ్రహ్మణ్యం, వెలుతురు చేను, బంగారుపాలెం మండలం

ఆనందంగా ఉంది



నాకు 5 ఎకరాల మామిడి తోట ఉంది. ధరలు లేకపోవడంతో ఏం చేయలో తెలియక కాయలు కోయ లేదు. గాలి వానకు కాయలు రాలిపోతున్నాయి. ఇలాంటి సమయంలో కలెక్టర్ రంగంలోకి దిగి మామిడి ధర కిలో రూ.15.50గా నిర్ణయించడం చాలా ఆనందదాయకంగా ఉంది.

– శరత్‌కుమార్, మల్లారెడ్డి కండ్రిగ, విజయపురం మండలం

ఇరువర్గాల అంగీకారంతో మద్దతు ధర



రైతులు, కొనుగోలుదారుల అంగీకారంతోనే మామిడికి మద్దతు ధర ప్రకటిస్తున్నాం. ప్రస్తుతం కిలో రూ.15.50గా నిర్ణయించాం. ఇది జూన్ 11వతేదీ వరకు అమల్లో ఉంటుంది. ఆ తర్వాత మద్దతు ధర ప్రకటిస్తాం. పక్వానికి వచ్చిన పండ్లనుమాత్రమే దశలవారీగా కోయాలి. పంట మొత్తం ఒకేసారి ప్రాసెసింగ్ యూనిట్ల వద్దకు తీసుకు వెళ్లొద్దు. ఈ విషయంలో రైతులు సంయమనం పాటిస్తే మద్దత ధర లభిస్తుంది.

– సగిలి షణ్మోహన్, కలెక్టర్

'ఉద్యోగులకు' తక్కువ ధరకే ఎలక్ట్రిక్ స్కూటర్లు

నెడ్‌క్యాప్‌తో అవేరా ఎలక్ట్రిక్ ఒప్పందం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు తక్కువ ధరకే ఎలక్ట్రిక్ స్కూటర్లను అందించడానికి రాష్ట్రానికి చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ అవేరా ముందుకొచ్చింది. ఈ మేరకు నెడ్‌క్యాప్‌తో అవేరా ఒప్పందం కుదుర్చుకుంది. శుక్రవారం నెడ్‌క్యాప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ఎండీ రమణా రెడ్డి, అవేరా ఫౌండర్ సీఈవో వెంకట రమణలు ఒప్పందం పత్రాలను మార్చుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీఎం వైఎస్ జగన్ 'గ్రీన్ ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రత్యేక ధరలకు అందించే విధంగా ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం అవేరా రెటోరోసా–2 స్కూటర్‌పై రూ.10,000, రెటోరోసా లైట్ వాహనంపై రూ.5,000 వరకు ప్రత్యేక తగ్గింపు ఇవ్వనున్నట్లు వెంకట రమణ తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం 7,000 వాహనాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

30% మందికి బీపీ.. 9.9% మందికి షుగర్

దీర్ఘకాలిక వ్యాధుల బారిన తెలుగు రాష్ట్రాల ప్రజలు

- ఐసీఎంఆర్ సర్వే వివరాలు వెల్లడించిన లాన్సెట్ జర్నల్
- రెండు రాష్ట్రాల్లోనూ 25 శాతం కంటే ఎక్కువగా ఊబకాయులు
- దేశవ్యాప్తంగా 11.4 శాతం మందికి డయాబెటిస్
- గోవాలో అత్యధికంగా 26 శాతం మందికి..యూపీలో అతి తక్కువగా 4.8 శాతం మందికి

సాక్షి, హైదరాబాద్: అధిక రక్తపోటు (హైబీపీ), మధుమేహం (డయాబెటిస్/షుగర్) తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్నాయి. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ..తద్వారా జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు, ఇతర కారణాలతో ఎక్కువ సంఖ్యలో ప్రజలు బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. 30 శాతం మంది హైబీపీతో బాధపడుతుండగా, 9.9 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నట్లు అధ్యయనం వెల్లడించింది. దేశంలో డయాబెటిస్, బీపీ, కొలెస్ట్రాల్ వంటి వాటిపై భారత వైద్య పరిశోధన సంస్థ (ఐసీఎంఆర్) అధ్యయనం చేసింది. 31 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 20 ఏళ్లకు పైబడిన వారిపై సర్వే జరిపింది. జనాభా, ప్రాంతాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఈ అధ్యయనం జరిగింది. దేశవ్యాప్తంగా 1.13 లక్షల మందిని సర్వే చేశారు. అందులో 79,506 మంది గ్రామీణులు, పట్టణాల్లో 33,537 మంది పట్టణ ప్రాంత ప్రజల (మొత్తం 1.13 లక్షల మంది) ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. 2008 అక్టోబర్ 18 నుంచి 2020 డిసెంబర్ 17 వరకు ఐదు దశల్లో రాష్ట్రాల వారీగా కొనసాగిన సర్వే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ జరిగింది. ఆ వివరాలను తాజాగా లాన్సెట్ జర్నల్ ప్రచురించింది.

పట్టణాల్లోనే ఎక్కువ..

తెలుగు రాష్ట్రాల్లోని పట్టణాల్లో 30 శాతం మందికి పైగా హైబీపీతో బాధపడుతుండగా, గ్రామాల్లో 25–30 శాతం మంది బాధపడుతున్నారు. రెండు రాష్ట్రాల్లోని పట్టణాల్లో 10 శాతం కంటే ఎక్కువగా మధుమేహ బాధితులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య 7.4 శాతంగా ఉంది.ఇక 15 శాతం మంది వరకు ప్రీ డయాబెటీస్ (వ్యాధికి ముందు దశ) స్థితిలో ఉన్నారు. పట్టణాల్లో ఇది 10–15 శాతంగా ఉంది. తెలంగాణ గ్రామాల్లో ప్రీ డయాబెటీస్ 15 శాతం వరకు ఉండగా, ఏపీలోని గ్రామాల్లో 10 శాతం వరకు ఉంది.

మరికొన్ని ముఖ్యాంశాలు..

- ఉమ్మడి ఏపీలో ఊబకాయులు 25 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు. పట్టణాల్లో 25 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు. తెలంగాణ గ్రామాల్లో 20 శాతం వరకు ఉన్నారు. గ్రామీణ ఏపీలో 20–25 శాతం మధ్య ఉన్నారు.
- పొట్ట దగ్గర అధిక కొవ్వు పేరుకుపోయిన వారు ఉమ్మడి ఏపీలో 25 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు.
- రక్తంలో అధిక కొలెస్ట్రాల్ ఉభయ రాష్ట్రాల్లోని 20–25 శాతం మందికి ఉంది. అర్బన్ తెలంగాణలో ఇది 20–25 శాతంగా, ఏపీలో 25 శాతం కంటే ఎక్కువగా ఉంద. గ్రామీణ తెలంగాణలో 20–25 శాతం మధ్య, గ్రామీణ ఏపీలో 15–20 శాతం మధ్య ఉంది.
- మంచి కొలెస్ట్రాల్ తక్కువగా ఉన్నవారు తెలంగాణలో 50–60 శాతం మంది ఉండగా, ఏపీలో 60 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 15–20 శాతం మందికి చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంది. రెండు రాష్ట్రాల్లోని పట్టణాల్లో 20–25 శాతం మందికి చెడు కొలెస్ట్రాల్ ఉంది.

పంజాబ్‌లో 51.8 శాతం మందికి హైబీపీ

దేశవ్యాప్తంగా 11.4 శాతం మంది డయాబెటిస్‌తో బాధపడుతున్నట్లు సర్వే నిర్ధారించింది. డయాబెటిస్ ముందు దశలో 15.3 శాతం మంది ఉన్నారు. 35.5 శాతం బీపీతో బాధపడుతుండగా, 28.6 శాతం మంది ఊబకాయంతో ఉన్నారు. పొట్ట దగ్గర కొవ్వు ఎక్కువ ఉన్నవారు 39.5 శాతం మంది ఉన్నారు. రక్తంలో కొవ్వు శాతం అధికంగా ఉన్నవారు 81.2 శాతం ఉన్నారు. అత్యధికంగా గోవాలో 26.4 శాతం మందికి డయాబెటిస్ ఉంది. అతి తక్కువగా యూపీలో 4.8 శాతం మందికి ఉంది. బీపీ బాధితులు అత్యధికంగా పంజాబ్‌లో 51.8 శాతం మంది ఉన్నారు. అత్యంత తక్కువగా మేఘాలయలో 24.3 శాతం మంది ఉన్నారు. దేశంలో ఊబకాయులు 28.6 శాతంగా ఉన్నారు. పాండిచ్చేరిలో ఎక్కువ (53.3 శాతం) మంది, జార్ఖండ్‌లో తక్కువ (11.6 శాతం) మంది ఊబకాయ బాధితులు ఉన్నారు.

> **అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో డయాబెటిస్ అధికం**
>
> అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో డయాబెటిస్ అధికంగా ఉంది. చాలా జబ్బులు పట్టణాల్లో ఉన్నాయి. ప్రీ డయాబెటిస్ గ్రామాల్లో ఎక్కువగా ఉంది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన రాష్ట్రాల్లో షుగర్ తక్కువగా ఉంది. దీర్ఘకాలిక జబ్బులు అధికంగా ఉన్నాయని అధ్యయనం తేల్చింది. ప్రీడయాబెటిస్ స్థితిలో ఉన్నవారిని డయాబెటిస్ వైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. అధిక షుగర్ బాధితుల్లో తదుపరి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది.
>
> – ప్రొఫెసర్ కిరణ్ మాదల, క్రిటికల్ కేర్ విభాగాధిపతి, నిజామాబాద్ మెడికల్ కాలేజీ

నదీ జలాల్లో ప్రమాదాల నివారణపై పరిశోధనకు పేటెంట్

గుంటూరు ఎడ్యుకేషన్: నదీ జలాల్లో ప్రయాణించే క్రమంలో ఎదురయ్యే ప్రమాదాలను నివారించేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చేసిన పరిశోధనకుగాను గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన డాక్టర్ దువ్వూరు రాజేష్ పేటెంట్ పొందారు. నదీ జలాల్లో ప్రయాణించే సమయంలో ఆకస్మికంగా పడవ మునిగిపోయే పరిస్థితుల్లో ముందస్తుగా సమాచారం తెలుసుకోవడం, ప్రమాదానికి సంబంధించి అప్రమత్తం చేసే వ్యవస్థపై 'మల్టీ ఫంక్షనల్ కాస్ట్ ఎఫెక్టివ్ స్మార్ట్ ఫోల్'కు పేటెంట్ లభించింది. ఏయూ ప్రొఫెసర్ హనుమంతు పురుషోత్తమ్ పర్యవేక్షణలో ఐపీఆర్ ద్వారా భారత ప్రభుత్వానికి నమోదు కోసం పంపగా పేటెంట్ లభించినట్లు రాజేష్ తెలిపారు.

మరణంలోనూ వీడని బంధం

వారిద్దరిది రక్త సంబంధం.. మరో ఇద్దరిది మూడుముళ్ల బంధం. మృత్యువుకూడా వారి బంధాన్ని విడదీయలేకపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో అన్నాచెల్లెలు, నవ దంపతులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

- రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి
- ధర్మసాగర్ వద్ద అన్నాచెల్లెళ్లు, మరిపెడ వద్ద నవదంపతుల దుర్మరణం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఘటనలు

ధర్మసాగర్/మరిపెడ రూరల్: ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ తల్లిని పోషించుకుంటున్న అన్నాచెల్లెళ్లు రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం శివారు జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన పోరెడ్డి సుజిత్‌రెడ్డి (26) పోరెడ్డి పూజారెడ్డి (22) అన్నా చెల్లెళ్లు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ తల్లిని చూసుకుంటున్నారు. వారి తండ్రి దేవేందర్‌రెడ్డి కొన్నేళ్ల క్రితం చనిపోగా, తల్లి సుజాత పిల్లలిద్దరిని ఉన్నత చదువులు చదివించింది. కాగా, శుక్రవారం ఉదయం వారు తల్లిని చూసేందుకు హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై నాగారానికి బయలుదేరారు. ఈ క్రమంలో కరుణాపురం శివారులో సుజిత్‌రెడ్డి ద్విచక్ర వాహనం ఓ లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సుజిత్‌రెడ్డి, పూజ అక్కడికక్కడే మృతి చెందారు. చేతికి అందివచ్చిన బిడ్డలిద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లి, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తగారి ఇంటికి వస్తూ..

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రం పూల బజార్‌కు చెందిన గోగునాథ్ గోపి, సునీత దంపతుల కుమార్తె అంజలి (21)ని భూపాలపల్లి జిల్లా చెల్లగరిగె గ్రామానికి చెందిన అనంతరాంసింగ్ కుమారుడు నారాయణసింగ్ (23)కు ఇచ్చి ఈ ఏడాది మార్చి 9న వివాహం జరిపించారు. నారాయణ సింగ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండడంతో భార్యాభర్తలు అక్కడే ఉంటున్నారు. వారాంతం కావడంతో నవదంపతులు శుక్రవారం బైక్‌పై మరిపెడకు బయలుదేరారు. మార్గ మధ్యలో మరిపెడ సమీపంలో జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ, వీరి ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందారు. మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పెళ్లయిన మూడు నెలలకే నవ దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఇరువురి కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943